# చైతన్యం

**సంకల్ప బలం**

మే 2019

రూ. 20





# శ్రీలంకలో ఉగ్రదాడులు





# చైతన్యం
సంకల్ప బలం


సామాజిక విలువల మాస పత్రిక

సంపుటి -8 మే 2019 సంచిక -8



వ్యవస్థాపక సంపాదకురాలు
తీగవరపు శాంతి


## ఈ సంచికలో

### ధారావాహికములు:


| | |
|---|---|
| మానసరోవర యాత్ర | 6 |
| ప్రేమంటే ఇంతే | 12 |
| ముల్లా నస్రుద్దీన్ కథలు | 16 |
| కాశీ ఖండం | 22 |
| తెలుగు పద్య రత్నాలు | 26 |
| సంభాషణ సంస్కృతం | 32 |
| మా ఊరి నందుల కథ | 38 |
| ప్రహేళిక | 46 |


### ప్రత్యేక ఆకర్షణలు


| | |
|---|---|
| సంపాదకీయం | 4 |
| అభిప్రాయ వేదిక | 5 |
| ఒక అన్వేషణ | 9 |
| భక్త రామదాసు అనే కంచర్ల గోపన్న | 18 |
| దైవ చింతనం | 21 |
| బి ఎన్ శాస్త్రి - శాసనాల శాస్త్రి | 28 |
| ఉత్తమ దానం | 36 |
| ధన్వంతరి కారాగారం | 39 |
| గరుడ గర్వ భంగం | 43 |
| సింహాద్రి అప్పన్న చందనోత్సవం | 47 |



రచనలలోని అభిప్రాయాలు రచయితలవి మాత్రమే. పత్రిక యాజమాన్యానికి ఎటువంటి సంబంధమూ లేదు.

# కిల్లర్ బెంచెస్ ---- కిల్లర్ పోల్స్

ఇల్లు కొనుక్కుందాం అని చూడడం మొదలు పెట్టగానే అనేక మంది బిల్డర్లు ఎన్నో రకాల సదుపాయాలతో, తక్కువ ఖర్చులో మా దగ్గర ఫ్లాట్స్ ఉన్నాయంటే మా దగ్గర ఉన్నాయంటూ ప్రజలను పేపర్ల ద్వారా, ఆన్ లైన్ ద్వారా ఏజెంట్ ల ద్వారా ఇలా రకరకాల మార్గాల ద్వారా ప్రజలను కొనే వరకూ ఊదరగొడుతున్నారు. తీరా కొనడానికి వెళ్ళాక ఫ్లాట్ రేటు ఒకటి, చివరికి ఎక్స్ట్రాలు తో కలిపి తడిపి మోపెడు అయ్యేసరికి మధ్యతరగతి వర్గానికి ఇల్లు కొనుక్కోవడం అనేది కలగానే మిగిలిపోతోంది. తీరా ఎలాగో కష్టపడి కొనుక్కున్నాక అక్కడ ఉండే సమస్యలు అనేకం. అలాగే కొనుక్కోలేక అద్దెలకు వెళ్లేవారు పడే సమస్యలు మరో రకంగా ఉంటాయి. సరే.. ఇల్లు కొనుక్కున్నా, అద్దెకు వెళ్లాలన్నా అందరు సాధారణంగా చూసేది ఇల్లు బావుంది.. ఈ రోజుల్లో మంచి నీళ్ల సమస్య ఎక్కువగా ఉంటోంది కాబట్టి మంచి నీళ్లు వస్తాయా? ఇవి ముఖ్యంగా చూసుకుంటున్నారు. వీటితో పాటు సెక్యూరిటీ, SAFTY అంత కన్నా ముఖ్యం . వీటి గురించి ఫ్లాట్ లో ఉన్న వాళ్ళే కాక, ఫ్లాట్ మెయింటెనెన్స్ వాళ్ళు కూడా చాలా అప్రమత్తంగా ఉండాలి. కానీ వీటి లోపం చాలా జరుగుతోంది. ఈ మెయింటనెన్స్ లోపం వల్ల పిల్లలు పెద్ద వాళ్లు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎంత ఇబ్బందులు అంటే ప్రాణాలు కూడా పోతున్నాయి. ఎందుకు ఇలా జరుగుతోంది? అసలు మెయింటెనెన్స్ అంటే ఏమిటి? మెయింటెనెన్సు లోకి ఏమేమి వస్తాయి? ఒక్క క్లీనింగ్, డబ్బులు కలక్షన్, ఏదైనా పండుగలు, పార్టీలు చేసుకోవడమేనా? పార్కులు ఉన్నాయా! పిల్లలు ఆడుకుందుకు? ఉంటే ఎలా ఉన్నయి? అందులో పిల్లలు ఊగే ఉయ్యాలలు సరిగా ఉన్నాయా? పిల్లలు ఎక్కినా పరవాలేదా? అలాగే పిల్లలు ఆడుకుందుకు అన్ని రకాల సదుపాయాలూ ఇచ్చారు అవి అన్నీ పిల్లలకు ఇబ్బంది నష్టం కలిగించేవిగా లేవు కదా! అలాగే కరెంటు స్తంభాలు, వైర్లు పిల్లలకు ప్రమాదం కలిగించేవిగా లేవు కదా! పిల్లలు ఆడుకునేటప్పుడు స్కూటర్లు, కార్లు వారికి ఆటంకాన్ని కలిగించేవిగా, ప్రమాదం కలిగించే విగా లేవు కదా! అలాగే పెద్దవారు నడవడానికి వీలుగా గోతులు అవి లేకుండా అన్ని చోట్ల జాగ్రత్త పాటిస్తున్నారా? ఇక సెక్యూరిటీ వాళ్ళు ఎవరిని పడితే వాళ్లకు లోపలి రావడానికి పర్మిషన్ ఇవ్వడం లేదు కదా! ఇంకా ఏమేమి వీటిలోకి రావాలి అని అన్నీ వివరంగా ఫ్లాట్లో ఉన్నవాళ్ళు, మెయింటైన్ చేసే వాళ్ళు కూడా కలిసి వ్రాసి పెట్టుకుని, నెలకు ఒకసారి మీటింగ్ పెట్టుకుని చర్చించుకుని సరిచేసుకుంటూ ఉండాలి. అంతే కానీ ఎవరికైనా ప్రమాదం జరిగిన తరువాత ఇది మాకు సంబంధం లేదు అని మెయింటనెన్స్ వాళ్ళు, ఫ్లాట్స్ వాళ్ళు, ఎవరికి వారు తప్పించుకునే ప్రయత్నం చేస్తే ప్రమాదం జరిగిన తరువాత ఎవరూ సరిదిద్దుకోలేరు. పోయిన ప్రాణాలు తిరిగి రప్పించలేరు. ఆ తల్లి తండ్రుల కడుపు కోత ఎవరూ తీర్చలేరు.

మానవత్వం.

జరిగే ప్రమాదాలు ఓ పక్క జరుగుతుంటే, మన మానవత్వం ఏమైపోతోంది? ఎక్కడికి వెడుతోంది? ప్రమాదం జరిగితే అది మన కుటుంబానికి సంబంధించినది కాదా? వాళ్ళెవరో మనకి తెలియదా? వాళ్ళని మనం ఎప్పుడూ చూడలేదా? అందుకని మనకి సంబంధం లేదా? మనం పట్టించుకోనక్కరలేదా? ఈ విషయం అత్యంత దారుణం. ప్రమాదం జరిగిన వారు ఎవరో తెలియక పోయినా! మన లాంటి మనిషండీ. బంధుత్వం, స్నేహం తరువాత ఆలోచిద్దాము అవసరమనుకుంటే. ముందు ఆ మనిషి కష్టంలో ఉంటే, ధైర్యం లేక పోయినా ధైర్యం తెచ్చుకుని ఆపద నుండి కాపాడవలసిన కనీస బాధ్యత మనం మనిషిగా పుట్టినందుకు ఉండాలి.. ఇదంతా ఎందుకు చెపుతున్నానో మీకు అర్ధమయ్యింది అనుకుంటా! కొన్నాళ్ల క్రిందట కరెంటు పోల్ పట్టుకుని ఒక బాబు ప్రాణాలు కోల్పోయాడు.

ఈ మధ్య నాలుగు రోజుల క్రిందట హైదరాబాదులోని ఒకఅపార్ట్ మెంట్స్ లో పార్క్ లో ఆడుకుంటూ సిమెంట్ బెంచ్ మీద కూర్చుని అటు ఇటు ఊగుతుంటే , ఆ సిమెంట్ బెంచి విరిగినది కావడంతో 6 సంవత్సరాల బాబు ఆ సిమెంట్ బెంచి బాబు మీద పడటంతో ప్రాణాలు వదిలాడు. అక్కడ వెంటనే వారికి సహాయం అందలేదని, చాలా మంది చూస్తూ, వీడియోలు తీస్తూ చుట్టూ నిలబడ్డారు కానీ ఒక్కరు ముందుకు సహాయానికి రాలేదని ఆరోపణలు వచ్చాయి. మనం అందరం ఆలోచించ వలసింది ఏమిటంటే ఇక్కడ ముఖ్యంగా రెండు తప్పులు జరిగాయి. మెయింటెనెన్స్ వాళ్ళ లోపం వల్ల ఆ బాబు ప్రాణాలు పోవడం. 2. అంత ప్రమాదంలో ఉన్నపుడు కూడా 975 ఫ్లాట్స్ ఉండి కూడా ఆ బాబుని పట్టుకుని ఆటోలో తల్లి ఒక్కతే హాస్పటల్ కి వెళ్లడం అత్యంత బాధాకరం. అందుకే ఫ్లాట్స్ లో ఉన్న వాళ్ళు అందరు కూడా కలిసి, ఎవరికైనా ఆపద కానీ అవసరం కానీ వచ్చినప్పుడు మేము ఎప్పుడు సహాయంగా ముందు ఉంటాము అనే వారివి కొందరి నంబర్లు తీసుకుని అందరికీ డిస్ట్రిబ్యూట్ చేసుకుని అవసరం వచ్చినపుడు ఒకరికొకరు సహాయపడుతూ ఉండాలి. అంతే కానీ మన అంటూ మనవాళ్ళు వచ్చే వరకు సహాయం అందకుండా ఉంటే, అవతలి వారు ఏమైపోతారు? ఇది అన్ని ఫ్లాట్స్ వారు పాటిస్తే బావుంటుందని చైతన్యం పత్రిక భావిస్తోంది.

మనం మనుషులం. బాధ ఎవరిదైనా ఒక్కటే. ఎవరికి ఏ ఆపద వచ్చినా ముందు ఉండి ఒకరికొకరు సహాయం చేసుకోకపోతే, ఈ రోజుల్లో ఉమ్మడి కుటుంబాలు లేవు, సొంత అన్నదమ్ములు అప్ప చెల్లెళ్ళు ఎవరూ మనకు దగ్గరగా సహాయానికి ఉండరు. మనం ఎప్పుడైతే బయటకి వచ్చామో మనమందరం కలిసి ఒకే కుటుంబం. సంతోషం దుఃఖం అన్నీ మనం అందరం కలిసే పంచుకోవాలి.

**మనమంతా ఒకే కుటుంబం.**

తీగవరపు శాంతి

# అభిప్రాయ వేదిక

1. ఉగాది సంచిక చూశాను. ఉగాది గురించి 40 మంది సివిల్ టాపర్ల గురించి, ఎన్నికల గురించి వ్రాసిన మీ సంపాదకీయం, అన్వేషణ గురించి ప్రముఖుల అభిప్రాయాలతో దేవుని గురించి, దైవ శక్తి గురించి వేమూరిగారి వ్యాసం చదివాను. మిగతావి చదవాలి. పుస్తకాన్ని సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దడంలో మీకు మీరే సాటి. ఉగాది శుభాకాంక్షలతో
తుమ్మూరి రాం మోహనరావు గారు ---- హైదరాబాదు.

2. ఈ సంచికను వికారినామ శుభాకాంక్షలతో ప్రారంభించారు. ఈ సంవత్సరము మన అందరికీ మంచి జరగాలని ఆశిస్తు-న్నాను. ముక్తినాద్ హైలెట్. చాలా బావుంది. ముక్తి నాథుని స్థల పురాణం చక్కగా వివరించారు. వేమూరి వెంకటేశ్వర రావు గారు సృష్టి గురించి బాగా చెప్పారు. వింజమూరి అనసూయ, వింజమూరి సీత కళా పోషకులు, సాహిత్య వేత్తలు. వాళ్ళ గురించి ఎంత వివరించినా తనివి తీరదు. శ్రీనాథుని కాసీ ఖండం చాలా ఇంట్రస్ట్ గా ఉంది. స్పోకెన్ సంస్కృతం గ్రామర్తో సహా చక్కగా వివరిస్తున్నారు. రాశి ఫలాలు చూసుకున్నాము. ఎన్నికల ప్రచార ఫోటోలు బావున్నాయి. నాకు తెలిసిన అభిప్రా-యాలు చెప్పాను . శ్రీరామ నవమి శుభాకాంక్షలతో ముగించారు. అందరికీ శ్రీరామ నవమి శుభాకాంక్షలతో
శేషు ---హైదరాబాదు.

3. నా పేరు అరుణా పతంజలి . మీ మాస పత్రికను చదివాను. నా అభిప్రాయాలను తెలియ పరుస్తున్నాను.మీ మానస సరోవర యాత్ర గురించి మాకు తెలియని విషయాలు క్లుప్తంగా తెలియ పరిచారు. ముఖ్యంగా గండకీ నది గురించి మీ ద్వారా తెలుసు-కున్నాము. యాంకర్ భానుమతి గారి ఇంటర్వ్యూ బాగా అనిపిం-చింది. భువన చంద్ర గారు మాకు పత్రిక ద్వారా పరిచయము. ముఖ పరిచయము లేదు. అయినా మాకు వ్యాసాలు చాల బాగా నచ్చుతాయి. ఆయన మహానుభావులు. మీ పత్రిక దిన దినాభివృద్ధి అవ్వాలని కోరుకుంటున్నాను.
అరుణా పతంజలి ----- జనప్రియ --- హైదర్ గూడ..

4. శాంతి మీ బుక్ చాలా చాలా బావుంది ------భానుమతి అనా-తవరం (తూర్పు గోదావరి ) శాంతి ఈ సంచిక చాలా బావుంది
--- సుబ్బలక్ష్మి --కాకినాడ.

5. మళ్ళీ ఒకసారి గండకీ నదీ తీరము, ముక్తినాథుని దర్శనం అయినట్లనిపించింది. మీ వీడియో డాక్యుమెంట్, కామెంటరీ చాలా బాగున్నాయి. చాలా బాగా వ్రాసారు. మంచి సమాచారం అందించారు. మేము ముక్తినాద్ నుండి ఫోకరా, ఖాట్మండ్ వెళ్ళాము. మీ వీడియో ద్వారా మళ్ళీ అవన్నీ చూసినట్లు అని-పించింది. మీ యాత్ర సఫలీకృతం -
- ఆచార్య డా. శనగవరపు కృష్ణమూర్తి శాస్త్రి ఎం.డి.(హోమియో)

6. నూతన ప్రయోగం వీడియోలు. చాలా బాగున్నాయి. శ్రీ వికారినామ సంవత్సర శుభాకాంక్షలు. మన పత్రిక మరింత చైత-న్యవంతమవ్వాలని ఆకాంక్షిస్తూ ... నందుల ప్రభాకర శాస్త్రి గారు. కావలి

7. చాలా బాగుంది పత్రిక. మీ యాత్రా విశేషాలు కళ్ళకు కట్టినట్లు చెప్పారు. మీకు ఎంత థాంక్స్ చెప్పినా తక్కువే. పత్రికలో అన్నీ చాలా బావున్నాయి. భగవంతుడు మిమ్మల్ని చల్లగా చూడాలని ప్రార్థన.
--- అవసరాల సత్యన్నారాయణ గారు ---హైదరాబాదు.

8. సంచిక చూసాను. చాలా బాగుంది. మంచి మంచి రచనలు. ముఖ్యంగా మానస సరోవర యాత్ర. మరీ ముఖ్యంగా వీడియో ... ముక్తీనాద్, గండకీ నది ఐతిహ్యం, ఆ కృష్ణ ప్రసాద్ గారు చెప్పినట్లు వివరించిన తీరూ బాగుంది. ఆ కృష్ణ ప్రసాద్ గారి ఫోటో కుడా పెట్ట వలసింది. ముఖ్యంగా ఆ యాత్రా విశేషాల వివరణ బాగా ఆకట్టుకుంది. ఆ ప్రాంతాలకు తీసుకు వెళ్ళినంత అనుభూతి కలిగింది. థాంక్స్
----- మంగళంపల్లి పాండు రంగ , రాజమండ్రి.

9. "ప్రేమంటే ఇంతే" లో "ఇంద్రగంటి సుబ్బారావు గారు" మమ్మల్నిఅందరినీ పెళ్ళివారిని చేసినంత హడావిడిగా ఉంది కదా. కథ చాలా బావుంది. పాలెపు బుచ్చిరాజు గారు వ్రాసిన "ముల్లా గారి ఓటు కథ " బావుంది. బెదిరింపుకి భయపడి గుమ్మం ముందు పెట్టడం బావుంది. "వేదుల సుబ్రహ్మణ్యం" గారు వ్రాసిన "ఎన్నికల కందములు " ఎన్ని-కల గురించి వ్రాసిన పద్యములు చాలా బావున్నాయి.
శ్రీమతి వర లక్ష్మి , శ్రీ సుబ్రహ్మణ్యం ---- కరీంనగర్. శ్రీ విశ్వ-నాథం, శ్రీ కరుణాకర్ --- ఏలూరు.

10.ఆర్. శర్మ. దంతుర్తి గారు వ్రాస్తున్నవి నిజంగా రత్నాలే. అంత చక్కటి భావంతో సహా అందిస్తున్నారు. " ఆదూరి హైమవతి " గారు వ్రాసిన " తడబాటు" కథ బావుంది. తడబాటుని బట్టి దొంగని పట్టుకోవడం బావుంది. "మాఊరి నందుల కథ" బావుంది. నామ నక్షత్రాన్ని బట్టి అని, అన్నీ వివరంగా వ్రాసారు. బావుంది.
శ్రీమతి రాజ్య లక్ష్మి, శ్రీమతి శాంత, శ్రీ రామారావు --- కాకినాడ. శ్రీ వరహాలరావు, శ్రీ శోభనాధీశ్వరరావు --- తణుకు.

11. "ధన్వంతరి కారాగారం" అంటూ ఉద్యోగాలు, వాటిని బట్టి వివాహాలు కథ బావుంది. ప్రస్తుత కాలానుగుణంగా వ్రాసారు. "ప్రహేళిక " చాలా ఇంట్రెస్ట్ గా ఉంటోంది కానీ కష్టంగా ఉంది కొంతవరకే పూర్తి చేయ గలుగుతున్నాము. "తెలుగు వారి అయోధ్య" అంటూ భద్రాచలం గురించి "కొత్త రామానందం గారు " బాగా వ్రాసారు. "వేసవిలో మలయ మారుతం" అంటూ " వమ్మి భారతి గారు" వేసవిలో తీసుకో-వలసిన జాగ్రత్తల గురించి బాగా చెప్పారు.
శ్రీ రమణారావు, శ్రీ రావు శేఖర్, శ్రీమతి అనసూయ ---- కడప. శ్రీ సుధాకర్, శ్రీమతి అనసూయ, శ్రీమతి లక్ష్మి ---- చైనా విశాఖపట్నం.

# కల నిజమాయె - ముక్తినాథ్ మానస సరోవర యాత్ర

తరువాత మేం హెలికాప్టర్ ఎక్కి, చాలా చాలా ఎంజాయ్ చేస్తూ పోకరా జేరాము. మీరు తిరుగు ప్రయాణం వీడియో కుడా చూడవచ్చు. మేము అందరం పైలెట్ తో సరదాగా ఫోటోలు కూడా తీసుకున్నాం.

హెలికాప్టర్ దిగే స్థలం కొంచెం దూరంగా ఉండటంతో, నడుచుకుంటూ లగేజ్ ఏరియా కి వెళ్ళాము. మాతో పాటే మా వెనకాలే మా లగేజ్ ని ఒక ట్రాలీ లో తీసుకువచ్చారు వాళ్ళు. వెరిఫై చేసుకుని మా లగేజ్ మాకు ఇచ్చారు. అలా సామాన్లు తీసుకుని ఎయిర్ పోర్ట్ బిల్డింగ్ నుంచి బయట పడ్డాం.

అక్కడ రెడీగా మా డ్రైవర్ విష్ణు దత్, ఫోక్స్ వాగన్ కారుతో సిద్ధంగా ఉన్నాడు. సామాన్లు డిక్కీ లో పెట్టి కార్ స్టార్ట్ చేసాడు. దారిలో ఎయిర్ లైన్స్ ఆఫీస్ దగ్గర ఆపి మేము కేన్సిల్ చేసుకున్న టిక్కట్ల రిఫండ్ కి ఒక అప్లికేషన్ ఇచ్చాము. రెండు రోజుల్లో మా అకౌంట్ కి డబ్బు క్రెడిట్ అవుతుందని చెప్పాడు అక్కడ గుమాస్తా.

ముక్తినాద్ వెళ్తున్నప్పుడు పోఖరా హోటల్ లో కొంత లగేజ్ పెట్టి వెళ్లాం కదా, అవి కలెక్ట్ చేసుకుని వెళ్లాం అని డ్రైవర్ కి చెప్పాం. ఆ అవసరం లేదు మేడం, మీకు టైం సేవ్ చేద్దామని హోటల్ నుంచి మీ సామాన్లు నేను లోడ్ చేసుకుని వచ్చేసాను అని అన్నాడు. అతన్ని మెచ్చుకోలేకుండా ఉండలేకపోయాం. ఎందుకంటే అప్పటికే మధ్యాహ్నం 12 గంటలు కావస్తోంది. ఇంకా మేము మనో కామనా మాత గుడిని దర్శించుకోవలసిఉంది. అది అవంగానే తొందరగా ఖాట్మండూ లో హోటల్ కి చేరుకోవాలి. అక్కడ మా కైలాష్ మానస సరోవర్ ట్రిప్ కి బ్రీఫింగ్ ఉంది. దానికి అందుకోవాలి. మొత్తం బ్యాచ్ అందరికీ ఒకేసారి బ్రీఫింగ్ ఇస్తామని చెప్పారు ట్రావెల్స్ వాళ్ళు. ఆ ట్రిప్ వాళ్ళందరూ ఇప్పటికే హోటల్ లో చెక్ ఇన్ అయిఉన్నారు.

మరొక్కసారి మళ్ళీ ఆ అన్నపూర్ణ గిరి శిఖరాలను తృప్తిగా చూసుకుని, మళ్ళీ దర్శన భాగ్యము ఎప్పుడో కదా అనుకుని మనో కామనా గుడికి బయలుదేరాం.

ముందర మనం కురింటార్ అనే ప్రదేశం చేరుకోవాలి. పోఖరా నుంచి దగ్గర దగ్గర మూడు గంటల ప్రయాణం ఉంది. అలా ప్రకృతి అందాలు ఆస్వాదిస్తూ కురింటార్ చేరుకున్నాం. ఇది గోర్ఖా జిల్లాలో ఉంది. ఇక్కడ నుంచే మనో కామనా గుడికి వెళ్ళటానికి కేబుల్ కార్లు బయలు దేరతాయి. మమ్మల్ని ఆ కేబుల్ కార్ స్టేషన్ లో దింపేసి, మీరు పైకి వెళ్లి గుడి చూసుకుని రండి మేడమ్, నేను ఇక్కడ వేచి ఉంటాను అని చెప్పాడు డ్రైవర్. కేబుల్ కార్ టికెట్, రాను పోను, మనిషికి 500 ఇండియన్ రూపాయలు (700 నేపాలీ రూపాయలు). మనం పోఖరా వెళ్తున్నప్పుడే, డ్రైవర్ సలహాపై, ఈ కేబుల్ కార్ టికెట్ కొనుక్కుని ఉన్నాం కాబట్టి ఇప్పుడు టికెట్ క్యూలో నుంచునే శ్రమ తప్పింది. డ్రైవర్ ముందుచూపును మనసులో అభినందించుకుంటూ స్టేషన్ లో అడుగు పెట్టాం.

గడియారం ముళ్ళు తిరుగుతున్నట్లు కేబుల్ కార్లు వస్తున్నాయి పోతున్నాయి. పైనుంచి వచ్చినవాళ్ళు కార్ (గ్లాస్ కేబిన్) లోంచి దిగగానే పైకి వెళ్ళాల్సిన వాళ్ళని ఎక్కించి కేబిన్ డోర్ క్లోజ్ చేస్తారు. ఆ కేబిన్ పైకి వెళ్ళటం ప్రారంభిస్తుంది. చూడటానికి భలే సరదాగా ఉంది.

1998 వ సంవత్సరం దాకా ప్రజలు గుడికి వెళ్ళటానికోసమై పర్వత మార్గాల్లోంచి ట్రెక్కింగ్ చె-



య్యవలసి వచ్చేది. ఆ సంవత్సరం ఒక ఆస్ట్రియా దేశపు కంపనీ సహకారంతో ఈ కేబుల్ కార్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. మొత్తం ఇక్కడ 300 కార్లు క్రిందనించి పైకి, పైనుంచి క్రిందకి తిరుగుతూనే వుంటాయి. ఈ వ్యవస్థకి పవర్ ఫెయిల్ అయినప్పుడు జనరేటర్ బ్యాక్ అప్ ఉంటుంది. ఇది నూటికి నూరు శాతం 'ఫెయిల్ సేఫ్' అని చెబుతారు. మనం ఒకసారి కార్ ఎక్కిన తరువాత గ్లాస్ డోర్స్ క్లోజ్ చెయ్యగానే అవి మళ్ళీ పైకి గమ్యం చేరిన తరువాత గానీ తెరుచుకోవు. నిర్భయంగా అందులో మనం ప్రయాణం చెయ్యవచ్చు.

కొండ దిగువ సముద్రపు మట్టానికి 258 మీటర్ల ఎత్తు ఉంటుంది. కొండ పైన 1302 మీటర్ల ఎత్తు ఉంటుంది. అంటే ఈ కార్లు మనని ఒక కిలో మీటర్ ఎత్తుకి తీసుకువెళతాయి అనమాట. ఊహించుకుంటేనే ఒళ్ళు జలదరిస్తుంది. దీంట్లో ప్రయాణం చేస్తుంటే చాలా థ్రిల్లింగ్ గా ఉంటుంది. మొత్తం గ్లాస్ తో చేసిన కేబిన్ అవటంతో చుట్టూ 360 డిగ్రీల 'వ్యూ' లభిస్తుంది. పచ్చటి కొండలపైనుంచి, లోయల మీద నుంచి, జలపాతాల మీద నుంచి జరిగే ప్రయాణం అనుభూతి వర్ణనాతీతం. ఇది అనుభవించి తీరాల్సిందే. ఒక్కో కేబిన్ లో 6 గురు కూర్చోవచ్చు. ఎదురెదురుకుండా ముగ్గురు ముగ్గురు అనమాట.

ఈ మనో కామనా మాత గుడి పగోడా ఆకారంలో ఉంటుంది. ఇది 17 వ శతాబ్దంలో నిర్మితమయింది. ఇది పార్వతీ మాత అవతారమైన భగవతీ దేవి గుడి. భక్తుల మనసులో కోరికలు తీర్చే ఈ మాతని మనో కామనా దేవి అని భక్తులు పిలుస్తారు. ఎక్కడెక్కడినుంచో ఈ మాత దర్శనానికి భక్తులు వస్తూంటారు.

ఈ గుడి స్థల మహాత్యం గురించి నేను తెలుసుకున్నది మీకు చెపుతాను. గోర్ఖా రాజు రామ్ షా 17వ శతాబ్దంలో రాజ్యం చేస్తుండేవాడు. అతని రాణి ఒక దేవత అని ఆ రాజుకి తెలియదు. ఒకరోజు ఆ రాణిని దేవతా రూపంలో రాజు చూడటం తటస్థిస్తుంది. ఈ విషయం లఖాన్ థాపా అనే భక్తుడికి రాజు చెపుతాడు. కాని ఆ భక్తునికి ఈ విషయం ముందే తెలుసు. ఈ రహస్యం తనకి తెలిసిందని రాజు రాణికి చెప్పిన తరువాత, ఆ రాజు అకస్మాత్తుగా మృత్యువాత పడతాడు. ఆనాటి ఆచారాల ప్రకారం ఆయన భార్య సతీ సహగమనానికి పూనుకుంటుంది. అలా చెయ్యవద్దని భక్తుడు లఖాన్ థాపా బ్రతిమిలాడతాడు. ఆ రాణి (దేవత) తను 6 నెలలలో తిరిగి పుడతానని అతనికి చెప్పి, ఓదార్చి సహగమనం చేస్తుంది.

6 నెలల తరువాత ఒక రైతు పొలం దున్నుతుండగా ఒక రాతి విగ్రహం బయటపడుతుంది. ఆ రాతినుండి రక్తం మరియు పాలు స్రవిస్తుంటాయి. ఈ విషయం తెలిసిన లఖాన్ థాపా ఆ విగ్రహాన్ని బయటకి తీసి మంత్రాలతో పూజలు నిర్వహిస్తాడు. అలా చేయగానే రక్తము మరియు పాలు కారటం ఆగిపోతాయి. ఆ దేవతే తిరిగి ఆవిర్భవించిందని గ్రహించి గుడి కట్టించి పూజలు మొదలెడతాడు. ఇప్పటికీ ఆనాటి లఖాన్ థాపా వంశీకులే ఆ గుడిలో పూజలు నిర్వహిస్తూంటారు.

ఈ దేవి కి కుంకుమ, బాదం, కుంకుమపువ్వు, జేగంట, వక్క, అగర బత్తి, దీపం, ఎర్రని వస్త్రం, పళ్ళు మరియు బియ్యం నైవేద్యంగా భక్తులు సమర్పిస్తుంటారు. ఈ గుడికి వచ్చి దేవిని దర్శించి, మనసులో కోరిక కోరుకుని, ఆ కోరిక తీరిన తరువాత తిరిగి దేవిని దర్శించుకోవటం భక్తుల ఆచారం. నాగ పంచమి మరియు కార్తీక పంచమి సందర్భాలలో భక్తుల రద్దీ చాలా ఎక్కువగా ఉంటుంది.

పైకి వెళ్ళిన తరువాత మా కేబుల్ కారు తలుపులు తెరిచారు అక్కడ సిబ్బంది. అక్కడ నుంచి సుమారు అర మైలు దూరంలో గుడి ఉంటుంది. ఆ దారి కూడా మెట్ల మార్గమే. ఎక్కుకుంటూ పోవాలి. దారిలో ఎన్నో దుకాణాలు ఉన్నాయి. హోటల్లు కూడా ఉన్నాయి. మేము దేవికి సమర్పించదలచుకున్న చీర, పసుపు కుంకుమ, దీపాల కోసం ఆవు నెయ్యి, వత్తులు ఇండియా నుండి తీసుకు వెళ్ళాము. మిగిలిన కొబ్బరికాయ లాంటి పూజ సామగ్రిని కొనుగోలు చేశాం. గుడికి వెళ్ళేటప్పటికి అక్కడ చాలా పెద్ద క్యూ లైన్ కన్పించింది. అలాగే లైన్ లో నుంచున్నాం. మా అవకాశం వచ్చేసరికి రెండు గంటల పైనే పట్టింది.

గుడి దగ్గరకి వెళ్లేసరికి తెలిసింది గుడికి రిపైర్లు నిర్వహిస్తున్నారని. భక్తుల్ని ఎవ్వరినీ గుడిలోకి అనుమతించట్లేదు. గుడి చుట్టూ స్కఫోల్డింగ్ కట్టబడి ఉంది. ఇంకా రెండు నెలలు పడ్తుందట మొత్తం రెనోవేషణ్ పూర్తి అవటానికి. భక్తుల సౌకర్యార్థం ఉత్సవ విగ్రహాలను, పక్కన ఒక చిన్న షెడ్ లాంటిది కట్టి, అందులో ఉంచారు. అక్కడే అమ్మవారిని దర్శించుకున్నాం. సరదాగా గుడి దగ్గర ఫోటోలు తీసుకున్నాం. అమ్మవారిని దర్శించుకున్న తరువాత మనసుకి ఎంతో ప్రశాంతత లభించినట్లు అయ్యింది.

అమ్మవారిని భోజనంచేయకుండా దర్శించుకుందామని వెళ్లాం ఏమో ఇప్పుడు ఆకలి మొదలయ్యింది. మళ్ళీ నడచుకుంటూ కేబుల్ కార్ స్టేషన్ కి వచ్చి కేబుల్ కారులో తిరుగు ప్రయాణం ప్రారంభించాము. అంత ఎత్తు నుండి కేబుల్ కారు క్రిందకి దిగటం ప్రారంభం అవగానే వొళ్ళు గగుర్పొడిచింది. నిజంగా చూడవలసిన దృశ్యం అది. కారు నెమ్మదిగా త్రిశూల్ నది మీదగా క్రిందకి దిగింది. అక్కడ నుండి బయటకి వచ్చి, క్రింద స్టేషన్ దగ్గర ఏవో స్నాక్స్ కొనుక్కుని తిన్నాం. అప్పటికి సాయంత్రం నాల్గున్నర అయింది. వెంటనే మా కారు ఎక్కి ఖాట్మండు బయలుదేరాం.

మేము ఇంకా వెనక్కి రాలేదని అక్కడ మా ట్రావెల్స్ వాళ్ళు కంగారు పడ్డారు. మా డ్రైవర్ కి ఫోన్ల మీద ఫోన్లు, ఎక్కడునారు, ఇంకా ఎంతసేపు పడ్తుంది అంటూ. మేం అక్కడ చేరేటప్పటికి సాయంత్రం ఏడున్నర అలా అవ్వచ్చని డ్రైవర్ చెప్పటంతో, వాళ్ళు ప్లాన్ మార్చుకున్నారు. ప్రస్తుతం హోటల్ లో ఉన్నవాళ్ళు, అంటే, మానస సరోవరం బస్సులో వెళ్ళే మిగతా 30 మందికి బ్యాచ్ వాళ్లకి బ్రీఫింగ్ ఇచ్చెయ్యడానికి, మేం చేరిన తరువాత మాకు విడిగా ఇంకొక సెషన్ పెట్టి బ్రీఫింగ్ ఇవ్వడానికి నిశ్చయించుకున్నారు. అంతేకాదు, మానససరోవరం వెళ్ళే బ్యాచికి అందరికీ కలిపి ఒకే సారి ఖాట్మండు సైట్ సీయింగ్ అంటే అక్కడ ఉన్న పశుపతినాద్ టెంపుల్ వగైరా అన్నీ చూపిద్దామనుకున్నారు. కానీ మాకు ఆలశ్యమవ్వడంతో, మాకు విడిగా మానస సరోవరం వెళ్లివచ్చాక చూపించవచ్చని, మిగిలిన వారందరికీ ఖాట్మండు ఊరు చూపించారు.

ఆ విధంగా సాయంత్రం దగ్గర దగ్గర ఎనిమిది గంటలు అవుతుండగా మేము మా 'హోటల్ లె హిమాలయ' లో అడుగుపెట్టాం.

అప్పటికే అక్కడ మాకోసం వేచియున్న ట్రావెల్స్ సూపర్వైజర్, మా దగ్గరికి వచ్చి, మీరు మీ రూమ్ కి తర్వాత వెళ్ళచ్చు, ఒక్క పది నిముషాలు నాకు టైం స్పేర్ చేస్తే, మీకు అన్ని వివరాలు తెలుపుతాను అంటూ రిక్వెస్ట్ చేశాడు.

**(మళ్ళీ వచ్చే నెల కలుద్దాం)**

# వేమూరి వేంకటేశ్వరరావు



## ఒక అన్వేషణ

(గత సంచిక తరువాయి)

ఈ విశ్వంలో ఏ రెండు వస్తువులని తీసుకున్నా వాటి మధ్య ఒక రకం ఆకర్షణ (attraction) ఉంటుందని న్యూటన్ ఉద్ఘాటించేడు. పండిన పండు చెట్టుని వదలి వినువీధిలోకి రివ్వున ఎగిరి పోకుండా భూమి మీద పడటానికి కారణం పండుకీ, భూమికీ మధ్య ఉన్న పరస్పరమైన ఆకర్షణే.

ఇదే విధమైన ఆకర్షణ భూమికి, చంద్రుడికి మధ్య ఉండటం వల్లనే చంద్రుడు భూమి చుట్టూ తిరుగుతున్నాడు. నిజానికి భూమికి, చంద్రుడికి మధ్యనున్న ఈ ఆకర్షణకి చంద్రుడు భూమి మీదో, భూమి చంద్రుడి మీదో వెళ్లి పడాలి. ఇది ఎందుకు ఇలా జరగటం లేదో గణిత సమీకరణాలు రాసి సులభంగా చూపవచ్చు. గణితం లేకుండా చెప్పాలంటే ఉపమానాలు ఉపయోగించ వచ్చు. ఉదాహరణకి ఒక రాయిని జోరుగా ఎదటికి విసిరేమనుకుందాం. అది కొంత దూరం ఒంపు తిరిగిన మార్గంలో వెళ్లి, చివరికి భూమి ఆకర్షణ కారణంగా భూమి మీద పడుతుంది. ఆ రాయిని ఇంకా జోరుగా విసిరితే మరికొంచెం దూరం వెళ్లి కింద పడుతుంది. ఇంకా చాలా బలంతో రాయిని గిరవాటు వేస్తే – అంటే, ఆ రాయి ప్రయాణం చేసే ఒంపు గుండ్రంగా ఉన్న భూమి ఒంపుకి దీటుగా ఉండటానికి సరిపోయే అంత జోరుగా విసిరితే - ఇహ ఆ రాయి సతతం అలా "కింద" పడటానికి ప్రయత్నం చేస్తూనే ఉంటుంది, కాని పడలేదు; అప్పుడు ఆ రాయి భూమి చుట్టు ప్రదక్షిణం చేస్తుంది. కృతిమ ఉపగ్రహాలని భూమి కక్ష్య లోనికి ఎక్కించటానికి రాకెట్లు చేసే పని ఇలాంటిదే. అదే విధంగా చంద్రుడు భూమి మీద పడలేక భూమి చుట్టూ తిరుగుతు న్నాడు. ఇదే విధంగా భూమి వెళ్లి సూర్యుడి మీద పడటానికి ప్రయత్నం చేస్తోంది; కాని భూమి సూర్యుడి చుట్టూ తిరిగే పరిభ్రమణ వేగం వల్ల సూర్యుడి మీద పడలేక సూర్యుడి చుట్టూ తిరుగుతోంది.

ఈ గురుత్వాకర్షణ విశ్వ వ్యాప్తం అని న్యూటన్ గమనించేడు కానీ, ఈ ఆకర్షణ ఎందుకు ఉందో కారణం చెప్పలేకపోయాడు. ఈ ప్రశ్నకి అయిన్‌స్టయిన్ సమాధానం చెప్పేడు. ఆయిన్‌స్టయిన్ ఉద్ఘాటించిన సాధారణ సాపేక్ష సిద్ధాంతం (General Theory of Relativity) ఆధారం చేసుకుని ఈ గురుత్వాకర్షణకి కారణం ఒక ఉపమానం సహాయంతో వివరిస్తాను. ఈ ఉపమానానికి ఒక ఊహాలోకంలో మనం ఒక ప్రయోగాన్ని సృష్టించుకోవాలి. ఇటువంటి ఉహాలోకపు ప్రయోగాలని ఊహా ప్రయోగాలు లేదా స్ఫురణ ప్రయోగాలు (thought experiments) అందాం.

ఈ ఉపమానానికి ఒక ప్రదేశం (space), ఆ ప్రదేశంలో పదార్థం (matter) కావాలి. ప్రదేశానికి ఒక పెద్ద జంబుఖానాని ఊహించుకుందాం. ఊహే కనుక, ఈ జంబుఖానా రబ్బరు గుడ్డతో చేసినది అని అనుకుందాం. ఈ రబ్బరు జంబుఖానాని నాలుగు పక్కలా గట్టిగా లాగి పట్టుకుందాం. ఈ జంబుఖానా ఉన్న మేరని మనం "విశ్వం" అని అనుకుందాం. ప్రస్తుతానికి ఈ విశ్వం అంతా జంబుఖానా అనే ప్రదేశం ఆక్రమించుకుని ఉంది. ఈ ప్రదేశం



చైతన్యం

సాపుగా, చదునుగా, ముడతలు, ఒంపులు లేకుండా ఉంది కదా.

ఇప్పుడు ఈ విశ్వం మీద చిన్న "నల్లపూస" అనే పదార్థాన్ని వేసేమని అనుకుందాం. ఈ నల్ల-పూసలో పదార్థం తక్కువగా ఉంది కనుక దీని వల్ల మన జంబుఖానా ఆకారం ఏమీ మారదు. ఎక్కడ వేసిన పూస అక్కడే ఉంటుంది కదా? ఇప్పుడు ఈ జంబుఖానా మీద పెద్ద కొబ్బరి బొండాం పెట్టే-మనుకుందాం. కొబ్బరి బొండాం అనే పదార్థం జంబుఖానా అనే ప్రదేశం మీద పెట్టగానే ఆ ప్రదే శం ఆకారమే మారిపోయిం-ది. కొబ్బరి బొండాం ఉన్న చోట రబ్బరు జంబుఖానాలో ఒక లొత్త పడుతుంది. అంటే ఏమిటన్న మాట? ప్రదేశం ఆకారం ఆ ప్రదే-శంలో ఉన్న పదార్థం మీద ఆధా-రపడి ఉంటుంది. (ఇదే విధంగా విశ్వం యొక్క ఆకారం కూడ విశ్వంలో ఉన్న పదార్థం మీద ఆధారపడి ఉంటుంది.)

లొత్త పడగానే ఇందాకటి నల్ల-పూస జరజరా జారి ఆ లొత్తలో పడుతుంది. జంబుఖానా మన కళ్లకి కనబడుతోంది కనుక ఆ జంబుఖానా మీద ఆ పూస "జారు"తోన్నట్లు అనిపిస్తుంది. ఇప్పుడు ఈ జంబుఖానాని మన కంటికి కనబడని గుడ్డతో చేసే-రనుకుందాం. అప్పుడు కూడ నల్లపూస జారి బొండాం దగ్గరకి వెళుతుంది. కాని జంబుఖానా కనబడటంలేదు కనుక కొబ్బరి బొండాం నల్లపూసని ఆకర్షిస్తూ-న్నట్లు భ్రమ పడతాం. ఈ భ్రమే గురుత్వాకర్షణ అంటారు అయి-న్స్టయిన్. ఇది రజ్జు సర్ప భ్రాంతి లాంటి భ్రమ. ఈ ప్రయోగం జరిగే వరకు కొబ్బరి బొండాం నల్ల-పూసని ఆకర్షిస్తున్నాదనే అను-కున్నాం. ప్రయోగం అయిన తరువాత - అంతా అర్థం అయిన తరువాత – ఆకర్షణా లేదు, గీ-కర్షణా లేదు, అంతా ప్రదేశంలో ఉన్న ఒంపు వల్ల మనకి అక్కడేదో ఆకర్షక శక్తి ఉందని మనం భ్రమ పడుతున్నాం.

అయితే ఈ గురుత్వాకర్షణేనా కారణాలన్నిటికి కారణమైన ఆది శక్తి?

## 5. ఆది శక్తి

ఆది శక్తి (primeval energy) అసలు స్వరూపం అర్థం అవాలంటే అయిన్స్టయిన్ ప్ర-వచించిన మరొక సూత్రాన్ని అర్థం చేసుకోవాలి. ఆయిన్స్టయిన్ చేసిన పనేమిటో చాల మందికి అర్థం కాకపోయినా ఆయన పేరుతో చెలామణీ అయే ఒక గణిత సమీకరణం చాలమందికి తెలుసు. అదే $E = mc^2$ అన్న సమీకరణం. ఈ సమీకరణం లో c అంటే వెలుగు వేగం. $c^2$ అంటే వెలుగు వేగాన్ని వెలుగు వేగంతో గుణించగా వచ్చిన లబ్ధం. ఈ సమీకరణం ప్రకారం విశ్వం అంతా పదార్థం (m), శక్తి (E) అనే రెండింటి మయం. ఈ రెండింటికి తేడా లేదు. ఈ విశ్వాన్ని పదా-ర్థంగానైనా ఊహించుకోవచ్చు, శక్తిగానైనా ఊహించుకోవచ్చు. ఈ రెండూ ఒకదానికి మరొకటి రూపాంతరాలు. ఒకటి బొమ్మ అయితే, మరొకటి బొరుసు.

ఉదాహరణకి ఒక అణువు (atom) ని తీసుకుందాం. వడ్ల-గింజ మొనలో ఉన్నంత పదార్థం ఉన్న ఈ అణువులో ఆత్మ ఉందని ("నీవారశూకవత్తన్వీ పీ-తాభాస్వత్వణూపమా") వేదంలో ఉన్న మంత్రపుష్పం చెబుతోంది. అంత సూక్ష్మమైనంత పదార్థం-లో ఆత్మ ఉందో లేదో తెలియదు కాని, ఆ అణువులో ఉన్న శక్తి విడుదల చెయ్యగలిగితే మనకి "అణుబాంబు" వస్తుంది. అణు-గర్భంలో అంత శక్తి ఇమిడి ఉంద ని పైన ఉదహరించిన $E = mc^2$ అన్న సమీకరణం చెబుతోంది.

ఈ స్థూల ప్రపంచం అంతా అణువుల సమూహం. ఈ విశ్వం లో ఎన్ని అణువులు ఉన్నాయి? ఒకటి తరువాత 80 సున్నలు చుడితే ఎంత సంఖ్య వస్తుందో ($10^{80}$) అన్ని అణువులు ఉన్నా-యని ఒక అంచనా ఉంది. ఈ అణువులు అన్నీ స్థూల రూపంలో ఉన్న శక్తి. ఈ అణుగర్భాలలో ఉన్న శక్తి అంతా ఒకేసారి స్థూల రూపం వదలి నిజ రూపం ధరిస్తే వచ్చే శక్తి ఎంతుంటుందో అయిన్స్ట-యిన్ సమీకరణం ఉపయోగించి

లెక్క కట్టవచ్చు. కాంతి వేగం క్షణానికి ఉరమరగా 300,000,000 మీటర్లు అని వేసుకుని, ఒకొక్క అణువు సగటు గరిమ (mass) ఎంతుంటుందో చూసుకుని లెక్క వెయ్యవచ్చు. ఈ పని చదువరులకి వదలిపెడతాను. మీకు వచ్చిన సమాధానం ఆది శక్తిలో ఉన్న శక్తి!!

ఏదో మాటవరసకి చదువరులకి లెక్క కట్టమని ఇచ్చేను కాని, ఈ సంఖ్య ఊహకి అందనంత పెద్దగా ఉంటుంది. అంత పెద్ద పెద్ద సంఖ్యలని ఊహించుకోవటం కష్టం. అందుకని కొంచెం సాయం చేస్తాను.

మొట్టమొదటి అణుబాంబుని జపాను మీద పేల్చే ముందు, అది అనుకున్నట్లు పేలుతుందో లేదో చూసుకోటానికి, అమెరికాలో, నూ మెక్సికోలో ఉన్న ఒక ఎడారిలో, ఒక బాంబుని ప్రయోగాత్మకంగా పేల్చేరు. ఆ ప్రయోగానికి పెద్ద ఆపెన్‌హైమర్ అనే ఆసామీ. ఈ బాంబులో ఉన్న యురేనియంలో కేవలం 600 మిల్లిగ్రాముల యురేనియం మాత్రం శక్తిగా మారింది. ఈ శక్తిని చూసి అది వర్ణనకి అందని దృశ్యం అనిన్నీ, కాదూ, కూడదు వర్ణించాలంటే ఒకే ఒక మార్గం ఉందని చెప్పి, భగవద్గీతలోని, **"దివిసూర్యసహస్రస్య భవేద్యుగపదుద్ధితా, యది భాః సదృశీ సా స్యాద్ భాసస్ తస్య మహాత్మనః"** అన్న శ్లోకాన్ని చదివి అలా ఉందన్నారుట, ఆపెన్‌హైమర్!

అంటే ఏమిటి? వెయ్యి సూర్యబింబాలు ఆకాశంలో ఒకే సారి ప్రకాశిస్తే ఎలా ఉంటుందో అలా ఉంది అని అర్థం కదా. కేవలం 600 మిల్లిగ్రాముల పదార్థం పేలితేనే ఆయనకి నోరెండిపోయి భగవద్గీతలోని శ్లోకం గుర్తుకి వచ్చేస్తే, విశ్వంలో ఉన్న అణువులలో ఉన్న శక్తి అంతా ఒకేసారి విడుదల అయితే దానిని వర్ణించటం మన తరమా? దానిని ఊహించగలిగినా గలగలేకపోయినా అదే ఆది శక్తి అనే భావం ప్రబలంగా వ్యాప్తిలో ఉంది.

**"యద్ యద్ విభూతిమత్ సత్వం శ్రీమదూర్జితమేవవా, తత్తదేవావ గచ్ఛత్వం మమతేజోంశ సంభవం"** అని అన్నాడు కనుక విశ్వంలోని శక్తులు కాని, పదార్థములు కాని ఈ తేజస్సు యొక్క అంశలే.

### *6. ఆది శక్తికీ గురుత్వాకర్షణకీ సంబంధం ఏమిటి?*

సృష్ట్యాదిలో ఉన్నది ఆది శక్తి. దీనినే భౌతిక శాస్త్రవేత్తలు ఆది జ్వాల (primeval fireball) అని కూడ అంటారు. మనం బ్రహ్మాండం అని అంటాం. ఈ బ్రహ్మాండం ఎప్పుడు, ఎలా వచ్చిందో, ఎంత సేపు అలా జ్వాలా (తేజో) రూపంలో ఉందో ఎవ్వరికీ తెలియదు. ఈ బ్రహ్మాండం ఎంత మేర స్థలం ఆక్రమించిందో కూడ ఎవ్వరికీ తెలియదు. 'ఎంత మేర, ఎంత సేపు?' అనే ప్రశ్నలకి ఈ సందర్భంలో అర్థం లేదని కొందరి వాదన. ఎందుకంటే ఆది శక్తి ఇలా తేజోరూపంలో ఉన్నప్పుడు స్థలం, కాలం ఇంకా పుట్టలేదు. స్థలం లేనప్పుడు "మేర" కి అర్థం లేదు. కాలం లేనప్పుడు "సేపు" కి అర్థం లేదు.

విపరీతమైన తేజస్సుతో, విపరీతమైన వేడితో వర్ధిల్లుతూన్న ఈ తేజో రూపం, ఈ బ్రహ్మాండం, ఒక శుభముహూర్తంలో, అకస్మాత్తుగా ఫెళ్లున పేలిపోయింది ట. ఇలా విచ్ఛిత్తి పొందిన బ్రహ్మాండం నుండి నాలుగు ప్రాథమిక బలాలు (four fundamental forces) పుట్టుకొచ్చేయి. ఇలా సృష్టి ఆరంభంలో పుట్టిన నాలుగు బలాలలో ఒకటి గురుత్వాకర్షణ బలం (gravitational force). మరొకటి విద్యుదయస్కాంత బలం(electromagnetic force). మూడవది త్రాణిక బలం (strong force). నాలుగవది నిస్త్రాణిక బలం (weak force). ఈ చతుర్విధ బలాల జననమే సృష్టికి మొదలని అనుకోవచ్చు. ఈ పేలుడు లోనే స్థలం (space), కాలం(time)కూడ పుట్టేయి. పేలుడుతో ప్రదేశం వ్యాప్తి చెందటం మొదలయింది. ఇలా వ్యాప్తి చెందిన ప్రదేశం వికిరణం (radiation) తోటీ, పదార్థం (matter) తోటీ నిండటం మొదలయింది.

(20 వ పేజీ చూడండి)

# ఇంద్రగంటి వేంకట సుబ్బారావు

# ప్రేమంటే ఇంతే



(గత సంచిక తరువాయి)

అప్పుడే గదిలోకి అనూరాధ పెద్ద వదినగారు కవితకి పరిస్థితి అర్థం కాక వైదేహి వంక చూసింది, వైదేహి విషయం చెప్పింది. "అనూ ఏమిటి ఇది? ఇన్నేళ్ళ తరువాత గతాన్ని తలచుకొని బాధ పడుతున్నావు, జీవితంలో ఎన్నో ఒడిదుడుకులని ధైర్యంగా ఎదుర్కొన్నావు, ఇప్పుడేమిటి ఇలా? అదీగాక ఇది పెళ్ళివారి ఇల్లు, నువ్వు ఈ ఇంటి ఆడపడుచువి, అలా కంటతడి పెట్టకూడదు" అని ఓదార్చింది కవిత.

కవిత అన్న మాటలలో పెళ్ళివారిల్లు, ఆడపడుచు, కంటతడి పెట్టకూడదు వంటివి అనూరాధ మీద బాగానే ప్రభావం చూపాయి. వెంటనే తనని తాను నిగ్రహించుకొని ఏడుపు ఆపి..."అవును, నా వల్ల ఇక్కడ ఎవరికీ ఎలాంటి అసౌకర్యం కలగకూడదు" అని తనలో తాను అనుకుంది.

కృష్ణమోహన్ వున్న గదిలోకి చంద్రం వచ్చి "ఒరేయ్ మోహన్, మూడున్నర అయ్యింది, పద బిల్డర్ దగ్గరకి వెళదాము" అన్నాడు. "అలాగే" అని ముఖం కడుగుకొని ఫ్రెష్ అవడానికి బాత్‌రూంకి వెళ్ళాడు కృష్ణమోహన్.

"చంద్రం మీ అన్నయ్య బాగా కలతగా వున్నారు, ఆయనని డ్రైవ్ చెయ్యనియ్యద్దు" అంది రుక్మిణి. "అనూరాధని చూసేనా వీడు కలత చెందాడు? ఇదేమిటి ఇన్నేళ్ళయినా వీడు గతం మరచిపోకుండా ఇలా ప్రవర్తిస్తున్నాడు" అని తనలో తాను అనుకున్నాడు చంద్రం. "ఈయనది చాలా సున్నితమైన మనస్తత్వం. కొంతమంది కొన్ని విషయాలు ఎప్పటికీ మరచిపోలేరు" అని మనసులో అనుకుంది రుక్మిణి.

ఈలోగా కృష్ణమోహన్ బాత్‌రూం నుండి బయటికి వచ్చాడు, అన్నదమ్ములిద్దరూ బిల్డర్‌ని కలవడానికి బయలుదేరారు. వారిద్దరినీ కిటికీ లోంచి చూసిన అనూరాధ "హమ్మయ్య! కృష్ణ కొంచెం తేరుకొని, ఎక్కడికో వెళుతున్నాడు" అనుకొంది.

బిల్డర్‌ని కలసి వ్యవహారం మాట్లాడుతున్నారు గానీ కృష్ణమోహన్ ఆలోచనలు ఎక్కడో వున్నాయి. "ఇన్నాళ్ళూ రాధ ఒంటరిగా తన పిల్లలని ఎన్ని కష్టాలు పడి పెంచిందో, ఉద్యోగం చేస్తున్నాదో లేదో, పిల్లలు ఏం చదువుతున్నారో, రాధ తల్లి తండ్రులు దగ్గరే వున్నాదని విన్నాను"...ఇలా అనూరాధ గురించి ఆలోచిస్తూ, అక్కడ జరుగుతున్న చర్చల మీద దృష్టి పెట్టలేక పోతున్నాడు. మధ్యలో చంద్రం, బిల్డర్ ఏదో అడిగితే "ఆ", "వూ" అని ముక్తసరిగా సమాధానం చెప్పాడు. అన్నగారికి అక్కడ జరుగుతున్న చర్చల మీద దృష్టి లేదని గ్రహించిన చంద్రం తానే బిల్డర్‌తో అన్ని విషయాలు వివరంగా మాట్లాడాడు.

బిల్డర్ దగ్గర నుండి అన్నదమ్ములిద్దరు పెళ్ళివారి ఇంటికి తిరిగి వస్తూ వుండగా, కృష్ణమోహన్ మళ్ళీ అనూరాధ గురించి ఆలోచిస్తున్నాడు..."ఏమిటిది? ఇరవై మూడేళ్ళ క్రిందట చివరిసారిగా కలుసుకున్నాము ఆ తరువాత ఎక్కడా కలవలేదు. అలాంటిది ఇవాళ హఠాత్తుగా రాధని చూడగానే ఒక్కసారిగా నా మనసంతా రాధ గురించే ఆలోచిస్తున్నాది ఎందుకు? ఏమిటి ఈ విచిత్రమైన పరిస్థితి? దీని పర్యవ-

స్థానం ఎలా వుంటుందో?ముఖ్యంగా రుక్మిణి నన్ను ఎలా అర్ధం చేసుకుంటుందో? నా వాళ్ళందరూ నా వింత ప్రవర్తన గురించి ఏమిటి ఆలోచిస్తున్నారో? రాధ నా గురించి ఏమిటి అనుకుంటున్నాదో? నేనే ఇంత మధనపడుతున్నప్పుడు రాధ ఇంకెంత బాధ పడుతున్నాదో? నాకు బాధ కలిగితే భార్యగా, స్నేహితురాలిగా, లాలించడానికి, ఓదార్చి ధైర్యం చెప్పడానికి రుక్మిణి వుంది. పాపం రాధ పడే ఆవేదనని ఎవరు అర్ధం చేసుకుంటారు? ఎవరు ఓదారుస్తారు?"

ఇలా ఆలోచనలతో బుర్ర వేడెక్కిపోయిన కృష్ణమోహన్‌కి ఈ వాతావరణం నుండి దూరంగా వెళ్ళి ఒంటరిగా లేదా బాగా సన్నిహితుడితో గాని కాస్సేపు గడపాలనుకున్నాడు...ఆలోచించగా అవినాశ్ గుర్తుకొచ్చాడు. ఆవును అవినాశ్ అయితేనే మంచిది, అతనికి తన గురించి రాధ గురించి మొత్తం తెలుసు, తన బాధని అర్ధం చేసుకోగలిగిన వాడు అవినాశ్ ఒక్కడే అని తలచి "ఒరేయ్! చంద్రం ఒక్కసారి ఆపు ఫోన్ చెయ్యాలి" అన్నాడు.

"ఎవరికి రా! అర్జంటా? లేదంటే ఇంటికి వెళ్ళి చేద్దాము"

"అవును అర్జంటే, నా అసిస్టెంట్ శేఖర్‌తో ఆఫీస్ విషయం ఒకటి మాట్లాడాలి"

దగ్గరలో వున్న టెలిఫోన్ బూత్ దగ్గర ఆపాడు చంద్రం. "నువ్విక్కడే వుండు, నేను మాట్లాడి వస్తాను" అన్నాడు కృష్ణమోహన్.

అవతలి వ్యక్తి ఫోన్ ఎత్తి "హలో" అనగానే "హాయ్ అవీ నేను మోహన్‌ని, ఇంట్లో వున్నావు, ఇవాళ ఏ షిఫ్ట్?"

"ఇవాళ వీక్లీ ఆఫ్ బావా, ఏమిటి విశేషాలు? పెళ్ళి పనులు ఎంతవరకు వచ్చాయి?"

"మా చెల్లెలు వూరినుండి వచ్చిందా లేదా?"

"రేపు వస్తుంది"

"అయితే సరే విను, నేను ఇప్పుడు మీ ఇంటికి వస్తున్నాను నీ "ఛాయిస్" ఏమిటో చెప్పు, వచ్చేటప్పుడు దారిలో కొనుక్కుని వస్తాను"

ఆ మాటలు వినగానే పక్కన బాంబు పడినట్లు అవినాశ్ ఒక్కసారి అదిరిపడ్డాడు. ఇదేమిటి కృష్ణమోహన్ "ఛాయిస్" అడుగుతున్నాడు? 'నాకు మతి పోలేదు కదా' అనుకున్నాడు ... ఆలోచించగా ఆలోచించగా అనూరాధకి కృష్ణమోహన్ చేసిన వాగ్దానం గుర్తుకొచ్చింది అవినాశ్‌కి ... ఓహ్ గాడ్! లావణ్య పెళ్ళికి అనూరాధ వచ్చి వుంటుంది, మోహన్ అనూని చూసి కలత చెంది వుంటాడు ... అవినాశ్‌కి విషయం అర్ధమయింది, వెంటనే బుర్ర పాదరసంలా పని చెయ్యడం మొదలెట్టింది.

"బావా, లావణ్య పెళ్ళికి అనూ వచ్చిందా?"

"అవును బావా" గద్గద స్వరంతో చెప్పాడు కృష్ణమోహన్.

అతని గొంతులోని వణుకు పసిగట్టిన అవినాశ్‌కి కృష్ణమోహన్ బాగా కలత చెందాడని అర్ధమయింది, అందుకే మోహన్ తన దగ్గరకి వస్తున్నాడని అర్ధం చేసుకున్నాడు. మోహన్, అనూరాధల గురించి బాగా తెలిసిన తను వాళ్ళిద్దరి జీవితాలని దగ్గరనుండి చూసినవాడు కనుక కృష్ణమోహన్‌ని ఎలాగైనా డ్రింక్స్ తీసుకోకుండా, అతను అనూరాధకి చేసిన వాగ్దానానికి భంగం కలగకుండా చూడటం తన బాధ్యతగా భావించాడు అవినాశ్, అందుకే కృష్ణమోహన్‌ని ఇక్కడకి రప్పించి పరిస్థితిని చక్కదిద్దాలని నిర్ణయించుకున్నాడు..."బావా నువ్వు ఎక్కడనుండి మాట్లాడుతున్నావు? నేను వచ్చి నిన్ను పిక్ చేసుకుంటాను" అని కంగారుగా అడిగాడు.

"పబ్లిక్ బూత్ నుండి మాట్లాడుతున్నాను, కంగారు పడకు బావా నువ్వు రానక్కరలేదు నేను రాగలను, వచ్చాక అన్ని విషయాలూ మాట్లాడుకుందాము"

కృష్ణమోహన్ గొంతులో ఇంకా మార్పు రాలేదు. అది గమనించిన అవినాశ్ "అది కాదు బావా నువ్వు బాగా కలతగా వున్నావు, డ్రైవ్ చెయ్యగలవా? నీతో ప్రస్తుతం ఎవరున్నారు?" ఆత్రంగా అడిగాడు.

"నాతో చంద్రం వున్నాడు. కానీ

నేనొక్కడినే వస్తాను నువ్వు గాభరా పడకు. ఇంతకీ నీ ఛాయిస్ చెప్ప లేదు"

"జాగ్రత్త, టేక్ కేర్ ఆఫ్ యువర్ సెల్ఫ్" అని ఏమి అనాలో తెలియక "యువర్ ఛాయిస్ ఈజ్ మై ఛాయిస్" అన్నాడు అవినాశ్ ... కృష్ణమోహన్ మళ్ళీ ఛాయిస్ అంటున్నాడంటే, ఎలాగైనా ఇవాళ డ్రింక్ చేసేటట్లు వున్నాడు. అతనిని డ్రింక్ చేయకుండా ఆపడం ఎలా? అని అవినాశ్ తీవ్రంగా ఆలోచించడం మొదలుపెట్టాడు.

పెళ్ళివారింటికి తిరిగి వచ్చిన తరువాత "బిల్డర్‌ని కలిసారా? వ్యవహారం ఎంతవరకూ వచ్చింది? భోజనం సరిగా చెయ్యలేదు, ఇదిగో ఈ మిక్చర్ తీసుకోండి, కాఫీ కలిపి తెస్తాను" అంది రుక్మిణి.

"నాకేమీ వద్దు కాఫీ తెచ్చిపెట్టు చాలు, బయటికి వెళ్ళాలి పని వుంది. బిల్డర్ విషయాలు చంద్రాన్ని అడుగు వాడు చెబుతాడు"... ఈయన ఇంకా మామూలు స్థితికి రాలేదని అనుకుంది రుక్మిణి.

కాఫీ తాగిన వెంటనే "నేను వెళ్ళొస్తాను, తిరిగి వచ్చేసరికి ఆలస్యం అవుతుంది, నాకోసం వేచి చూడొద్దు, మీరందరూ భోజనాలు చేసేయండి" అన్నాడు కృష్ణమోహన్.

"చూడండి, పనుంది నేను వెళ్ళొస్తాను అని చెప్పినపుడే మీరు ఎక్కడికి వెళుతున్నారో నాకు చెప్పడం ఇష్టం లేదని అర్థమయింది అందుకని ఏం పని అని నేను అడగను, కానీ మీరు చాలా కలతగా వున్నారు అందుకని జాగ్రత్త. ఎవరినైనా తోడు తీసికెళితే మంచిది"

"ఎవరూ వద్దు ఇక్కడ పనులు వుంటాయి"

"సరే, మీ ఇష్టం. ఒకవేళ ఆలస్యం అయినా లేదా ఏదైనా సమస్య వచ్చినా ఫోన్ చెయ్యండి లేకపోతే నాకు కంగారుగా వుంటుంది"

"అలాగే తప్పకుండా చేస్తాను, నువ్వు వర్రీ అవకు...ఓకే"

కృష్ణమోహన్ ఇంట్లోంచి బయటకి వచ్చేసరికి లాన్స్‌లో అనూరాధ కనిపించింది. అతనిని చూసి దగ్గరికి వచ్చి.."సారీ బావా, అనవసరంగా నా మాటలతో మధ్యాహ్నం నిన్ను బాధ పెట్టాను, నువ్వు చాలా కలత చెందావు. అసలు ఈ పెళ్ళికి రాకుండా వుండవలసింది, సాఫీగా సాగుతున్న నీ జీవితంలో మళ్ళీ కనిపించి, గతం గుర్తు చేసి, నీ మనసులో అలజడి రేపుతున్నాను, దీని పర్యవసానము ఎలా వుంటుందో?" అంటూ నొచ్చుకుంది.

"లేదు రాధా, నువ్వలా అనడంలో తప్పు లేదు...ఎందుకంటే నీ జీవితంలో అత్యంత విషాదకర సమయంలో కూడా కనీసం ఒక మిత్రుడిగా నేను నీకు ఒక ఓదార్పు మాట కూడా చెప్పలేదు దానికి నువ్వు బాధ పడటం సహజం" అంటూ విషయం మార్చటానికి ప్రయత్నిస్తూ..."నీ పిల్లలు రాలేదా?" అని అడిగాడు.

"రేపు విశాఖలో వస్తున్నారు, నీ పిల్లలు ఏరి? పరిచయం చేయవా?"

"మార్కెటింగ్‌కి వెళ్ళారు, వచ్చిన తరువాత పరిచయం చేస్తాను"

"బావా వైదేహి వదిన చెప్పింది నీకు బొంబాయ్ ట్రాన్స్ఫర్ అయిందట"

"అవును వచ్చే నెల 12వ తేదీన వెళుతున్నాను. ఎలా వున్నావు? ఉద్యోగం చేస్తున్నావా? పిల్లలు ఏం చదువుతున్నారు?"

"చేస్తున్నాను. ఎలా వున్నానంటే ఏం చెప్పమంటావు, ఏదో పిల్లల కోసం బ్రతుకుతున్నాను. నీకు ఓపిక వుందంటే, వింటానంటే నా భవసాగరాలు చెబుతాను బావా"

"అలాగేలే, ఈ పెళ్ళిసందడి పూర్తి అయినాక మాట్లాడుదాము, నేను ఒక ముఖ్యమైన పని మీద బయటకు వెళుతున్నాను, వెళ్ళొస్తాను"

కాస్సేపు పోయిన తరువాత రుక్మిణి అటుగా వెళుతూ అనూరాధ ఒంటరిగా కూర్చోవడం గమనించి దగ్గరకి వెళ్ళి "ఏమిటండీ! ఒక్కరే ఇక్కడ కూర్చున్నారు" అని పలకరించింది.

"ఏమీ లేదండి, మా పిల్లలు ఇవాళ బయలుదేరి రేపు వస్తున్నారు, వాళ్ళు ఇంటికి తాళాలు సరిగ్గా వేసారో లేదో అని ఆలోచి-

స్తున్నాను" అంది అనూరాధ.

ఆనూరాధ అబద్ధం చెబుతున్నాదని రుక్మిణికి అర్ధమయ్యింది... "మీరేమీ కంగారు పడకండి, ఈ రోజుల్లో పిల్లలు చాలా చురుకు, మనం ఆందోళన పడతాముగాని, అన్ని విషయాలు వాళ్ళకి తెలుసు" అని సంభాషణని పెంచుతూ అనూరాధ ఆలోచనలని కాస్త మళ్ళించడానికి ప్రయత్నించింది.

"మీ పిల్లలేరి, ఇందాక కృష్ణని అడిగితే ఏదో మార్కెటింగ్‌కి వెళ్ళారని చెప్పాడు...ఐ యాం సారీ, మీ వారిని ఏకవచనంతో సంభోదిస్తున్నాని ఏమీ అనుకోకండి. కృష్ణ కాకినాడలో చదువుతున్నపుడు, హైద్రాబాదులో ఉద్యోగం చేస్తున్నపుడు, నేను, మా అన్నయ్యలు, మా వదిన మొత్తం మా కుటుంబము అంతా అతనితో చాలా సన్నిహితంగా, చనువుగా వుండేవాళ్ళం, సరదాగా గడిపే వాళ్ళం. అప్పటినుండి కృష్ణా అని పిలవడం, ఏకవచనంతో మాట్లాడటం అలవాటయింది" అని అనూరాధ వివరణ ఇచ్చింది.

ఈ లోపల మురళి ఇంట్లోకి వెళ్ళడం చూసి "మురళీ, ఒకసారి పిల్లలిద్దరిని ఇక్కడకి రమ్మని చెప్పు" అని అతనితో చెప్పి అనూరాధ ప్రక్క తిరిగి "నాకు మీ గురించి, మీ బావ గురించి అంతా తెలుసు. మా పెళ్ళికి ముందే మీ బావ మీ ఇద్దరి గురించి నాకు చెప్పారు, ఎందుకంటే మీ ఇద్దరి గురించి ఇంకొక వ్యక్తి ద్వారా నాకు తెలియడం, దాని వల్ల మా ఇద్దరి మధ్య పొరపొచ్చాలు రావడం ఆయనకి ఇష్టం లేదు, అందుకని మీరు ఎటువంటి ఆందోళన పడకుండా నాతో నిర్మొహమాటంగా మాట్లాడవచ్చు"

"ఒహ్ మై గాడ్! ఈవిడకి అంతా తెలుసన్నమాట" అని మనసులో అనుకొంది అనూరాధ.

అనూరాధ మౌనంగా వుండిపోవడంతో "ఏమండీ! ఏమిటి అలోచిస్తున్నారు?...ఆయ్యబాబోయ్! ఈవిడకి అన్ని విషయాలూ తెలుసు, ఇన్నాళ్ళకి దొరికాను, నా పని అయిపొయింది, ఇవాళ ఈవిడ నాతో ఫుట్‌బాల్ ఆడేస్తుంది అనుకుంటున్నారా?" అని సరదాగా జోక్ చేసింది రుక్మిణి.

"అబ్బే అలాంటిదేమీ లేదండి" అని మొహమాటంగా అంది అనూరాధ.

"చూడండి, ఈ ప్రపంచమే ఒక నాటకరంగం, అందులో మనమందరమూ పాత్రధారులం అన్నాడు కవి. పాత్ర అయిపోయిన వెంటనే పాత్రధారుడు ఎలా కనుమరుగవుతాడో, అలాగే నిజ జీవితంలో కూడా మన పాత్ర అయిపొయిన వెంటనే మనమూ కనుమరుగవుతాము, అందుకని ఈ మూడునాళ్ళ ముచ్చటలో మనం ఇది నాది, అది నీది అనుకోవడం లేదా నువ్వు చేసింది తప్పు, నేను చేసింది ఒప్పు అనుకోవడం నా ఉద్దేశ్యంలో అవివేకం. మనం ఎప్పుడు ఏమిటి చెయ్యాలనేది ఆ భగవంతుడు నిర్ణయిస్తాడు. అందుకే భగవద్గీతలో శ్రీకృష్ణపరమాత్మ "చేసెడి వాడను నేనె, చేయించెడివాడను నేనె" అని అన్నాడు...అంతెందుకు మీరూ ఆత్రేయగారి అభిమాని అని మా వారు చెప్పారు, అందుకని మన ఆత్రేయగారి మాటలలో చెబుతాను..."అనుకున్నామని జరగవు అన్ని, అనుకోలేదని ఆగవు కొన్ని, జరిగేవన్నీ మంచికని, అనుకోవడమే మనిషి పని" అని అన్నారు. అందుకని మీరు జరిగిపొయిన విషయాల గురించి అనవసరంగా ఆలోచించకండి. 'మనం గతంలోని మన బాధలని మరచిపోయి, వర్తమానంలో సంతోషంగా వుండి భవిష్యత్తు మీద ఆశతో జీవించాలి' " అని అనూరాధకి ఉపదేశం చేసింది రుక్మిణి.

"తన భర్త జీవితంలో, మనసులో తను రాక ముందు ఉంకొక స్త్రీ వుందని తెలిసినా, ఆ స్త్రీ నేడు ఎదురుగా వున్నా, ఆ విషయం ఏమీ కాదన్నట్లు ఇంత ప్రశాంతంగా మాట్లాడుతున్నాదంటే ఈవిడకి 'హ్యాట్స్ ఆఫ్', ఈవిడ నిజంగా పేరుకి తగ్గ ఉత్తమురాలు, ఇలాంటి ఉత్తమురాలు కృష్ణకి భార్య కావడం బావ చేసుకున్న అదృష్టం" అని మనసులో అనుకుంది అనూరాధ.

**(ఇంకా వుంది)**

పాలెపు బుచ్చిరాజు



# ముల్లా నస్రుద్దీన్ కథలు - 12

## నస్రుద్దీన్ పెళ్లి

నస్రుద్దీన్ ఎప్పుడూ ఇతరుల సమస్యలు, తగువులు తీర్చడంలోనే కాలం గడిపేవాడు. తనని గురించి తాను ఆలోచించు కోవడానికి అతనికి సమయం చిక్కేది కాదు. యుక్త వయసు రాగానే పెళ్లి చేసుకోవాలనే ఆలోచన కూడా అతనికి రాలేదు. అలాగే బ్రహ్మచారిగా దేశాలు తిరుగుతూ కాలం గడిపేవాడు. ఎట్టకేలకు అతని మేలు కోరే ఊరివారంతా కలిసి అతని తలిదండ్రులతో 'అతనిలా ఘోటక బ్రహ్మచారిగా ఎంతకాలం ఉంటాడు? ఇంక పెళ్లి చేయ్యండ'ని చెవినిల్లు కట్టుకుని పోరి, చివరికి, ఒప్పించారు.

పెళ్లి కూతురి కోసం వేట మొదలైంది. అప్పటికే మంచి పేరు ప్రఖ్యాతులు ఆర్జించి ఉన్న నస్రుకి అలాంటిలాంటి పిల్ల కుదురుతుందా! చక్కని అంద చందాలే కాక, మంచి తెలివి తేటలున్న పిల్ల దొరకాలి. వారిద్దరూ ఇష్టపడాలి ఇచ్చిపుచ్చుకొవడంలొ తేడాలు ఉండరాదు. అబ్బో! ఎంత తతంగం ఉంది! వెతగ్గా, వెతగ్గా, దగ్గర లోనే ఉన్న ఒక గ్రామంలో సంపన్న కుటుంబంలో పుట్టిన పిల్ల ఉందని తెలిసింది. ఆమె అందమైనదే కాక మంచి తెలివైనదని, చాలా చలాకీ పిల్ల అని అందరూ చెప్పారు. కత్తిలాంటి పిల్ల. మరి మన నస్రుద్దీన్ కూడా కత్తిలాంటి



వాడే! రాయబారాలు వెళ్ళాయి. పెళ్లి ఘనంగా జరిగిపోయింది. కోడలు అత్తారింటికి కాపురానికి వచ్చింది. కొత్త మోజులో కొన్నాళ్ళు ఆనందంగానే గడిచాయి. నెమ్మదిగా భార్యా భర్తల మధ్య జగడాలు చోటు చేసుకో సాగాయి. ఇద్దరూ ఒకరిని మించిన వారు మరొకరు కావడంతో వాదులాటలు ప్రారంభం అయ్యాయి. రెండు కత్తులు ఒక ఒరలో ఇమడవు కదా!

ముల్లా గారికి దంత సిరి ఎక్కువ. చక్కని పిండి వంటలతో భోజనం ఉంటే కడుపు నిండా తినే రకం. భార్యామణి గారు ధనవంతుల కుటుంబంలో గారాబంగా పెరిగిన బిడ్డ. వంటా వార్పూ ఆమెకు గిట్టవు. "నాకు వంట చెయ్యడం రాదు. నీ ఇష్టం ఎవరి చేత నైనా వండించుకు తిను. నా కభ్యంతరం లేదు. " అని ఖరాఖండిగా ముందే చెప్పేసింది. ముల్లా గారు ఊరిలో తగువులు కొట్లాటలు తీర్చడంలో ఎప్పుడూ తీరికలేకుండా ఉండేవాడు. ఇంటి పట్టున ఉండే సమయం చాలా తక్కువ. ఇంట్లోనే ఉండమని భార్య పోరేది. "నాకు తీరిక ఉండదు. అలా బైటికి పోయి రాకపోతే తోచదు. ఆడదానిలా ఇంటిపట్టున ఉండమంటే ఎలా?" అని కోపగించుకునేవాడు నస్రు. ఇద్దరూ ఎడ మొహం, పెడ మొహమూను.

ఎవరికి వారే తెలివైన వారు కావడంతో ప్రతిదానికి ఔనంటే కాదని వాదించుకునే వారు. ఒకరిమాట

ఒకరికి నచ్చేది కాదు. నస్రు భార్యని వంట చేయడం నేర్చుకోమని బలవంత పెట్టేవాడు. ఆమె ససేమిరా ఒప్పుకోలేదు. ఒక్కొక్క సారి వారు ఇంట్లో వంట చేసుకోక పోవడంతో, ఏ పాలు తాగో, పళ్ళు తినో పడుకునేవారు. ఈ విషయంలో ఇద్దరికీ దెబ్బలాట వచ్చి, అతని భార్య ఒకనాడు ఇల్లు విడిచి వెళ్ళిపోయింది. పుట్టింటికి పోతే పరువు తక్కువని, నాలుగు వీధుల అవతల ఉన్న, తనకి తెలిసిన స్నేహితుల ఇంటికి వెళ్ళింది. వారు ఆమెని ఆహ్వానించి ఆదరించారు. క్రొత్తగా పెళ్లయిన దంపతులు ఇలా విడి విడిగా ఉండడం ఇరుగు పొరుగు వారికి బాధ అనిపించింది. నస్రుని బ్రతిమిలాడి ఎలాగైనా ఆమెను ఒప్పించి వెనక్కి ఇంటికి తీసుకు రమ్మని పంపారు. మొదట్లో నస్రు అహం దెబ్బతింటుందని కాదన్నా, వారి బలవంతం మీద వెళ్ళడానికి ఒప్పుకున్నాడు.

ఆ స్నేహితులు ఈయన్ని కూడా ఆదరించి, లోపలి తీసుకు వెళ్ళారు. మొగుణ్ణి చూసి ఆ భార్య మొహం ముడుచు కుంది. కాని స్నేహితులు నచ్చజెప్పడంతో, వారిద్దరూ ఒక గదిలో కూర్చుని మాట్లాడుకుని సంధి చేసుకోవాలని నిర్ణయిం చుకున్నారు. ఎంత సేపు విన్నా ఆ గదిలోంచి సంది మాటలు వినిపించ లేదు. సరి కదా, అరుపులు చీత్కారాలు వినిపించ సాగాయి. మళ్లీ వీళ్ళ మధ్య దెబ్బలాట మొదలయ్యిందిరా భగవంతుడా! ఇప్పుడెలా? అని బైట ఉన్న వాళ్ళు ఆలోచనలో పడ్డారు. ఆఖరికి వాళ్లకి ఒక ఉపాయం తట్టింది. వీళ్ళ నోళ్ళు కట్టించాలంటే, నోటినిండా ఏదైనా ఉండాలి. అందుకు ఒక్కటే మార్గం. రకరకాల వంటలు చేసి పట్టుకుని వచ్చి ఆ గదిలోకి పంపుదాం. అవి తింటూ వారు కొంత శాంతిస్తారు. ఆ తరవాత బుద్ధివచ్చి కలిసి బైటికి వస్తారు. ఇలా అనుకున్న వెంటనే ఒక్కొక్కరూ వారి వారి ఇళ్ళకి వెళ్లి, మంచి రుచికరమైన వంటలు, పిండి వంటలు చేసి తీసుకువచ్చి, ఆ గదిలోకి పంపించారు. సాయంత్రం అవుతోంది. ఇక్కడ భార్యా భర్తలిద్దరూ వాడులాడుకుని అలిసి పోయారు. ఇద్దరిదీ తెగేవరకు లాగే మనస్తత్వం. సర్దుకుపోదాం అనుకునేవారు కారు. కాస్త ఊపిరి పిల్చుకోవడానికి ఆగిన ఇద్దరి దృష్టి ఆ గదిలోకి వచ్చిన వంటకాల మీద పడింది. ఆ ఘుమఘుమలు వారిని ఆకర్షించాయి. ఇద్దరూ ప్రొద్దుటి నుంచి ఏమీ తినలేదు కూడా. కడుపులో మాడుతున్నట్టు అప్పుడు తెలియవచ్చింది. ఆవు రావురు మంటూ అక్కడున్న భక్ష్య భోజ్యాలన్నీ లాగించేశారు. తినీ, తినీ ఆయాసం వచ్చింది. కడుపు నిండా తినడంతో ఇద్దరికీ నిద్ర ముంచు కొచ్చింది.

ఒకరి మీద ఒకరు పడి నిద్ర పోయారు. వారికి మెలకువ వచ్చేసరికి బాగా చీకటి పడింది. ఎక్కువగా కేకలు వినిపించకపోవడంతో, అక్కడ చేరిన వాళ్ళు వారి మధ్య సంధి కుదిరిందని సంతోష పడ్డారు.

నస్రు భార్యని చూసి అన్నాడు.

“ఇదీ బాగానే ఉంది. మన మధ్య తగువులాట మన మంచికే వచ్చింది. సుష్టుగా భోజనం దొరికింది. తగువులు కూడా మనిషికి మేలు చేస్తాయని ఇప్పుడే తెలిసింది. ఈ సారి మనకి ఎప్పుడు మంచి భోజనం కావాలనుకున్నా కీచులాడుకుంటూ కూర్చుందా ము. భోజనం అదే వస్తుంది. “

భార్య ముసి ముసి నవ్వులూ నవ్వుకుంటూ అలాగేనని తలూపింది. ఏ విషయంలోనూ కుదరని ఏకాభిప్రాయం వారికి ఈ విషయంలో కుదిరింది. ఇద్దరు చెట్టా పట్టాలేసుకుని గదిలోంచి బైటికి వచ్చారు. ఆ యువ జంటని చూసిన జనం సంతృప్తిగా వారిని ఆశీర్వదించి ఎవరిళ్లకి వారు వెళ్ళిపోయారు. అల్లా ఆ ముల్లాని, భార్య ని చల్లగా చూడాలని మనమూ కోరుకుందాము.

**శుభం**

# పోడూరి శ్రీనివాసరావు




# భక్త రామదాసు అనే కంచర్ల గోపన్న

ఏప్రియల్ నెల అనగానే ఉగాది, శ్రీ రామ నవమి గుర్తుకువస్తాయి.. శ్రీ రామ నవమి అనగానే శ్రీ రామ జననం, కళ్యాణం, పట్టాభిషేకం, కళ్యాణం, భద్రాచలం, అయోధ్య గుర్తుకు వస్తాయి. భద్రాచలం అనగానే భద్రాద్రి రాముడు ఆలయ నిర్మాణం, భక్త రామ దాసుగా ప్రసిద్ధి కెక్కిన శ్రీ కంచర్ల గోపన్న గుర్తుకు వస్తారు.

భక్త రామ దాసు తెలుగు భాష లో ఎన్నో కీర్తనలు రచించాడు. అంతెందుకు! తెలుగులో కీర్తనలకు రామదాసు ఆద్యుడని చెప్పుకోవచ్చు. ఎన్నో సంకీర్తనలు, దాశరధీ శతకం రామదాసుకు శ్రీ రామచంద్రునిపై గల అశేష భక్తికి తార్కాణాలు. ఒక విధంగా చెప్పాలంటే భద్రాచలంలో గల శ్రీ రాముల వారి ఆలయ నిర్మాణం శ్రీ రామ దాసు జీవిత చరిత్రతో ముడిపడి ఉంది. శ్రామ దాసు కారణం జన్మడు. శ్రీ భద్రాచల రామ దాసు ఆలయ నిర్మాణం కోసమే కేవలం రామదాసు జన్మించాడు.

భద్రాచల రామదాసుగా ప్రసిద్ధి చెందిన వీరి అసలు పేరు కంచెర్ల గోపన్న క్రీ. శ. 1620 వ సంవత్సరంలో ఖమ్మం జిల్లాలో (తెలంగాణా) గల నేలకొండపల్లి లో లింగన్నమూర్తి, కామాంబ దంపతులకు జన్మించాడు. శ్రీ రామదాసుగా తరువాత సుప్రసిద్ధుడైన గోపన్నకు, కమలతో వివాహం జరిగింది. కమల కూడా గొప్ప రామ భక్తురాలు. శ్రీ రాముని కొలిచి కీర్తించి, దాశరధి శతకం రచించి భద్రాచలం ఆలయ నిర్మాణం కావించి భక్త రామ దాసుగా ప్రసిద్ధి కెక్కాడు. దాశరధి శతకము, ఎన్నో రామ సంకీర్తనలు, భద్రాచాల దేవస్థానం ---- శ్రీ రామ దాసు తెలుగు వారికందించిన పెన్నిధులు. వీరి గురువు శ్రీ రఘునాథ భట్టాచార్యులు. సుప్రసిద్ధ శ్రీ కబీరుదాసు కూడా రామదాసుకు తారక మంత్రం ఉపదేశించారనే గాథ కూడా వాడుకలో ఉన్నది.

గోపన్న మేనమామ అయిన మాదన్న, అప్పటికే గోల్కొండ నవాబు తానీషా గారి కొలువులో పెద్ద ఉద్యోగంలో ఉండే వారు. మేనమామ మాదన్న గారి సిఫారసుతో గోపన్నకు "పాల్వంచ" పరగణా తహసీల్దారుగా ఉద్యోగం లభించింది. గోదావరి తీరంలో గల భద్రాచల గ్రామము, ఈ పాల్వంచ పరగణా లోనిదే. వన వాస కాలంలో శ్రీరామ చంద్రుడు సీతా లక్ష్మణులతో కూడి ఇక్కడే పర్ణశాలలో నివసించాని, భక్తురాలైన శబరి



ఆతిథ్యము కూడా స్వీకరించారని స్థలపురాణం.

పోకల దమ్మక్క అనే రామ భక్తురాలు అక్కడ గల జీర్ణ దశలో నున్న రామ మందిరమును పునరుద్ధరింపవలెనని గోపన్నను కోరగా హరిభక్తుడైన గోపన్న అందుకు అంగీకరించాడు. కానీ ఆలయ నిర్మాణానికి, పునరోద్ధరణకు సేకరించిన ధనము సరిపోలేదు. అచ్చటి ప్రజలు తమ పంటలు పండగానే, మరింత విరాళాలిచ్చెదమని, గుడి నిర్మాణపు పనులను ఆప వద్దని కోరగా, రామదాసు తాను వాసులు చేసిన శిస్తు నుండి కొంత సొమ్ము గుడి నిర్మాణమునకు వినియోగించెను.

ప్రజల నుండి సేకరించిన శిస్తు సొమ్ము ఖజానాకు జమ చేయకుండా ఆలయ నిర్మాణమునకు వినియోగించినందుకు కోపగించుకున్న నవాబు తానీషా గారు గోపన్నకు 12 సంవత్సరములు కారాగారశిక్ష విధించారు. ఖైదులో ఉన్న రామదాసు గోడపై సీతా రామ లక్ష్మణ ఆంజనేయులను చిత్రించుకుని వారిని నిరంతరమూ కీర్తించుచూ, శ్రీ రాముని కటాక్ష ఆశీర్వాదములకై ఆక్రోశించుచూ కాలము గడిపినాడు. భక్త రామదాసు నోటి నుండి వెలువడ్డ ఎన్నో ప్రసిద్ధ సంకీర్తనలు ఈ సమయంలోనే వెలుగు చూశాయి. "నను బ్రోవమని చెప్పవే సీతమ్మ తల్లీ!" " పలుకే బంగారమాయెనా!" "ఇక్ష్వాకు కుల తిలకా ఇకనైనా పలుకవే రామ చంద్రా", "అబ్బబ్బో దెబ్బలకు ఓర్వలేనురా" వంటి సంకీర్తనలెన్నో నా సమయంలోనే జైలు శిక్ష అనుభవిస్తున్న రామదాసు నోటి వెంట వెలువడ్డాయి.ఇవి రామదాసుకీర్తనలుగా ప్రసిద్ధి కెక్కాయి. అన్నీ ప్రాచుర్యం పొందిన గీతాలైన " ఇక్ష్వాకు తిలక ఇకనైనా పలుకవే రామ చంద్రా" అన్న కీర్తన బాగా ప్రసిద్ధి కెక్కింది. "రామ చంద్ర ప్రభో నీకోసం ఎంతక్షర్చు పెట్టాను నీ ఆలయ నిర్మాణం కావించాను. "ఎవడబ్బ సొమ్మని కులుకుతున్నావు? నీ బాబిచ్చాడా? నీ మామిచ్చాడా" అని క్రోధంతో ప్రశ్నించి, మళ్ళా "ఈ దెబ్బలు ఓర్వలేక తిట్టాను. ఏమీ అనుకోవద్దు. నా బ్రతుకిలా అయ్యింది నీవే నాకు దిక్కు". అని ప్రాధేయ పడ్డాడు.

గోల్కొండ కోటలో రామదాసుని ఖైదు చేసిన చెరసాలని ఇప్పటికీ కోటలో చూడవచ్చును.

అదే విధంగా రామదాసు సీతమ్మ తల్లికి చేయించిన చింతాకు పతకం, లక్ష్మణ స్వామికి చేయించిన హారము, సీతారాముల కళ్యాణమునకు చేయించిన తాళి వంటి ఆభరణాలు ఇప్పటికి భద్రాచల దేవస్థానం లోని నగలలో ఉన్నాయి.

రామదాసు కర్మ శేషము పరిసమాప్తి కాగానే, రామ లక్ష్మణులు మారువేషాల్లో తానీషా వద్దకు వెళ్లి, రామదాసు ఆలయ నిర్మాణమునకు వెచ్చించిన శిస్తు సొమ్ముగా చెప్పబడుతున్న ఆరు లక్షల వరహాలను (శిస్తు సొమ్ము) చెల్లించి, రామదాసు విడుదల పత్రము తీసుకున్నారని ప్రతీతి. అపుడు రాముల వారు తానీషాకు చెల్లించిన నాణెములను "రామటంకా నాణెములని" అంటారు. వీటికి ఒకవైపున రామ పట్టాభిషేకము ముద్ర, మరో వైపు రామ భక్త హనుమంతుని ముద్ర ఉంటాయి. అవి ఇప్పుడు కూడా ఉన్నాయి.

రామదాసు గొప్ప తనాన్ని తెలుసుకున్న తానీషా నవాబు గారు, వెంటనే ఆయనను విడుదల చేయించి భద్రాచల రాముని సేవ నిమిత్తమై భూమిని ఇచ్చారు. శ్రీ సీతా రామ కళ్యాణ సమయంలో గోల్కొండ దర్బారు నుండి ముత్యాల తలంబ్రాలను పంపే సాంప్రదాయం అప్పటినుండి ప్రారంభమయ్యింది. ఇదే సాంప్రదాయం-- 2014 వరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ద్వారా, ఆ తర్వాత 2015 నుంచి తెలంగాణా ప్రభుత్వం ద్వారా కొనసాగుతున్నది.

శ్రీ రాముని సేవలో

సంకీర్తనా గానంలో రామదాసు తన శేష జీవితాన్ని గడిపారు. త్యాగ రాజాదులకు ఇతను ఆద్యుడు. పూజ్యుడు. త్యాగరాజు తన కీర్తనలలో "ధీరుఁడౌ రామదాసుని బంధము తీర్చినది, విన్నానురా రామా" ! అలాగే ప్రహ్లాదుని విజయంలో కలియుగమున వార భద్రాచలమున నెలకొన్న రామ చంద్రుని పాద భక్తులకెల్ల వరద నందగి వెలసిన శ్రీ రాముడు విను తింతు మదిన్"అని కొనియాడాడు.

శ్రీ రామదాసు కమల దంపతు లకు "రఘునాథ" అనే పేరు గల తనయుడు కలడు. నేలకుంటపల్లిలో ఇప్పటికీ రామదాసు గారు వాడిన బావిని మనం చూడ వచ్చును. అంతేకాదు అక్కడ కొందరు భక్తులు శ్రీ రామదాసు కీర్తనలు పాడే గాయకులను పిలచి వారిని ఎంతో ప్రేమగా ఆదరించి రామదాసు కీర్తనలు పాడించుకుంటారు.

శ్రీ రామదాసు తన 60 సంవ త్సరాల వయస్సులో క్రీ. శ. 1680 సంవత్సరములో భద్రాచలంలో స్వర్గస్థులయ్యారు.

(వికోపీడియాకుకృతజ్ఞతలతో) ---డా !! పోడూరి శ్రీనివాసరావు, ( 9849422239)

---

# ఒక అన్వేషణ


(11 వ పేజీ తరువాయి)

ఈ వికిరణం, పదార్థం ఎక్కడ నుండి వచ్చేయి? ఆది శక్తి లోంచి. ప్రదేశం వ్యాపిస్తూ పదార్థంతో నిండుతూ ఉంటే కాలం ముందుకు నడవటం మొదలు పెట్టింది. అనంతమైన ఉష్ణోగ్రతతోటీ, అనంతమైన వక్రతతోటీ ఉన్న ఆ ఆదిజ్వాల వ్యాప్తి చెందుతూ, వక్రీభవనం తగ్గుతూ, చల్లారుతూ ఉండగా, క్రమేపీ క్షీరసాగరాలు, నక్షత్రాలు, గ్రహాలు పుట్టేయి. వాటిలో కొన్నిటి మీద ప్రాణి పుట్టింది. ఆ ప్రాణికోటి మిలియన్ల సంవత్సరాలు పరిణతి చెందిన తరువాత మానవుడు పుట్టి, తలెత్తి ఆకాశంలోకి చూసేడు. చూసి, "కస్త్వం, కోహం?" అని అడిగేడు.

**7. పిదప కాలపు వాదాలు**

కానీ పైన ఉటంకించిన వాదంలో బలం లేదని వాదించే పిదప కాలపు సైంటిస్టులు రావడంతో ఆది శక్తి నిజ స్వరూపం ఏమిటన్నది కొంచెం వివాదాస్పదంగా తయారయింది. ఇటీవలి కాలంలో కొత్తగా పుట్టుకొస్తున్న వాదనల ప్రకారం, మనం పైన లెక్క కట్టిన శక్తి మనకి "కనిపించే" శక్తి కనుక దీనిని "గోచర శక్తి" - లేదా, ఇంగ్లీషులో "పాజిటివ్ ఎనర్జీ" అంటున్నా రు. మనకి "కనిపించని" శక్తి స్వరూపం మరొకటి ఉందిట. అది మాయా శక్తి. దీనిని "నెగెటివ్ ఎనర్జీ" అంటున్నారు. దీనిని వివరించడానికి స్టీవెన్ హాకింగ్ ఒక ఉదాహరణ చెబుతారు. రెండు భారీ బంతులని దగ్గరగా పెట్టినప్పుడు వాటి మధ్య ఉండే గోచర శక్తి తక్కువగా ఉండి, వాటిని విడదీసి, మధ్య దూరాన్ని పెంచి నప్పుడు వాటి మధ్య ఉండే గోచర శక్తి ఎక్కువ అవుతుంది. ఈ ఎక్కువ అయిన శక్తి ఎక్కడ నుండి వచ్చింది? ఆ బంతుల మధ్య ఉండే పరస్పర గురుత్వా కర్షణబలాన్ని అతిక్రమిస్తూ మనంప్రయోగించిన శక్తి నుండి! మనం వెచ్చించిన శక్తి గోచర శక్తి అవుతుంది, గురుత్వాకర్షణ శక్తి మాయా శక్తి అవుతుంది. ఈ రెండూ సమానం కనుక విశ్వంలో నికరంగా ఉన్న శక్తి సున్న!! అనగా, "ఈ విశ్వం శూన్యం నుండి పుట్టుకొచ్చింది" అంటున్నారు భౌతిక శాస్త్రంలో ఉద్దండులైన కొందరు పెద్దలు.

# వేదుల సుబ్రహ్మణ్యం



## దైవ చింతనము

మ. జననంబిచ్చి నిరంతరంబును సురక్షాశ్రేయముల్గూర్చి తా
మనురాగంబును రంగరించి కడునాయాసంబు కున్నోర్చి స
జ్జనులన్ జేయగ సంతసిల్లు పితరుల్ సారూపులై భూమిపై
మనుచున్నుండు నుమామహేశ్వరులుగా మన్నించి మ్రొక్కందగున్ ll 1

మ. క్షణికావేశమకృత్యముల్ సలుప నాశంబున్ ప్రకల్పించు ధో
రణి పెంపొంది యమానుషంబు ప్రబలన్ ప్రాప్తించు పాపంబులన్
గణియింపంగ నశక్తుడై యలసి యా గౌరీశునర్థింప దు
ర్గుణముల్ బారగద్రోలి సుస్థిరమనస్కున్ జేయడే భూమిపై ll 2

శా. ప్రాయంబందున నిన్నునెప్పుడు మదిన్ పట్టించుకోకుండినన్
కాయంబందున శక్తి సన్నగిలనా కాలంబు నెట్టంగ నీ
సాయంబే శరణంబటంచెరుగు సంస్కారంబునున్ బెంచి లే
ప్రాయంబందునె భక్తి భావనల సంప్రాప్తింపగన్ జేయవే! ll 3

శా. అష్టైశ్వర్యములుండికూడ మనసు న్నావేదనల్ గ్రుచ్చగన్
కష్టంబై సుఖశాంతులన్ బడయలేకన్ దేహదార్ఢ్యంబునున్
నష్టంబొందిన కాలమందు నెదియైనన్ గూర్చునే స్థైర్యమున్?
పుష్టింజెందిన దైవచింతన మదిన్ పూడ్చంగ నొప్పానిలన్ ll 4

శా. ఇష్టిందీర్చగ జేయు కార్యములు సొంపీడేరంగ లేనప్పుడా
క్లిష్టంబైన సమస్యలన్ మునిగి తా క్లేశంబునంజిక్కి "యీ
సృష్టింజన్మము నెందుకిచ్చితివయా శ్రీ శంకరా"యన్న నా
కష్టంబుల్ దొలగంగ జేయడె మదిన్ కైమోడ్చి ప్రార్థించినన్ ll 5

శా. పొంజాయించి సభక్తి పూర్వకముగా పూర్ణార్తితో నిన్మదిన్
సంజాతంబగు సంస్కృతిన్ వెలయు సంస్కారంబుతో పూజలన్
రంజింప న్నినుగొల్చు భాగ్యము సదా రాణింప నాయత్నమున్
భంజింపంగ నశక్తమై నిలుచు సద్భావంబు కల్పించవే! ll 6

శా. ఆ క్రూరాత్ములు చిన్నిబాలికల కత్యాచారమున్ సల్పునా
డుక్రోషంబున నేమి జేయనగునో యూహింపగన్ రాదొకో!
ఆక్రోశించుట యెన్నినాళ్లిక ప్రభూ! ఆలస్యమేలా వెసన్
నీ క్రోధంబురగిల్చి దుర్మతుల నగ్నిన్ బుగ్గి గావింపవే! 7

శా. గోవిందాయని గొంతునెత్తి మది నాక్రోశింప వెన్వెంటనే
త్రోవంజూచుకు నాపదల్ తమకు దా దూరంబు వైదొల్గవే!
సేవింపంగల దైవమెద్ది ధరలో శ్రీవేంకటేశున్ వినా!
భావింపంగలదే మరొక్కటి మహద్భాగ్యంబు నెన్నంగిలన్! ll 8

# శ్రీనాధుని కాశీ ఖండం

## (వచనానుసరణం)


## పోచినపెద్ది మురళీ కృష్ణ




### ముందు మాట

కాశీ క్షేత్రంతో భారతీయులకు ఎంతో విడదీయరాని అనుబంధం ఉంది.. జన్మించినా, మరణించినా కాశీ క్షేత్రంలోనే జరగాలని భారతీయులు భావిస్తారు. అంతటి పవిత్ర క్షేత్ర వైభవాన్ని వర్ణించని భారతీయ సాహిత్యం లేదు. స్కాంద పురాణంలో వ్యాసుడు కాశీ వైభవాన్ని విస్తృతంగా వర్ణించాడు. తెలుగు సాహిత్యంలో శ్రీనాధుడు ప్రప్రధమంగా ప్రబంధ రీతిలో కాశీ క్షేత్రాన్ని వర్ణించాడు. ఈ కాశీ ఖండాన్ని మా పాఠకులకు పరిచయం చేయడానికి డా. పోచినపెద్ది వెంకట మురళీ కృష్ణ గారిచే సరళ వ్యావహారిక భాషలో, యధా మూలానుసారంగా అనుసరించిన కాశీ ఖండాన్ని, నెలనెలా అందిస్తున్నాము.

ఈ వ్యాస పరంపర ఆధ్యాత్మిక వేత్తలకు భక్తీ తత్వాన్ని, విద్యార్థులకు శ్రీనాధుని తత్వాన్ని అందించగలదని భావిస్తున్నాము.

\- సంపాదకురాలు.

"సంయమివరా! ఇటురా!" అనిచేయి ఎత్తి పిలిచింది. ఆమె చేతి కంకణాలు ఘల్లు, ఘల్లు మంటున్నాయి. " కడుపు నిండా తినడానికి తగినంత బిక్షాన్నం లభించనందుకు నీవు ఈవిధంగా చింతించుట తగునా? ఇది నీకు మేలా? నీవు శాంతుడువా? ఏపూటకాపూట పిడికెడు నివ్వెర ధాన్యాన్నిదంచుకొని భోజనంచేసేవారు, ఆకులుతిని బ్రతుకువారు, దుంపలు తిని బ్రతుకు వారు, వరిమడులలో ధాన్యాన్ని ఏరుకొని తినేటటువంటి తాపసులు నీకంటె తెలివి తక్కువ వారా? ఉన్న ఊరు కన్న తల్లి అను సామెత విని ఉండలేదా? శివుని భార్య అయిన అర్ధాంగ లక్ష్మి ఈ కాశీ నగరం. ఇటువంటి కాశీ నగరాన్ని శపించవచ్చా? వేయి శాఖలతో సామవేదము, ఇరువదియొక్క శాఖలతో ఋగ్వేదము, తొమ్మిది శాఖలతో అధర్వణ వేదము, నూటొక్క శాఖలతో యజుర్వేదము కాశీనగరంలో ఒదిగి ఉంటాయి. ఇటువంటి కాశీ నగరాన్ని నిందించుట తగునా? బ్రాహ్మణుడవు కనుక నీవేమన్నా చెల్లుతుంది. ఆకలితో ఉన్నావు. నిన్ను ఇప్పుడు ఏమి అనకూడదు. మా ఇంటికి భోజనానికి రా. భోజన మయిన పిదప నీతో కొన్ని మాటలు మాట్లాడవలసి ఉంది. నా భర్త వైశ్వదైవము మొదలయిన నిత్యవిధులను ఆచరించి అతిధి రాకకోసం నిరీక్షిస్తున్నాడు. ఎట్టి క్లిష్ట పరిస్తితిలోనైనా నా భర్త అతిధి లేకుండా భోజనం చేయడు. గంగానదిలో స్నానంచేసి త్వరగా రా. మా ఆయన పదియవ ఘడిలోని వాడు. ఆకలికి తట్టు కోలేడు. సూర్యుడు పడమటి దిక్కునకు వాలుచున్నాడు" అని ఆ ముత్తైదువ వ్యాసుని భోజనానికి పిలువగా "ఓ కళ్యాణీ! ఈ కాశీ నగరంలో నిన్ను ఎన్నడు చూడలేదు. రాహువు కోరలనుండి జారిపడిన చంద్రునివా? నన్ను కాపాడుటకు వచ్చిన ధర్మ అదృష్ట దేవతవా? కైవల్యలక్ష్మివి అయి ఉంటావు.

కామినీ రూపాన్ని ధరించిన కాశికా పురివా? ఆకలిగొన్నవారికి అమృతాన్నాన్ని పెట్టే విశాలాక్షివి నీవు. నీవు చెప్పినట్లు చేస్తాను. నేను బ్రాహ్మణుడను అగుటవలన చపలబుద్ధి కలవాడను. పుణ్య సాధ్వి! కృపతో నన్ను రక్షించు. నీపేరు చెప్పు." అని అడిగాడు.



"నీవుఆకలితో ఉన్నావు. భోజనానంతరం అన్ని విషయా లు స్పష్టంగా చెబుతాను. భోజనవేళ అతిక్రమించినది. గంగానదికి వెళ్ళి స్నానంచేసి త్వరగా భోజనానికి రా!" అని ఆ ముత్తైదువ పిలిచింది.

"తల్లీ! నాదొక విన్నపము. నేను ప్రతి దినం బిక్షకు వెళ్ళి వచ్చు సమయంలో నాశిష్యులైన పైల, సుమంతాదులు కఠ శాఖ, కఠోపనిషత్తు, చదువుతూ కా శి కా పు ర ము యొ క్క సూర్యవీధిలో కలుస్తూ ఉంటారు. అక్కడనించి మేమందరము కలసి ఆశ్రమానికి వచ్చి, అందరు తెచ్చిన బిక్షాన్నాన్ని రాశిగా పోస్తాము.

పాయసము,పిండివంటలు, పప్పు మొదలైన పదార్థాలను రాశిగా పోసి, అందులో సగ భాగాన్ని అతిథులకోసం పాత్రల లో నింపి పక్కనపెట్టి, మిగిలిన భాగాన్ని గంగాజలముతో ప్రక్షా లితము చేసి, పెద్ద, చిన్న తారతమ్యాన్ని పాటిస్తూ, 'ప్రాణా ఘ్నిహోత్రము' చేస్తాము. ఇంత కాలము ఈ వ్రతము సాగినది.

"ఓ మధురభాషిణి! కాశీ పట్టణమునందు ఒట్టు పెట్టిన ట్లుగా బిక్షాన్నము లభించలేదు. నిన్నటినుండి అందరము శుష్కోపవాసము చేస్తున్నాము. ఇది చాల ఆశ్చర్యకరమైనది. నా శిష్యులు ఆహారంలేక నీరసించి భిక్షాపాత్రలు పట్టుకొని కాశీ వీధులలో తిరుగుతున్నారు. వారి ని విడిచిపెట్టి ఆకలికి తట్టుకోలేక నేనొక్కడనే నీ ఇంటిలో ఏవిధంగా భోజనం చేస్తాను. నేనుగాక పదివేలమంది శిష్యులున్నారు. వారిని విడుచిపెట్టి భోజనము చేయుట యుక్తముకాదు. సూ ర్యుడు అస్తమిస్తున్నాడు. ఇప్పుడు భోజనము చేయుట యుక్తము కాదు." అని వ్యాసుడు పలుకగా..

"అన్నపూర్ణాదేవి చిరు నవ్వు నవ్వుతూ ఓ మునివరా! నీ శిష్యులనందరిని తీసుకొని శీఘ్రముగా రా. విశ్వనాధుని కృపవలన ఎందరు అతిధులు వచ్చినా కామధేనువు ఉన్నట్లుగా ఎంతమంది అతిధులు వచ్చినా మృష్టాన్నాన్ని పెడతాను. అందరిని తీసుకొని రా" అని పిలిచింది.

వేదవ్యాసుడు తన శిష్యులను కలుపుకొని గంగా నదిలో స్నానంచేసి, భోజనానికి వచ్చారు. పావకోళ్ళు, మ్రోగుతుండగా ఆ ఇల్లాలు వేదవ్యాసుని, అతని శిష్యులకు ఎదురుగా వచ్చి వారిని ఆహ్వానించి, భోజనశాలలో పంక్తి లో కూర్చోపెట్టింది.

ఆ విశాలాక్షి వారికి బంగారు వన్నెగల అరిటాకులు వేసిం ది. నానా విధములయిన పిండి వంటలు వడ్డించింది. అపూ పాలు, లడ్డూలు, ఇడ్డెన లు, కుడుములు, అప్పాలు,

విప్పట్లు(బొబ్బట్లు), జిల్లేడు కాయలు, దోసెలు, సేవియలు, అంగర పూవియలు, జంతికలు, జొత్రికలు, జక్కిలాలు, మోరుం డాలు, చెరుకు గడలు, ముద్ద ఖర్జూరము, ద్రాక్ష పండ్లు, కొబ్బరి, పనస, నేరేడు పండ్లు, మామిడి పండ్లు, మామిడి పండ్లు, గజ నిమ్మ, దానిమ్మ పండ్లు, వెలగ పండ్లు, రేగు పండ్లు, గసగసాలు, పులగము, చెఱుక బెల్లము, అ రి సె లు , తా మ ర తూ డు వరుగులు, తియ్యకంద వ ం ట కా లు , ద్ర వ ప దా ర్థా లు , పుల్లటి వరుగులు, అప్పడాలు, పప్పులు, రొట్టెలు, చాపట్లు, పా య స ము , కా క ర కా య , గు మ్మ డి కా య , పొ ట్ల కా య , బీరకాయ, సొరకాయ, ముల క్కాయలు,మేడికాయ,వంకాయ, దొండకాయ, పచ్చితామర దుద్దులు, అరటి కాయలు, చారులు, తియ్యని కూరలు, పచ్చళ్ళు, కిచిడీలు, చిత్రాన్నము, బజ్జీలు, గిజ్జిణిలు, వడియాలు, కడియాలు, సుగంధ ద్రవాలు, ఉండ్రాలు, పేలాలు, పుణుకులు, చలిమిడి, గారెలు, తేనె తొనలు, రాగిపిండి వంటకాలు, పిండెలు, మోదకా లు, పానకాలు, కూరలు, తెల్లని అన్నము, షర్బత్తులు, పానకాలు, మజ్జిగ పులుసు, ఊరగాయలు, అంబళ్ళులు, రసములు, ఇంగువ, మెంతులు, జీలకఱ్ఱలతో పోపుపెట్టిన పదార్థ ములు, కొత్తిమీర, కరివేపాకు, ఏలకులు, మొదలగు సుగంధ ద్రవ్యాలతో కూడిన పదార్థాలు, వడ్డించింది.

భోజనశాలల కిటికీలనుండి అగరు ధూమము, మిరియము, పసుపు, శొఠి, సైంధవలవణము, పిప్పళ్ళు, అల్లము, చింతపండు, ఇప్పపూవు, వెన్న మొదలగు పదార్థముల సువాసనలు రాజవీ ధులలో నికి వస్తున్నాయి.

రక్తాసోకము చిగురాకువంటి జటాజూటమును ముడిచి, బంగా రముతో పొదిగిన రుద్రాక్షలు చెవిపోగులుగా ధరించి, బొజ్జపై నీరుకావి ధోవతి ధరించి, ఆపాదమస్తకము భస్మాన్ని పూసుకొని, మూర్తీభవించిన పాశుపత దీక్ష వలె, పురుషాకృతి దాల్చిన శాంతిగుణమువలె ఉన్న పరమేశ్వరుడుఆ పంక్తి మధ్యలోకి వచ్చి తాపసులందరికి అన్నాన్ని వడ్డించాడు. ఆ తాపసులందరు చతుర్విధ పదార్థాలను ఆరగిం చుచున్న సమయంలో విశాలాక్షి విసనకఱ్ఱతో వీచుచుండగా, వారు భోజనం ముగించారు.

తరువాత అందరు ఆస్థాన మండపంలో కూర్చున్నారు. విశాలాక్షి విశ్వేశ్వరులు సుఖోప విష్టులయి వ్యాసుని పిలిచారు. వ్యాసుని అడగవలసిన మాటలు అడగమని కనుసన్న చేసాడు. విశాలాక్షి పరమేశ్వరుని భావాన్ని గ్రహించి "నీవు కడుపుడునిండా భోజనంచేసావా? నీ శిష్యులు మొగమాటము లేకుండా భోజనం చేసారా? భోజనానికి రాకుండా ఉన్న శిష్యులు ఎవరైనా ఉన్నారా? అని అడిగింది.

ఆ ముత్తైదువ ఈ విధంగా ఆదరంగా పలుకగానే వ్యాసుడు "ఓ మహాదేవి! ఆరు రసాలు ఎక్కువ, తక్కువ, ఎక్కువ తక్కువలు అను మూడు విధములుగా ఉన్నాయి. మొత్తం పదునెనిమిది రకాల పదార్థాలు ఆశ్వాదించాము. రెండు రోజుల ఉపవాసం వలన కలిగిన ఆకలి చల్లారినది. మా శిష్యులలో భోజనము చేయనివారు ఎవరు లేరు. భోజనపాత్రలో వివిధ రకాలయిన అన్నాలు, కూరలు, పచ్చళ్ళు తమమతట తామే ఉద్భవించుట మేము చూచి ఉండలేదు. మీ ప్రభావము మీకే తెలియాలి. నీవు విశాలాక్షివి, ఈ అయ్య విశ్వేశ్వరుడు అయి ఉండవచ్చు" అని వ్యాసుడు పలుకగానే కాశీ యెడ వ్యాసుడు చేసిన అపరాధానికి తగిన శిక్ష విధించదలచి విశాలాక్షి ఈవిధంగా పలికింది.

ఓ! వేదవ్యాసా! వేదవిభాగము చేసిన జ్ఞానవంతుడవు. ఈరీతి గా మృష్టాన్నాము లభించని రోజున కాశీనగరాన్ని శపిం చవచ్చునా? నీకిది ధర్మమా? ఇటువంటివాడవు పదునెనిమిది పురాణాలు చెప్పగలిగావు.

వేదవిభాగము చేయగలిగావు? భారతాన్ని రచించగలిగావు. నిర్మల జ్ఞానము గల నీకు కోపం ఉండవచ్చా? పుణ్య తీర్థ నివాసం చేసిన నీకు కోపం ఉండవచ్చా? నీవు కాశీపై కోపగించినట్లయిన పరమేశ్వరుడు నీపై కోపించడా? వారణాసి మోక్షస్థానము. ఈ తీర్థానికి అన్యాయం తలపెట్టిన వాడు రుద్ర పిశాచి అవుతాడు" అని పలికి అన్నపూర్ణ పరమేశ్వరుని వైపు చూసింది.

"వీడు కాశీనగరంలో ఉండుటకు తగునవాడు కాడు. వెళ్ళిపొమ్మను. కోపంగలవాడు మోక్ష ప్రదాయిని అయిన కాశీనగరంలో ఉండడానికి తగిన వాడు కాదు" అని పరమేశ్వరుడు కోపంతో పలికాడు. వెంటనే వ్యాసుడు ఆదిదంపతుల కాళ్ళమీద పడి "నేను అపరాధం చేసాను. కోపాన్ని ఉపసంహరించండి" అని ప్రార్థించాడు. "కాశీనగరంలో ప్రతీ మాసశివరాత్రి శిష్యులతో సహా ఉండవచ్చు. మిగిలిన రోజులలో వారణాశికి ఐదుక్రోశుల దూరంలో నివశించు" అని చెప్పి పార్వతితో సహా పరమేశ్వరుడు అంతర్ధాన మయ్యాడు. వ్యాసుడు పరమేశ్వరుని ఆజ్ఞను అనుసరించి కాశీనగరానికి దూరంగా ఉన్న అరణ్యంలో నివశించాడు.

క్షేత్ర తీర్థ కదంబ వర్ణన

ఈ విధంగ వ్యాసుని వృత్తాంతాన్ని కుమారస్వామి అగస్త్యునికి వివరించి చెప్పాడు. కాశీనగరంలో ఉన్న తీర్థాలను శివలింగాలను గూర్చి వివరించి చెప్పు" అని అగస్త్యుడు ప్రార్థించాడు. " ఇదేప్రశ్న మా అమ్మ నా తండ్రిని అడిగింది. ఆయన మా అమ్మకి చెప్పిన వృత్తాంతాన్ని నీకు చెబుతాను విను" అని కుమారస్వామి ఈ విధంగా చెప్పడం ప్రారంభించాడు.

"విశాలాక్షీ! నాచుట్టూ ఐదు క్రోశుల దూరంలో గూఢమైనవి, ప్రకటితమైన లింగాలు అనేకం ఉన్నాయి. అదేవిధంగా అనేక క్షేత్రాలు, దిగుడు బావులు, చెరువులు, పుణ్య తీర్థాలు ఉన్నాయి. వాటిలో నాకు స్ఫురించినవి చెబుతాను, ఆలకించు" అని పరమేశ్వరుడు ఈవిధంగా చెప్పడం ప్రారంభించాడు.

సారశ్వతేశ్వర లింగమును అర్చించినట్లయిన సాహిత్యంలో అభివృధి కలుగుతుంది. గోప్రేక్షణ లింగము దయాగుణాన్ని కిలిగిస్తుంది. దధీశ్వర లింగము పాపములనుండి విమోచనం కలిగిస్తుంది. అత్రీశ్వర లింగమును అర్చించినట్లయిన ఇహ లోకంలోను, పరలోకంలోను సుఖం కలుగుతుంది. విశ్వేశ్వర లింగము కల్ప వృక్షము వంటిది. ఆదికేశ్వర లింగము సంసార క్లేశాలను పోగొడుతుంది. సంగమేశ్వర లింగము తంగేటి చెట్టుకు పట్టిన తేనె పట్టు వంటిది. చతుర్ముఖేశ్వర లింగమును అర్చించినట్లయిన భయాలు పోతాయి. శాంతీశ్వర లింగము భక్తులకు చింతామణి వంటిది. కాంతీశ్వర లింగాన్ని అర్చించినట్లయిన సంతానం కలుగుతుంది.

కపిల హ్రదము మదజనితమైన రోగాలు నశింపచేస్తుంది. అనసూయేశ్వర లింగము కొంగు బంగారము వంటిది. సిద్ధి వినాయకుడు కామదుగ్ధేనువు. హిరణ్య కశిపుడు ప్రతిష్ఠించిన లింగము ముంగిట ఉన్న పెన్నిధి వంటిది. మందారేశ్వర లింగము మందార వృక్షము వంటిది. స్కందేశ్వర, ప్రసన్న వదనేశ్వర లింగములు శాశ్వత ఐశ్వర్యాన్ని కలిగిస్తాయి. ప్రసన్నోద కుండము పాపాలను నశింప చేస్తుంది.అట్టహాశేశ్వరలింగము తీవ్రపాపాలను నశింప చేస్తుంది. మిత్రావరుణ, వృద్ధ వశిష్ట, కృష్ణ, యాజ్ఞ్యవల్క, ప్రహ్లాద, వైరోచనేశ్వర లింగాలు సర్వాభీష్ట ప్రదాయకములు. బాణేశ్వర, విద్యేశ్వేర, తంద్రేశ్వర లింగాలు అశుభాలను పోగొడతాయి. వీరశ్వర లింగము పంచ ముద్ర పీఠములపై పట్టాభిషేకము చేయబడినది. వాలి, హనుమ, అశ్వినేశ్వరలింగాలు మంగళ ప్రదములు.

**(ఇంకా వుంది)**

# ఆర్. శర్మ దంతుర్తి

# తెలుగు పద్య రత్నాలు - 2

ఉ. **ముప్పున గాలకింకరులు ముంగిట నిల్చినవేళ, రోగముల్**
**గొప్పరమైనచో గఫము కుత్తుకనిండినవేళ, బాంధవుల్**
**గప్పినవేళ మీ స్మరణ గల్గునో గల్గదో, నాటి కిప్పుడే**
**తప్పక చేతు మీ భజన ....**

చాలామందికి తెల్సిన శతకంలోనిదే ఈ పద్యం. అయితే ఇది ఏ శతకం లోనిదనేది కనిపించకుండా ఉండడానికి నాలుగో పాదం అసంపూర్తిగా ఉంచుదాం ప్రస్తుతానికి. ఇది ఎవరు రాసారో చెప్పండి చూద్దాం?

మనలో చాల మందికి ఉన్న భ్రాంతి ఏమిటంటే, జీవితం అతి చిన్నది. ఉన్నవి దొరికినంతలో ఎక్కడికక్కడ అనుభవించాలి. ఎప్పుడో రాబోయే చావుకి ఇప్పట్నుంచీ ఎందుకు గొడవ? అది రావడానికి ముందు యవ్వనం, ఉద్యోగం, పెళ్ళీ, పిల్లలూ అవీ కానిచ్చి వార్ధక్యం వచ్చాక అప్పుడు రామా కృష్ణా అనుకోవచ్చు. అయితే ఇందులో ఉన్న చిక్కు ఏమిటంటే, మనం జీవితంలో రోజూ ఏ విషయంమీద మనసు పెడతామో అదే మనకి అలవాటౌతుంది. అంటే జీవితాంతం పెళ్ళీ, పిల్లలూ, వాళ్లజీవితాలూ మిగతా అనుభవాలు అవీ ఆనందిస్తూంటే ఈ లోపునే మనకి ఏ రోగమో అంటుకోవడం జరుగుతుంది. అప్పుడు ఇన్నాళ్ళూ అసలు ప్రయత్నమే చేయని మనకి నోట్లోకి కానీ మనసులోకి కానీ భగవం-



తుడు గుర్తుకు వస్తాడా? పోనీ ఎంతకాలం బతుకుతాం అనేది మనకి తెలుసా? ఈ పద్యంలో చెప్పేది అదే.


చావు వచ్చేటప్పుడు కాలకింకరులు – యముడి భటులు వచ్చి గుమ్మంలో నించున్నారు. నేను రాను, ఇంకా కొంచెం సమయం కావాలి అని అడగడం కుదరదు. రోగముల్ గొప్పరమైనచో – విపరీతమైన వ్యాధితో వళ్ళు కుళ్ళుపోయింది. ఆ వ్యాధులవల్ల గొంతుకలో కఫం నిల్చిపోయి మాట రావడంలేదు. మనసంతా వ్యాకులం చచ్చిపోతానేమో అని. అప్పుడైనా భగవంతుడి రూపు గుర్తు తెచ్చుకుందామంటే చుట్టూరా బంధువులు – బాంధవుల్ కప్పినవేళ – తమ మొహం చూపించడానికి వాళ్ళకి తహ తహ, పోయేవాడికి చివరి చూపు ఎవర్ని చూద్దామా అనే. అప్పుడు నీ స్మరణ కలుగుతుం-

దో లేదో? భగవంతుడా ఇప్పుడే, బలసత్వాలు ఉన్నప్పుడు నీ భజన చేస్తాను అంటున్నాడు కవి.

ఇంతకీ కవి ఎవరో కనిపెట్టారా? లేకపోతే ఈ నాలుగోపాదం చదవండి పూర్తిగా

**తప్పక చేతు మీ భజన**
**దాశరథీ కరుణాపయోనిధీ**

ఇది కంచర్ల గోపన్నరాసిన దాశరథీ శతకంలోనిది. గోపన్న భద్రాద్రి రాముడికీ ఆయన పరివారానికీ నగలు ప్రభుత్వ సొమ్ముతో చేయించి, దాని వల్ల కారాగార శిక్ష అనుభవించి రాముడి కోసం ప్రాణాలు పణంగా పెట్టినవాడు. ఏ పరిస్థితుల్లో కూడా ఎప్పుడూ రాముడి మీద నమ్మకం పోగొట్టుకోలేదు. అన్నింటి కన్నా విచిత్రం, ఇంత చేసి గోపన్న కూడా రాముణ్ణి వేడుకుంటూ, “క్రూరకర్మములు నేరక చేసితి, నేరములెంచకు రామా, ఏ తీరుగ నను దయచూచెదవో అనగల అతి చనువున్న భక్తుడు. అయితే ఆయన ఆలకించకపోతే, “పలుకే బంగారమాయెనా, కోదండపాణి పలుకే బంగారమాయెనా?” అని దబాయించగలడుకూడా. అలా అడిగినా ఇంకా ఏమీ చేయకపోతే, “సీతమ్మకు చేయిస్తి చింతాకు పతకము రామచంద్రా ఆ పతకమునకు పట్టె పదివేల వరహాలు రామచంద్రా కలికి తురాయి నీకు మెలుకువగ చేయిస్తి రామచంద్రా నీవు కులుకుచు తిరిగేవు ఎవరబ్బ సొమ్మని రామచంద్రా” అని వెక్కిరించగలడు కూడా.



అంటే భగవంతుణ్ణి ఎక్కడో ఉన్నాడనీ ఎప్పుడో వస్తాడనీ కాకుండా, ఇప్పుడే, ఇలారా, వస్తావా, లేదా అని అడగగల సత్తా ఉన్నప్పుడు ఆయన వచ్చితీరుతాడు. ఎంత త్వరగా వస్తాడనేది, మన మనఃస్థితి బట్టి ఉంటుందనేది తెలుసుకుంటే చాలు. గజేంద్రుడిలా మారి ‘కావవే రక్షించు భద్రాత్మకా’ అన్నప్పుడు ఆ రావడం “సిరికిం జెప్పడు శంఖ చక్రయుగమున్ చేదోయి సంధింపడే...” అన్నట్టూ మనకి అవగతం అవుతుంది.

ఇదే రామకృష్ణ పరమహంస చెప్పడం కూడా మనం చూడవచ్చు. “అమ్మ భవానీ ఏదైనా ఇవ్వగలదు. వెళ్ళు, దభాయించి అడుగు, నువ్వు ఉన్నావా, ఉంటే రా వచ్చి నాకు కనిపించు. ఆనందం అనేది అడిగి మరీ తీసుకో. అలా నమ్మకంగా త్రికరణశుద్ధిగా అడిగినప్పుడు ఇవ్వనూ అని ఎలా అంటుంది?”

బుద్ధుడు సన్యాసం తీసుకున్నప్పుడు కూడా, జవసత్వాలు ఉన్నప్పుడే కానీ, ఎప్పుడో ముసలితనం వచ్చాక కాదు. అదే రామదాసు ఈ పద్యంలో చెప్పేది. ఎప్పుడో యముడి పిలుపు వినిపించినప్పుడు మనం ఎక్కడ ఉంటామో, ఏ స్థితిలో ఉంటామో? అప్పుడు అసలు మన మనసులో ఏముంటుందో ఎవరికెరుక. అందుకే ఇప్పటినుంచే – అంటే గుర్తు వచ్చినప్పటినుండి, జవసత్వాలు ఉన్నప్పటినుండే భగవంతుణ్ణి స్మరించాలి అని చెప్తున్నాడు గోపన్న.

# తుమ్మూరి రాంమోహన్ రావు



## తెలంగాణా మహానుభావులు

### బి. ఎన్. శాస్త్రి --- శాసనాల శాస్త్రి

బి.ఎన్.శాస్త్రిగానో, శాసనాలశాస్త్రి గానో అందరికీ సుపరిచితులైన ప్రముఖ చారిత్రక పరిశోధకులు-,కవి, నవలా రచయిత,పత్రికా సంపాదకులు శాస్త్రి గారి పూర్తి పేరు భిన్నూరి నరసింహశాస్త్రి.

పది విశ్వవిద్యాలయాలు చేసినంత పరిశోధన ఒక్కచేతిమీదుగా చేయడానికి చేస్తున్న అధ్యాపకవృత్తిని సైతం త్యజించిన వ్యక్తి.అంతేకాదు తాను ఎన్నో ఆధారాలతో నిరూపించి నన్నయకంటే మందువాడు నాచన సోముడు అన్న ప్రతిపాదన వెనక్కి తీసుకుంటేనే

పి.హెచ్ డి.పట్టా ఇస్తామని ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆంక్ష విధిస్తే,రాజీ పడకుండా డాక్టరేటును వదులుకున్న ఘన చరిత్రుడు.1000 వరకూ శాసనాలను పరిశీలించి స్వయంగా 400 శాసనాలు పరిష్కరించటం, కనుగొనడం ఆయన పరిశోధనా పటిమకు నిదర్శనం. 12 శాసన సంపుటాలను, 5 సర్వస్వములతో పాటుగా ఆంధ్రదేశ చరిత్ర-సంస్కృతిని తెలిపే 20 భాగముల బృహత్ గ్రంథాలను ఒంటిచేత్తో లిఖించి చరిత్ర పూర్వాపరాలు జాతికి అందించిన పరిశోధకాగ్రేసరుడు శాస్త్రిగారు.

ప్రస్తుత యాదాద్రి భువనగిరి జిల్లా రామన్న పేట మండలం తుమ్మలగూడెంలో శ్రీమతి సరస్వతమ్మ,
శ్రీ రామకృష్ణయ్య పుణ్య దంపతులకు 10తేది డిసెంబరు నెల 1932 లో జన్మించారు శాస్త్రిగారు.వీరి స్వగ్రామం నల్గొండజిల్లా వలిగొండ.తాను జన్మించిన పెద్ద తుమ్మల గూడెమే ఒకప్పటి విష్ణుకుండినుల రాజధానియైన ఇంద్రపాలనగరమని నిరూపించారు.విష్ణుకుండినులకు చెందిన రెండు శాసనాలపై శాస్త్రిగారు ప్రత్యేక అధ్యయనం చేశారు. అవి-గోవింద శర్మ శాసనం, విక్రమేంద్ర భట్టారక వర్మ శాసనాలు. వీటి ఆధారంగా విష్ణుకుండినులు తెలంగాణ ప్రాంత పాలకులని, వీరి రాజధాని నేటి ఇంద్రపాలనగరం(పెద్ద తుమ్మలగూడెం) అని చరిత్రను తిరగరాశారు.



ఈయన ప్రకారం క్రీ.శ. 388-90 మధ్య మహారాజేంద్రవర్మ ఇంద్రపాల నగరంను స్థాపించి, తెలంగాణ ప్రాంతాన్ని ఏలినారు.

అంతకుపూర్వం అమరావతి, విజయవాడ, వేంగి, దెందులూర్లనే విష్ణుకుండినులు పాలించినట్లు చరిత్రకారులు గుర్తించగా, శాస్త్రిగారి పరిశోధన మూలంగా సజీవచరిత్ర బయటికి వచ్చింది. అప్పట్లో ప్రసిద్ధ సాహిత్య పత్రిక 'భారతి' లో ఈ విషయమంతా రాసి శాస్త్రిగారు అందరిక దృష్టిలో పడ్డారు.

బాల్య దశలో ఒక కోనేరు వద్ద ఆటలాడుతున్న శాస్త్రి గారికి ఒక శిలాఫలకం కనిపించింది. దాన్ని చదవడానికి ప్రయత్నించినా అది సాధ్యం కాలేదు. నాటి

నుండే శాసనాలపై ఆయన దృష్టి మళ్ళినట్లుంది. క్రమంగా ఆయన జీవితమంతా శాసనాలకు, వాటి ఆధారంగా చరిత్రకు ఆయువు పోస్తూ సాగింది.

చిన్ననాడే పెద్ద బాలశిక్ష పూర్తి చెయ్యటమే కాక పద్యాలను ఒంటబట్టించుకున్నారు. ఉర్దూ, తెలుగు, ఆంగ్లం, సంస్కృతం, పాళీ వంటి భాషలు చిరుప్రాయం నుండే నేర్చుకోవటం ప్రారంభించి సఫలీకృతులయ్యారు. అంతటితో ఆగక ఎన్నో ఒడిదుడుకుల మధ్యన 1958లో బి.ఏ పూర్తి చేశారు. 1959లో ఓ.యూలో ఎం.ఏలో చేరి ఉత్తమ విద్యార్థిగా రాణించారు. నాడే ఓ.యూలో నిర్వహించిన సెమినార్లకు సంబంధించిన వ్యాసాలను మన సంస్కృతి-చరిత్ర అని, శ్రీనాథ భారతము అని రెండు సంకలనాలను వెలువరించారు. ఆచార్య ఖండవల్లి, బిరుదురాజు, పల్లా దుర్గయ్య వంటి పెద్దల ఆశీస్సులు పొందారు.

నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమాలను 7వ తరగతి నుండే నడిపారు. ఉద్యమ పాటలు రాయటమే గాక నల్లగొండలోని ప్రొద్దుటూరులో రావి నారాయణ రెడ్డి నాయకత్వంలో నిర్వహించిన ట్రైనింగ్ క్యాంప్‌లో పాల్గొన్నారు. అంతేగాదు నిజాం కాలంనాటి పరిస్థితులను కళ్ళకు గట్టే విధంగా 'విప్లవ జ్వాల' నవలను రాసారు. వివిధ సందర్భాలలో వాటికనుగుణంగా రాధ, జీవన పథం, తీరని కోరిక, పరివర్తన, జీవితం-గమనం, సంధ్యారాగం అనే సాంఘిక నవలలను, వాకాటక మహాదేవి, తుక్కాదేవి అనే చారిత్రక నవలలను రాసారు. నీరాజనం గేయనాటికతో పాటు సహకారం, గ్రామజీవనం, కిరాయిదారు, రెండు నాటికలు అనే నాటికలను రచించారు. బాలగేయ కావ్యమైన శాస్త్రిగారి 'పాపాయి పతకం' గొప్పదైనదే. విమర్శకుడిగా ' కాశీ ఖండము దాని ప్రాశస్త్యము' అను గ్రంథం వెలువరించారు శాస్త్రిగారు

ఇవే కాక అనేకంగా అముద్రిత గ్రంథాలున్నాయి.

శాస్త్రి గారిని ఉత్తమ పరిశోధకుడిగా నిలబెట్టింది విష్ణుకుండినులపై చేసిన పరిశోధన. కొమర్రాజు, మల్లంపల్లి, నేలటూరి, మారేమండ వంటి ప్రముఖ చారిత్రకుల సరసన చేరే స్థాయికి ఈ పరిశోధన దోహదం చేసింది.

ఇదిలాఉండగా సురవరం ప్రతాపరెడ్డిగారు అప్పటికే 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర' 11వ శతాబ్దం నుండి కుంఫిణీ యుగం వరకు అందించారు. కానీ 11వ శతాబ్దం పూర్వపు చరిత్ర అస్పష్టంగానే మిగిలి ఉంది. ఒక సందర్భంలో కొమర్రాజుగారు తెలంగాణలోగల శాసనాలను సేకరించనిదే ఆంధ్రుల సంస్కృతి, చరిత్ర నిర్మాణం సమగ్రంగా కావు అని తన అభిప్రాయాన్ని వెల్లడించారు. ఇటువంటి కారణాలచేత బి.ఎన్. శాస్త్రి శాసనాలు పరిశోధన వైపే పూర్తిగా మొగ్గుచూపి ఆ దిశలో సాగారు.

మొదటగా 'శాసన సంపుటి 1,2 భాగాలు' అన్న గ్రంథం అచ్చువేసారు శాస్త్రి. ఎం.ఏ.లో అప్పటికే ఆంధ్రుల చరిత్ర-సంస్కృతిని అధ్యయనం చేసిన వాడు గనుక అనేకాంశాలపై విస్తృతంగా అవగాహన కలిగి వున్నాడు. 1974లో వచ్చిన ఈ గ్రంథంలో మొదటి భాగం విష్ణుకుండిన, మాఠర, కళింగుల ఐదు తామ్రశాసనాలను, రెండవ భాగంలో కందూరి చోడుల, కళ్యాణి చాళుక్యులు, కాకతీయ మొదలగు వంశస్థుల 33 శిలాశాసనాలు సవివరించారు. 72 శాసనాలకు సంక్షిప్త వివరణలతో పాటు 15 కొత్త శాసనాల వివరాలు గల మరో గ్రంథం 'త్రిపురాంతక దేవాలయ శాసనాలు'. 12 జ్యోతిర్లింగాల్లో 2వది శ్రీశైలం. శ్రీశైలానికి 8 దిక్కుల్లో 8 ద్వార క్షేత్రాలుండగా తూర్పు దిశలో గల ద్వార క్షేత్రమే ఈ త్రిపురాంతక దేవాలయం. దీన్ని గూర్చి చెప్పిందీ గ్రంథం. కాకతీయులకు సామంతులుగా తర్వాత స్వతంత్రులుగా గత కందూరి చోడుల రాజధానులు నల్లగొండలోని కొలనుపాక, పానగల్లు పట్టణాలని, మహబూబ్ నగర్‌లోని కందూరు,

కోడూర్, వర్ధమాన పురాలని తెలుపుతూ వారిచ్చిన అగ్రహారాలు, సువర్ణ గోదానాలను గూర్చి శిల్పకళను, సాహిత్య విశేషాలను గూర్చి దాదాపు 40 శాసనాలు సంపాదించి శాస్త్రి గారు పేర్కొన్న ఉద్గ్రంథం'కందూరి చోడుల శాసనాలు-చరిత్ర-సంస్కృతి'.

శ్రీకాకుళంలోగల ప్రసిద్ధ శైవక్షేత్రమైన ముఖలింగ దేవాలయ చరిత్రను ప్రకటిస్తూ 100కు పైగా శాసనాలతో కలిగిన పుస్తకం 'ముఖలింగ దేవాలయ చరిత్ర-శాసనములు'. దీన్ని గిడుగు-వెంకట సీతాపతి గారి స్ఫూర్తితో వెలువరించారు. మరో 95కుపైగా శాసనాలు కనిపెట్టి బెజవాడ ప్రాంతంలోని దుర్గామల్లీశ్వరాలయ లోకానికి చాటారు. ఈ గ్రంథంలో తెలుగు వచనం, తెలుగు పద్యాలు మొదలగు విశేషాలు శాసనాలపై ఎలా ఉన్నాయో ముద్రించారు. కుతుబ్‌షాహీలు అనగానే మదికి తట్టేది గోలకొండ. బహమనీ రాజ్యం క్రీ.శ. 1600లో 5 స్వతంత్ర రాజ్యాలుగా విడిపోగా, అందులో గోలకొండ రాజ్యం ఒకటి. గోలకొండ పాలకులు కొంతకాలం తర్వాత రాక్షసతంగడి యుద్ధంలో తుళువ వంశాన్ని అంతం చేసి, అళియరామరాయలను సంహరించి సువిశాల రాజ్యంగా గోలకొండ రాజ్యాన్ని విస్తరింప చేసినారు. వీరి కాలంనాటి శాసనాలు ఉర్దూ, అరబ్బీ, పారశీ, సంస్కృతాంధ్ర బాషల్లో ఉండగా



వాటిని వెలికితీసి చరిత్రకు కొత్త రూపం కల్పించారు.

17 శాసనాలతో చెఱకు రెడ్డి వంశ-చరిత్ర-శాసనములు, 27 శాసనాలతో రేచర్ల రెడ్డి వంశ చరిత్ర-శాసనములు అను కృతులను శాసన ప్రతిబింబాలు, శిల్పాల ఛాయా చిత్రాలతో సహా ప్రచురించి ఖ్యాతి పొందారు.

వల్లూరు, గండికోట రాజధానులుగా పానగల్లు పరిసర ప్రాంతాలు పాలించిన 'కాయస్థ రాజులు' సంక్షిప్త చరిత్రను 1991లో బయల్పర్చారు.

దక్షిణ కాశిగా చెప్పబడే తెలంగాణలోని శైవక్షేత్రం వేములవాడ. దాని చరిత్రను ప్రకటిస్తూ 'వేములవాడ చరిత్ర-శాసనములు' అను మహత్తర గ్రంథం శాస్త్రి గారు 12 శాసనాల్లో తెల్పారు. ఇక్కడ రాజరాజేశ్వరాలయం, భీమేశ్వరాలయం, బద్దిగేశ్వరాలయం, నగరేశ్వరాలయాలు కలవు.

చాళుక్య రాజవంశాల పాలనలో సబ్బిసాయిర మండలమని పిలవబడిన కరీంనగర్‌కు బోధన్ రాజధానిగా ఉండేదని చరిత్ర. వారి కాలంలో నిర్మించబడిన ఆలయాలు, వారి చరిత్ర, సంస్కృతికి దర్పణం పట్టే శాసనాలు భూ పొరల్లోంచి పెకిలించి విశదీకరించారు శాస్త్రి. నాటి కాలంలో గల పంపకవి, జినవల్లభుల వివరాలు చెప్పారు.

'మల్యాల వంశ చరిత్ర-శాసనములు' అను మరో గ్రంథం కూడా ప్రకటించి మల్యాల వంశీయులకు విరియాల, గోన వంశీయులతో గల బంధుత్వాన్ని వివరించారు. గోనబుద్ధారెడ్డి కుమార్తె కుప్పాంబిక మాల్యాల వంశానికి చెందిన గుండదండాధీశున్ని వివాహ మాడిన విషయాలు ఈ గ్రంథంలో మనకు అగుపిస్తాయి.

.

ఇవన్నీ ఒక ఎత్తైతే విజ్ఞాన సర్వస్వాలను రాయటం మరో ఎత్తు. మొదట తన జిల్లాపై గల అభి-

మానంతో 'నల్లగొండ మండల సర్వస్వం' రాసి ప్రకటించారు.

అదే అదునుగా ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, రెడ్డిరాజ్య, బ్రాహ్మణ రాజ్య సర్వస్వాలు విడుదల చేసి ఆయా ప్రాంతాల పుణ్యక్షేత్రాలు, దర్గాలు, మతాలు, కవులు, పండితులు, సమరయోధుల వివరాలు, ప్రజపోరాటాలతో పాటు ప్రాంతం యొక్క భౌగోళిక చరిత్రను, మండల ప్రశస్తిలు, ఆచార వ్యవహారాలు ఇలా సర్వం ఇందు పొందుపరిచారు.

వరంగల్,కరీంనగర్ సర్వస్వాలే మరియు తెలంగాణ శాసన సర్వస్వం కూడా సిద్ధం చేయుటకు పూనుకున్న తెలుగుజాతి పరిశోధకాగ్రేసరులు శాస్త్రి గారు.

సురవరం గారి 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర'ను పూర్వపక్షం చేసే దిశలో అలాగే ఇక్ష్వాకువంశం తర్వాత విష్ణుకుండినుల శాసనాల ఆధారంగా 500 ఏండ్ల చరిత్రనుబట్టబయలు చేసే విధంగా 'ఆంధ్రుల చరిత్ర సంస్కృతి' గ్రంథాలు రాసి నాటి ప్రముఖ చరిత్రకారుల సరసన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు శాస్త్రిగారు.

పైన చెప్పినట్టు ఆదికవి స్థానం నన్నెచోడుడికే దక్కాలని అనేక ఆధారాలు కట్టుదిట్టం చేసి నిరూపించారు. తన పిహెచ్‌డి గ్రంథం 'డెవలప్‌మెంట్ ఆఫ్ తెలుగు లాంగ్వేజ్ త్రూ ఇన్స్క్రిప్షన్స్'లో ఈ వివరాన్ని చేర్చగా దాన్ని అనాటి ఆచార్యులు సహించక తనతో ఏకీభవించలేదు. సిద్ధాంత గ్రంథాన్ని తిరగరాస్తే పట్టా ఇస్తామన్నారు. అందుకు శాస్త్రిగారు ఒప్పుకోలేదు. ఒప్పుకోకపోవటమేకాక పిహెచ్‌డినే త్యాగం చేసిన మహానుభావుడు.

వలిగొండ వద్ద మూసీ నది ఒడ్డున నిర్మించ తలపెట్టిన త్రిశక్తి దేవాలయాలు శాస్త్రిగారికి హిందుత్వంపై, ప్రాచీన భారతీయ సంప్రదాయంపైగల అభిమానాన్ని చాటుతున్నాయి.

శాస్త్రిగారు 1980లో 'మూసీ' పత్రికను ప్రారంభించగా మధ్యలో కాస్తా ఆగినా నేటికీ అనేక ప్రామాణిక, పరిశోధనాత్మక వ్యాసాలు అందిస్తూ అలనాటి ప్రసిద్ధ సాహిత్యపత్రిక భారతిని మరిపిస్తున్నది. శాస్త్రిగారి అల్లుడు ప్రసిద్ధ సాహితీమూర్తులు శ్రీ సాగికమలాకర శర్మగారి ఆధ్వర్యంలో శాస్త్రిగారు నెలకొల్పిన మూసీపత్రిక,శాస్త్రిగారి తనయులు శ్రీ భిన్నూరి గోపాలకృష్ణగారి ఆధ్వర్యంలో శాస్త్రిగారు ఎన్నో వ్యప్రయాసలకోర్చి వలిగొండలో నిర్మించిన త్రిశక్తి దేవాలయం నిర్విఘ్నంగా కొనసాగుతున్నవి.

విశ్వేశ్వర సంస్కృతాంధ్ర కళాశాలవారు తెలంగాణా సాహిత్య చరిత్రను జిల్లాలవారిగా వెలువరించిన సందర్భంలో నన్ను ఆదిలాబాదు జిల్లా ప్రతినిధిగా ఎంచుకున్నారు.ఆ సమయంలో డా.సామల సదాశివగారి సలహా మేరకు శాస్త్రిగారి ఆదిలాబాదు జిల్లా సర్వస్వం సంపాదించి కొంత సాహిత్య చరిత్రను సేకరించినప్పుడు శాస్త్రిగారి గురించి మొదటిసారిగా తెలిసింది. ఆ సందర్భంలోనే బ్రహ్మశ్రీ సాగికమలాకరశర్మగారితో పరిచయం ఏర్పడింది.

ఆ తరువాత మాకు బంధువులైన పల్లా దుర్గయ్యగారి కుటుంబ సభ్యుల ద్వారా శాస్త్రిగారి గురించి మరిన్ని విషయాలు తెలిసినవి. కొంతకాలం శాస్త్రిగారు పల్లావారి గృహసముదాయంలో అద్దెకున్నారు శాస్త్రిగారు. తరువాత ఒకసారి కాచిగూడ వద్ద ఉన్న వారి ఇంటిలో శాస్త్రిగారిని కలిసినప్పుడు ఎంతో ఆప్యాయంగా పలుకరించి ఆశీర్వదించిన విషయం మరచిపోలేనిది.నా కవితలు ఒకటి రెండు మూసీ పత్రికలో వేసుకున్నారు.

4 ఏప్రిల్, 2002, న తన పరమపదించిన బి.ఎన్. శాస్త్రి అవార్డులకూ, రివార్డులకు ఏనాడూ ఆశపడనివాడు. స్వయం కృషినే నమ్మినవాడు. పట్టుదల,ఆత్మ విశ్వాసంతో తన ఇష్టమైన చరిత్రకోసం జీవితాన్నిని ధారపోసిన .ఎన్. లేనిదే తెలంగాణకే కాదు తెలుగుకే చరిత్ర లేదనేది అతిశయోక్తి కాదు. బి.ఎన్. శాస్త్రి గారంటే ఒక సంకల్పబలం. ఒక విశ్వవిద్యాలయం. ఒక విజ్ఞాన సర్వస్వం. కారణజన్ముడు.

# చిలకమర్తి దుర్గా ప్రసాదరావు





# SPOKEN SANSKRIT

+91 9897959425

(సంభాషణ సంస్కృతం -29)

Unit 1

युष्मद् शब्द: --वर्तमाने –एकवचनम्
त्वं - पठसि –నీవు చదువు చున్నావు

युष्मद् शब्द: --वर्तमाने – द्विवचनम्
युवां –पठथ: - మీరిద్దరూ చదువుచున్నారు

युष्मद् शब्द: --वर्तमाने-बहुवचनम्
यूयं - पठथ మీరందరు చదువుచున్నారు

युष्मद् शब्द: --भूते

त्वं =अपठ: నీవు చదివితివి युवां अपठतम् మీరిద్దరూ చదివితిరి यूयं –अपठत మీరందరు చదివితిరి

युष्मद् शब्द: -भविष्यति
त्वं पठिष्यसि నీవు చదివెదవు ) युवां पठिष्यथ: (మీరిద్దరూ చదివెదరు ) यूयं पठिष्यथ మీరందరు చదివెదరు )

युष्मद् –शब्द: --वर्तमाने प्र .पु

स: पठति అతడు చదువుతున్నాడు –तौ-पठत:--వారిద్దరూ చదువుచున్నారు
ते पठन्ति వారందరూ చదువుచున్నారు

त्वं –पठसि **నీవు చదువుచున్నావు** – युवां पठथ: **మీరిద్దరూ చదువుచున్నారు** --यूयं पठथ **మీరందరు చదువుచున్నారు**

अहं –पठामि **నేను చదువుచున్నాను** – आवां –पठाव:- **మేం ఇద్దరం చదువుచున్నాము** वयं-पठाम:**మేం అందరం చదువు చున్నాము**

युष्मद् शब्द: -- भविष्यति

(स:) पठिष्यति (तौ ) पठिष्यत: ( ते) पठिष्यन्ति
(त्वं ) पठिष्यसि (युवां) पठिष्यथ: ( यूयं) पठिष्यथ
अहं पठिष्यामि – आवां –पठिष्याव: वयं – पठिष्याम:

Unit -2

लङ् लकार: **(భూతకాలం)**

अपठत् –अपठताम्-अपठन्
अपठ: -अपठतम् - अपठत
अपठम्- अपठाव- अपठाम

स: अपठत् **అతడు చదివెను** --- तौ- अपठताम् **వారిద్దరూ చదివిరి** --- ते - अपठन् **వారందరూ చదివిరి**
त्वम्- अपठ: **నీవు చదివితివి** -- युवाम्- अपठतम् **మీరిద్దరూ చదివితిరి** -- यूयम् –अपठत **మీరందరు చదివి-తిరి**
अहम् – अपठम् **నేను చదివితిని** – आवाम्—अपठाव **మేమిద్దరం చదివితిమి** – वयम् –अपठाम **మేమందరం చదివితిమి**

Unit-3

**భూతకాలంలో** past Tense **(మధ్యమ పురుష)** Second person **లో** त्वं –युवां –यूयं **అనే పదాలకు బదులుగా** भवान् भवन्तौ –भवन्त: **అనే పదాలను ఉపయోగిస్తే** अपठत् –अपठताम्-अपठन् **అనే క్రియా పదాలకు బదులుగా** – पठितवान् –पठित वन्तौ –पठितवन्त: **అనే పదాలను ప్రయోగిస్తే మనకు భాష కొంత సులభం అవుతుంది అవి అన్ని పురుషలలోను సరిపోతాయి .అదెలాగో తెలుసు కుందాం .**

स: पठितवान् **అతడు చదివెను** --- तौ- पठितवन्तौ **వారిద్దరూ చదివిరి** --- ते पठितवन्त: **వారందరూ**

**చదివిరి**

भवान् पठितवान् **నీవు చదివితివి** -- -भवन्तौ पठितवन्तौ **మీరిద్దరూ చదివితిరి** – भवन्त: पठितवन्त: **మీరందరు చదివితిరి**

अहम् – पठितवान् **నేను చదివితిని** – आवाम्— पठितवन्तौ **మేమిద్దరం చదివితిమి** – वयम् – पठितवन्त: **మేమందరం చదివితిమి**

**ఈ క్రియా పదాలను మనం చాల సులభంగా కూడా తయారు చేసుకోవచ్చు**

1. **పఠితవాన్- పఠితవంతౌ –పఠిత వంత:**
2. **లిఖితవాన్ –లిఖితవంతౌ –లిఖితవంత:**
3. **గతవాన్ –గతవంతౌ –గతవంత:**
4. **కృతవాన్ –కృతవంతౌ –కృతవంత:**

**రామ: వనం అగచ్ఛత్ అనడానికి బదులు మనం రామ: వనం గతవాన్ అనవచ్చు .**

पिक: कूजितवान् –पितौ कूजितवन्तौ – पिका:कूजितवन्त:

**కోకిల కూసెను -రెండు కోకిలలు కూసినవి –చాల కోకిలలుకూసినవి**

उक्तवान् – उक्तवन्तौ – उक्तवन्त:
अध्यापक: उपन्यासम् अक्तवान्
**అధ్యాపకుడు ఉపన్యాసం చెప్పెను**

मिलितवान्- मिळितवन्तौ –मिलितवन्त:
आञ्जनेय: रामं मिलितवान्
**ఆంజనేయుడు రాముని కలుసుకొనెను**

रामलक्ष्मणौ सुग्रीवं मिलितवन्तौ
**రామలక్ష్మణులు సుగ్రీవుని కలుసుకొనిరి**

वानरा: रामं मिलितवन्त:

**వానరులు రాముని కలుసుకొనిరి**

**ఇక స్త్రీ లింగంలో**

पठितवती –पठितवत्यौ –पठितवत्य:

**అనే రూపాలు ఏర్పడతాయి**

**బాలికా పఠితవతీ -బాలికే పఠితవత్యౌ – బాలికా: పఠితవత్య:**

लिखितवती –लिखितवत्यौ –लिखितवत्य:

**మహిళా పత్రం లిఖితవతీ –మహిళే పత్రం -లిఖితవత్యౌ- మహిళా: పత్రం లిఖిత వత్య:**

पीतवती –पीतवत्यौ –पीतवत्य:

**బాలికా క్షీరం పీతవతీ -బాలికే క్షీరం పీతవత్యౌ – బాలికా: క్షీరం పీతవత్య:**

Sanskrit Sloka

क्व तिष्ठत: ते पितरौ ममेवे
त्यपर्णयोक्ते परिहासपूर्वम् |
क्व वा ममेव श्वशुरौ तवेति
तामीरयन् सस्मितमीश्वरोऽव्यात् ||

**క్వ తిష్ఠత: తే పితరౌ మమేవే**
**త్యపర్ణయోక్తే పరిహాసపూర్వం**
**క్వ వా మమేవ శ్వశురౌ తవేతి**
**తామీరయన్ సస్మితమీశ్వరోऽవ్యాత్**

**పార్వతి వాస్తవానికి అచలపుత్రికే అయినా చలచిత్తం కలది. చాల చిలిపిది. సరదాగా తన భర్తను ఒక ఆటపట్టిద్దామనుకుంది . కాని ఆయన తనకంటే తెలివైన వాడని మాత్రం ఊహించలేక పోయింది పాపం. ఏమండి ! నాకు అమ్మ నాన్న ఇద్దరూ ఉన్నారు . నాకున్నట్లుగా మీకు అమ్మానాన్నలెక్కడున్నారో చూపించండి అంది కొంటెగా. శివుడు దానికి సమాధానంగా ఓహో అదా ! నాకు అత్తా మామ ఇద్దరూ ఉన్నారు . నాకున్నట్లుగా నీకు అత్తా మామలు ఎక్కడున్నారో చూపించు అన్నాడు నవ్వుతూ. ఏం చూపిస్తుంది ? వెంటనే ఉడుక్కుంటూ బుంగమూతి పెట్టి ఆయన ఒడిలోకి వంగి వాలిపోయి ఉంటుందని ఊహిద్దాం. ఈ విధంగా పార్వతి కొంటె ప్రశ్నకు తగిన సమాధానం చెప్పిన ముక్కంటి మాటలు మనల్ని రక్షించుగాక**

One day Goddess Parvati wanted to make fun of her husband Lord Siva. She asked Him " My dear husband ! I have father and mother. But you don't have father and mother like me. Then Lord Siva replied "I have father –in- law and mother

# ఆదూరి హైమవతి



## ఉత్తమ దానం

ఒక మహా శివరాత్రి పర్వదినాన ఎంతో మంది భక్తులు శివక్షేత్రాలన్నింటిలో ఉపవాసాలుండి ప్రార్థనలు , అభిషేకాలూ, పూజ లు,దానధర్మాలూ స్తున్నారు .కైలాసంనుండీ చిరునవ్వుతో భూలోకం వైపు వీక్షిస్తున్న పరమేశ్వరుని చూసిన పార్వతీ మాత అమిత ఆసక్తితో," స్వామీ !ఈ శివరాత్రికి ఏ పుణ్యాత్మునికి మోక్షం ప్రసాదించ బోతున్నారు?మీభక్తుల్లో ఎవరు గొప్ప సేవ చేస్తున్నారో వీక్షించారా !" అని అడిగింది. పరమేశ్వరుడు చిరునవ్వుతో భూలోకం వైపు చూడమని సూచించగా పార్వతీ మాత అటు చూసింది .

శ్రీశైలక్షేత్రం భక్తసందోహంతో క్రిక్కిరిసిపోయి ఉంది.కాశీక్షేత్రంలో కాలుపెట్టనే సందులేదు.కోటిలింగాల క్షేత్రం,దాక్షారామం,ధర్మపురి, శ్రీ కాళహస్తి వంటి పవిత్ర శివ క్షేత్రాలు జనంపట్ట నంతగా కిటకిట లాడిపోతున్నాయి. ఇలా ఏ శివక్షేత్రం చూసి నా భక్త జన సందో హంతో నిండిఉంది. పార్వతీ మాతకు ఏమీ బోధ పడక "స్వామీ ! నాకు ప్రత్యేకంగా ఏశివక్షేత్రంలోనూ ఏమీప్రత్యేకత గోచరించడం లేదు. ఈ అభిషేకాలూ , పూజలు అన్నీ ప్రతి శివరాత్రి కీ జరిగినట్లే జరుగుతున్నాయి కదా ? "అంది .శంకరుడు చిరునవ్వుతో తన చేతిలోని త్రిశూలాన్ని వంచి క్రిందికి చూపాడు. పార్వతీ మాత తన దృష్టిని అటుమళ్ళించింది .

అది ఒక చిన్న పల్లెలోని ఒక అతి చిన్న శివాలయం. అక్కడ ఒక రైతు కుటుంబంలోని నలుగురూ వంటలు చేసి, దైవనివే దన కావించి అక్కడ దేవాలయం ముందున్న వికలాంగులకు, భిక్షువులకూ అన్నదానం చేస్తున్నారు. అది చూసిన పార్వతీ మాత " స్వామీ ! ఇదేంచిత్రంకాదే ! ఎంతో మంది భక్తులు అన్నదానం చేయడం సాధారణ విషయమే కదా? " అనింది.

పరమేశ్వరుడు " సాధారణం కాదు పార్వతీ ! ఈరైతు తనకున్న మూడెకరాల పొలంలో పండిన పంటనఒతా మూడు వాటా లేసి ,ఒకవాటా గాదెలో దాచి ఈ శివరాత్రిరోజున అన్నదానం చేస్తాడు. ఒక వాటామాత్రమే తన ఖర్చులకు వాడు కుంటాడు. మరో క వాటా తనతోపాటు మరుసటి సంవత్సరం పొలంలో విత్తను గింజలు లేని తోటిరైతు లకు ఊరికే ఇస్తాడు. అంటే అన్నదానం కంటే ఎంతో మంది తోటి రైతులకు అన్నం దొరికే మార్గానికి సహకరించడం గొప్ప కదా ?ఎంతో మంది తమ గింజలను అధిక ధరలకు అమ్ముకుంటుండగా తోటి రైతులకు ఉదారంగా ఇవ్వడం గొప్ప దానం కాదా? “అనగా, పార్వతి "నిజమే స్వామీ !అతడిదే గొప్పదానం !ఐతే అతడికే తమరుఈశివరాత్రికి మోక్షం ప్రసాదించ నున్నారు, ఔనా? " అంది సంతోషంగా . " కాదు. ఆ వైపు చూడు " అని పరమేశ్వరుడు అనగా ఆయన చూపిన వైపు పార్వతీ మాత చూసింది. అక్కడ ఒక వ్యక్తి తనవీపుపై గుడ్డలమూట మోసుకుంటూ శివాలయం మెట్ల పై చలికి వణుకుతూ ముడుచుకునిపడుకునివుండే భిక్షగాళ్ళకు, ఇల్లు లేక చెట్ల క్రింద కాపురాలుండి చలికి వణుకుతున్ననిరాశ్రయులకు తన వీపుమూటలో నుండీ దుప్పట్లు తీసి కప్పి వెళ్ళసాగాడు. అది చూసిన పార్వతీ మాత "ఇతడెవరు స్వామీ! ఇలా గుప్తదానం చేస్తున్నాడు?" అని అడిగింది.

"ఇతడొక నేతగాడ ప్రతిసంవత్సరం తాను ఎన్ని బట్టలు నేసి తనకుటుంబ పోషణకై అమ్ముకుంటాడో అన్నిదుప్పట్లు నేసి ,దాచి ఈ శివరాత్రినాడు ఇలా గుప్తదానంచేస్తాడు. నా నామస్మరణ తోనే సంవత్సరం పొడవునా బట్టలు నేస్తూ ఉంటాడు. అందు కే ఎంత మంది చలికి బాధపడేవారుంటారో అన్ని దుప్పట్లు అతడి దగ్గర ఉంటాయి .పగలంతా తన బ్రతుకుతెరువుకు శ్రమపడు తూ , రాత్రుళ్ళు దానం కోసం బట్టలు నేస్తాడు .గొప్పభక్తుడు! "అన్న పరమేశ్వరుని మాటలకు పార్వతి నవ్వుతూ " ఐతే తమరు ఇతడికే ముక్తిని ప్రసాదించ నున్నారన్న మాట !." అనింది . చిరునవ్వే పరమేశ్వరుని సమాధానమైంది. " పార్వతీ ! అటు వీక్షించుమరి ..." అంటూ పరమేశరుడు తన త్రిశూలాన్ని చూపి న వైపు పార్వతీదేవి తన దృష్టి నిలిపింది. అది ఒక గురు కులం, గోవిందవల్లభుడు ఆవిద్యాలయానికి అధిపతి. చెట్ల క్రింద విద్యా ర్థులు కూర్చుని ఉండగా, గోవిందవల్లభుడు అందరిముం దూ ఎత్తైన అరుగుపై కూర్చుని విద్యాభోధన చేస్తున్నాడు. "నాథా! దీన్లో వింతేముంది! అందరు బోధకులవలె ఇతడూ తన విద్యార్థులకు బోధి స్తున్నాడు. అంతేకదా!" అంది పార్వతీ మాత. "పార్వతీ! అతడి వద్ద చదివిన విద్యార్థులంతా దేశమంతా తిరిగి ధర్మసూత్రాలనూ, మానవతా విలువలనూ ఆచరించి చూపుతూ సమాజానికి బోధిస్తున్నారు . వారి బోధన లను విన్న ప్రాంత ప్రజలంతా సత్ప్రవర్తనతో, సద్గుణాలతో, సాధుస్వభావులై, మత సామరస్యంతో ఆదర్శ జీవనం సాగిస్తున్నారు. ఆ ప్రాతాల్లో కొట్లాటలు, గొడవలూ, అన్యాయమూ, అక్రమ సంపాదనా పరులూ, నిరక్ష రాస్యులూ, లేక ప్రజలంతా ప్రశాంతజీవనం గడుపు తుంటారు. మానవునికి కావలసింది తిండీ బట్ట లేకాదు,సద్గుణాలు కూడా.సమాజం జనులంతా సత్ప్రవర్తనతో ఉంటే ధర్మం నాలుగు పాదాలా నడుస్తుంది. అన్యాయార్జిత విత్తం తో ధనికులు ఎంతో ఆడంబరంగా ఎన్నిఅన్నదానాలు చేసినా వాటి వలన ఫలితం లేకపోగా,ఆ అన్యాయార్జిత విత్తంతో పెట్టిన అన్నం తిన్నవారికి ఆ బుద్ధులు వంటబట్టి, సమాజంలో అన్యాయం అధర్మఒ రెక్కలువిప్పి ఎగురుతుంటాయి. సంపాదనను బట్టే తిండి, తిండిని బట్టి, రక్తం,రక్తాన్నిబట్టి బుద్ధీ వస్తాయి కదా? అంటే ఎట్టి తిండో ,అట్టి రక్తం,ఎట్టి రక్తమో అట్టి బుద్ధీ. అన్న దానం ఆ ఒక్క పూట మాత్రమే మానవుని తృప్తి పరుస్తుంది, వస్త్రదానం కొంతకాలం మాత్రమే సుఖాన్నిస్తుంది, అంత మాత్రాన అవి తక్కువ దానాలని నేను చెప్పడం లేదు. అవిఅత్యావశ్యకాలేసుమా! ఐతే అవి న్యాయార్జిత విత్తంతో చేసేవైఉండాలి. ఇందా క నీవు చూసిన ఆఇద్దరూ తమ కాయకష్టంతో పండించిన ధాన్యం, రాత్రం తా మేలుకుని నేసిన బట్టలూ దానఒ చేయడం ఉత్త మోత్తమం , ఐతే అదివారికి మాత్రమే పుణ్యాన్ని ఇస్తున్నది. ఈగోవిందవల్ల భుడు నిస్వార్థంగా చేసేవిద్యాదానం వలన ఆవిద్యార్థులు తమవిద్యాభ్యాసంపూర్తయ్యాక సమాజం లో తమ ఆదర్శ జీవనవిధా నం వలన ,విద్యాదానం వలన,సమాజాని కంతకూ శాఒతి ప్రదాతలుగా ఉండటం వలన సమాజమే మంచిగా మారి-ప్రపంచంలో శాంతి స్థాపన జరిగి-మానవులంతాశాంతితో,ఆనందంగా క్షేమగా జీవిస్తారు కదా !అన్నం-,వస్త్రం ఇచ్చిఆదానఫలితమైన-పుణ్యాన్ని పొందటం, గొప్పా? లేక సమాజాన్నం తా ఆదర్శ ,సంక్షేమ మార్గంలో నడిపే విద్యాదానం గొప్పదా? సమాజానికికావలసిందిసత్ప్ర వర్తనాపరులైన మానవులా,తిండితో శరీరాన్నీ మంచి బట్టలతో అందాన్నీపెంచుకుని సమాజంలో చీడపురుగులవలెఉంటూ, ఇతరులకు కష్టాలనూ ఇబ్బందులనూభయాన్నీ కలిగించే మానవులా? విద్య వలన అన్నమూ , వస్త్రాలూ కూడా పొందవచ్చు కదా?

(42 వ పేజీ చూడండి)

# నందుల ప్రభాకర శాస్త్రి



## మా ఊరి నందుల ఆత్మీయ కథ

### దీపావళి

శ్రీరామనవమి గురించి ఇంతకూ ముందే ప్రస్తావించటం మూలాన మళ్ళీ చెప్పదలచుకోలేదు. దీపావళి పండుగ పిల్లలకు ఇష్టమైన పండుగ. దీపాలు పెద్దగా వెలిగించేవాళ్ళు కాదు గానీ, పండుగ పదిరోజులు ఉందనగా చెరువు కట్ట మీదికెళ్ళి, పిల్లలు 'సుడుములు' తిప్పేవాళ్ళు. చొప్పకట్టలు కాల్చేవాళ్ళు.

'సుడుములు' ఇంట్లోనే తయారు చేసేవాళ్ళు. దొరికితే రాక్షసి బొగ్గు, లేకుంటే కుమ్మరాము బొగ్గులు దంచి, సొద్ద బొంకులు (అంటే సొద్దకంకి నుండి గింజలు తీసిన తరువాత మిగిలిన కంకిని పీకితే వచ్చేవాటిని) తెల్ల ఉప్పు కలిపి పాత గుడ్డలో పట్టెడు మూట కట్టి, మూడు బందెర కట్టెలను వంచి ఒక కొసలో కట్టి, మధ్యలో ఈ మూట పెట్టి, మళ్ళీ పైభాగాన కట్టెలను కట్టి, మూటపై చిన్న నిప్పు కణిక పెట్టి, 'వడిసెల' తిప్పినట్టు తిప్పితే,,, ..పట...చిట... పట చిటమంటూ మినుగురులు రేపుతూ చాలాసేపు కాలుతుంది. చివరకు దాన్ని చెరువులో పడేస్తారు పిల్లలు.

పండుగ రెండుమూడు రోజులుందనగా 'పటాకులు' కొని ఉదయం అంటా ఎండలో పెట్టి చీకటి పడిన తరువాత కొంచెం కొంచెం కాల్చుకునేవాళ్ళం. అయితే ఒక్కొక్క ఇంటి దగ్గర కాల్చటం అయిపోయిన తర్వాత ఇంకొక ఇంటి దగ్గర కాల్చుకునేవారు. అంటే...ఊర్లో పిల్లలు అంతా ఒకచోట చేరితే కానీ, కాల్చటంలో ఆనందం ఉండేది కాదు. ఆడపిల్లలు కాకరొత్తులు, తాడు, అగ్గిపుల్లలు కాలిస్తే... మగపిల్లలు మాత్రం లవంగం పటాకులు, ఎర్ర పటాకులు, లక్ష్మీ పటాకులు, ఆటంబాంబులు కాల్చి తమ 'మగతనం' ప్రదర్శించుకునేవాళ్ళు.

పాపం... ఈ పటాకులు కొనలేనిపిల్లలు కాల్చేవాళ్ళని చూసి ఆనందిస్తూ, పేలని పటాకులని తీసుకుని వత్తి దగ్గర కొంచెం చింపి, వత్తి పైకి లాగి కాల్చుకునేవాళ్ళు.

### మొలకల పున్నమి

ఇది కూడా పిల్లలు ఎక్కువ ఇష్టపడే పండగ. పాడ్యమి రోజు పిల్లలు ఇంటింటికి పోయి అన్ని రకాలైన ధాన్యాలు సేకరిస్తారు. మా ఊరి రామాలయంలో గర్భగుడికి ఇరువైపుల రెండు గదులుండేవి. ఈ గదుల్లో అడుగు ఎత్తున మా ఊరి చెరువులో ఉండే ఒండ్రు మట్టిని తట్టలతో పోసి నీళ్ళు చల్లేవాళ్ళం. పిల్లలు సేకరించిన ధాన్యం ఒకరోజు నీటిలో నానబెట్టి ఈ రెండు గదులలో ఉండే మట్టిలో చల్లేవాళ్ళం.

(ఇంకా ఉంది)



# ఎలక్ట్రాన్



ధన్వంతరి కారాగారం

(గత సంచిక తరువాయి)

"నాన్నగారూ! నా మాట పూర్తిగా వినకుండానే మీరో నిర్ణయానికి వచ్చేశారు. మెడిసిన్ చదవడానికి కావల్సిన మెరిట్ ర్యాంక్ రాలేనందుకు నాకు విచారం లేదు."

(మిగిలినది వచ్చే సంచికలో)

"ఇంకా చెప్పాల్సిన మాటలేమున్నాయి? డబ్బుకట్టి చదువు చెప్పించలేని మా అశక్తికి ఓదార్పుగా మాటలన్నీ చెబుతున్నావ్! అంతే కదా?" తల్లి శకుంతల అంది.

"అది కాదమ్మా! ఎల్లోపతీ ప్రపంచవ్యాప్తంగా పలు దిశల్లో నిరంతర పరిశోధనలవల్ల ఎంతో ఎదిగి పోయిన మాట వాస్తవం. శస్త్రచికిత్సను ఓ అదనపు వెసులుబాటుగా తీసుకొని ఎల్లోపతి ఇతర వైద్యవిధానాలను ఎద్దేవా చేస్తోంది తప్ప, దేహారోగ్యానికి క్రీస్తుపూర్వం పదిహేనువందల సంవత్సరాల క్రితమే ప్రపంచలోని వివిధ ప్రాంతాలలో ప్రకృతి ఇచ్చిన వృక్షసంపదని ఆధారంగా చేసుకొని, అనేక మూలికలతో వైద్యవిధానాలు స్థిరమైన రీతిలో రూపొందాయి.

వేదాలలో నాలుగవదైన అథర్వణవేదంలో ఆయుర్వేదానికి ప్రథమ విధానాలు సూచించబడి పునాదులు పడ్డాయి. కాలక్రమేణా సిద్ధ, యునానీ వైద్య విధానాలు రూపొందాయి. యోగాభ్యాసం కూడా ఒక విశిష్టమైన వైద్యవిధానమే!

అంతెందుకు?18వ శతాబ్దంలో జర్మనీలో ఆవిర్భవించిన హోమియోపతి వైద్యవిధానం కొన్ని మెరుపులు చూపించినా అదీ ఎల్లోపతీతో పోటీపడలేకపోతోంది!

"అయితే ఆధునికత పేరిట



మన ప్రాచీన వైద్య విధానాలన్నీ క్రమేపీ అశ్రద్ధకు గురై తెరమరుగున పడిపోతున్నాయి. పర్వత సానువుల్లో పెరిగే అనేకమైన ఔషధ గుణాలు కల మొక్కల్ని గుర్తించకల ఆయుర్వేద వైద్యుల వ్యవస్థకానీ, వారికి సహకరించే కోయదొరల వ్యవస్థకానీ అంతరించి పోతున్నాయి. తూర్పు పశ్చిమ కనుమలు, హిమాలయాలూ వృక్షసంపదనీ, తత్కారణంగా మూలికా సంపదనీ విచక్షణారహితమైన తవ్వకాలమూలానా, నిర్మాణాల మూలానా కోల్పోతున్నాయి. అయితే ఇటీవలి కాలంలో మన ప్రాచీన వైద్యవిధానాలమీద ప్రజలలో తిరిగి ఆసక్తి తలెత్తుతోంది. కేరళ రాష్ట్రం వనమూలికల వ్యావసాయం చేబట్టి ముందంజ వేస్తోంది. మన ప్రాచీన వైద్య పునరుద్ధరణ కార్యక్రమంలో నేను బ్యాచిలర్ ఆఫ్ ఆయుర్వేదిక్ మెడిసిన్ చదవాలనుకొంటున్నాను! ఇదివరకు ఆయుర్వేదవైద్యం వంశ పారంపర్యంగా చేసేవారు. ఇప్పుడా పద్ధతి లేదు. మన కుటుంబంలో నాతో నాంది పలకాలనుకొంటున్నాను. అభ్యంతరం చెప్పకండి"

శ్యామశాస్త్రి, శకుంతలలు వనమాల దృక్పథానికి సంతోషించి, "నీ అభీష్టప్రకారమే, చెయ్యి. అడ్డురాము!" అన్నారు.

వనమాల మూడేళ్ళ కోర్సుని సునాయసంగా పూర్తి చేసి డిగ్రీ సాధించింది. సెలవు దినాల్లో దేశవ్యాప్తమైన కొన్ని పేరుగాంచిన ఆయుర్వేద ఔషధాలని తయారుచేసే కంపెనీలని అధ్యయన ప్రణాళికల రూపేణా సందర్శించింది. తిరిగివచ్చి ఆ పద్ధతుల్ని తన తల్లి పుట్టిన చింతలూరు వెళ్ళి అక్కడ చలమయ్య శాస్త్రి అనే వృద్ధ ఆయుర్వేద వైద్యునితో పరిభాషించింది. ఆయనకీ తన మాతామహుడికీ ఎంతో పరిచయముంది. శాస్త్రప్రకారం నిర్వచించిన పద్ధతుల్ని తుంగలో తొక్కేసి ఆయుర్వేదమందుల తయారీ జరుగుతోందనీ, కొన్ని కొన్ని అత్యవసరమైన మూలికల్ని అంతరించి పోయిన కారణంగా, లేదా ఆనవాలు పట్టలేని కారణంగా వాడటల్లేదనీ, సువర్ణ,రజిత, తామ్ర, అభ్రక, పాదరస భస్మాల తయారీలో పుటాలు అస్తవ్యస్తంగా చేస్తున్నారనీ విశదపర్చాడు. తన వంశంలో ఆయుర్వేదవైద్యానికి తానే హంసగీతిక పాడుతోన్నందుకు వాపోయాడు. ఆయన నలుగురు కొడుకులూ ఉద్యోగాలలో స్థిరపడిపోయి నగర వాసులైపోయారు.

"తాతగారూ! మీరు చెప్పింది



వాస్తవమే! గతకొద్ది సంవత్సరాలుగా ఆయుర్వేద ఔషధాలపై పాశ్చాత్యదేశాలు అధ్యయనం చేసి, ఔషధాల్లో లోహాలు పూర్తిగా విలీనం కాలేదంటూ, అవి కాన్సర్కి దారి తీస్తున్నాయని భాష్యాలు చెప్పారు. ఆయుర్వేద ఔషధాలపై వ్యతిరేకంగా దీన్నో ఆయుధంగా వాడడం జరిగింది. మౌలికంగా ఏ మందుల తయారీలోకూడా రాజీమార్గాలు కుదరవు. ఈ సత్యం మన వాళ్ళు విస్మరించడం ఆయుర్వేదవైద్యానికి ముప్పు కలిగించింది."

వనమాల అమ్మమ్మగారి ఊర్లో ఏడాదిపాటు ఉండి చలమయ్యశాస్త్రిగారి వద్ద- నాడి చూసి శరీరతత్త్వాలు పట్టుకొని, త్రిదోషాలని



గుర్తించి, రోగవిశ్లేషణ చేసి, తగిన ఔషధాలు, వాటికి అనుకూలమైన అనుపానాలు నిర్ధారణ చేసే కౌశల్యాన్నిసాధించింది. తను చదివిన చదువును ఈ అనుభవంతో జోడించి ఆత్మవిశ్వాసాన్ని పెంచుకొంది. ఎప్పుడు అవసరమైనా, ఏ విధమైన సంకోచమూ లేకుండా తనని సంప్రదించవలసిందిగా, సలహాలు తీసుకోవాల్సిందిగా వనమాలకి చెప్పాడు చలమయ్య శాస్త్రి.

వనమాల స్వంత ఊరు తిరిగి వచ్చేసింది. 'అశ్వినీ ఆయుర్వేదనిలయం, ఆయుర్వేద వైద్యురాలు వనమాల' అని బోర్డు తగిలించి, చలమయ్య శాస్త్రిగారిచే ప్రారంభోత్సవం చేయించింది. నిరుత్సాహపడకుండా నెమ్మది నెమ్మదిగా ముందడుగు వేయ ప్రారంభించింది. వాళ్ళ ఊరిలో ఆ జిల్లా తాలూకు కేంద్ర కారాగారం ఉంది. అప్పటి జైలర్ కూతురు

నందినీ, వనమాలా సహాధ్యాయినులు. ఇంటర్ తర్వాత నందిని ఇంజనీరింగ్ చదువు చేబట్టి డిగ్రీ సాధించింది.

వనమాల చాలా సందర్భాలలో నందినితో కలిసి జైలుని సందర్శించడం జరిగింది. అది ఏభై ఎకరాల విశాలమైన ఆవరణలో ఉంది. బ్రిటిష్ వారి పాలనలో ఎర్ర రాతితో కట్టిన కారాగారమది. ఖైదీలకి నిత్య విధుల్లో ఒకటి ఆవరణని శుభ్రంగా ఉంచడం. ఆవరణలో చెట్లు చామా ఏమీ లేవు. భద్రతా కారణాల మూలాన, ఎవరూ దాక్కోడానికీ, తప్పించుకోడానికీ, లేదా ఉరి వేసుకోడానికీ వీల్లేకుండా జైలు ఆవరణలు చెట్లు లేకుండా ఉంటాయని నందిని చెప్పింది.

వనమాల ఓ రోజు నందిని తండ్రిని కలుసుకొని తన మనసులోని మాటని బయట పెట్టింది.

"చూడమ్మా, వనమాలా! ప్రభుత్వంకూడా ప్రాచీన వైద్యవిధానాల పునరుద్ధరణ గురించి కొన్ని ప్రయత్నాలు చేస్తోన్న మాట వాస్తవం. అయినా ఆయుర్వేదవైద్యం రోగుల అంగీకారంతోనో, లేదా రోగుల ఇచ్ఛ ప్రకారమే జరగాలి తప్ప, ఎల్లోపతిని తప్పించి ఏక మొత్తంగా ఇతర వైద్యాలని అమలుపర్చడం సాధ్యం కాదు. జైల్లో మరణాలు సంభవిస్తే మీడియా అనేక కారణాలు ఆపాదించి ఎండకడ్తుంది. అనారోగ్యకారణంగా ఖైదీ మృత్యువాతపడితే వైద్యం సరిగా చేయించలేదన్న ప్రథమ ఘాతం మీద పడ్తుంది. ఎల్లోపతీ వైద్యమే ఆటు, పోట్లకి ఆగ గలుగుతుంది. అందుచేత నీ ప్రాక్టీసు స్వచ్ఛందగానే సాగాలి. స్వచ్ఛందంగా ఇష్టపడే రోగులకే నీ వైద్యం చెయ్యి. రోగం నయమైనవారు మౌఖికంగా నీ గురించి ప్రచారం చేస్తారు. అది అన్నీ విధాలా శ్రేయస్కరం! ఖైదీలకి బలవంతపు ఆయుర్వేదవైద్యం అన్న వార్తలను చూడ్డానికి నేను సిద్ధంగా లేను!" అన్నాడు జైలరు.

"మీ మాటలు సత్యదూరం కాదు. రోగుల మరణం విషయంలో కార్పొరేట్ హాస్పిటల్సే తమ తప్పు లేకపోయినా, తరచూ ఇబ్బందులకూ, వివాదాలకూ గురౌతున్నాయి. లోపాయికారి నష్టపరిహార ఒప్పందాలతో ఎలాగో గట్టెక్కేస్తున్నారు. అయితే నా ఆలోచనలకు కొత్త రూపునిస్తూ ఒక అభ్యర్థన. భద్రత దృష్ట్యా జైలు ఆవరణలో పెద్దపెద్ద చెట్లు లేకుండా చేస్తారని నందిని చెప్పింది. అయితే ఔషధశక్తులు గల చిన్న మొక్కలు పెంచడానికి అభ్యంతరం ఉండకూడదు కదా? మనది ఉష్ణమండలం అయినా దానికి తగ్గట్టుగా కొన్ని రకాల ఔషధ మొక్కల్ని పెంచవచ్చు.

అదీ కాక జైలు భవనానికి చుట్టూ బయటా, లోపల విశాలమైన వరండాలున్నాయి. వాటి నీడలో కుండీల్లో మరికొన్ని రకాల మొక్కల్ని పెంచవచ్చు. అయితే ఆ కుండీలని వెన్నెల రాత్రుల్లో బయట ఉంచితే మొక్కల్లో ఓషధుల సాంద్రత పెరగడమే కాకుండా గుణాభివృద్ధికూడ ఉంటుంది. ఈ విషయంలో ఖైదీల సహకారంతో జైలు ప్రాంగణాన్నిఔషధీ ప్రాంగణంగా మార్చవచ్చు. దీనికి మీరు ఉద్యమిస్తే, నేను మీ వెనకనే నడుస్తాను! వైద్యం సంగతి తర్వాతి మాటైనా, ఔషధోత్పత్తిని అభిరుచికల ఖైదీలకు ఓ వ్యాపకంగా మార్చవచ్చు. జైల్లో తయారు చేసిన ఆయుర్వేద ఔషధాలని అమ్మి ఆ సొమ్ముని జైలు సంపాదనగా చూపించవచ్చు. ఇప్పటికే ఫర్నిచర్ తయారీ పేరిట మీ జైలు రాబడి చూపిస్తోందని విన్నాను."

"నీ మాట నిజమే! కేంద్ర అధికారులకు సంగతి వివరించి అనుమతి సంపాదిస్తాను. కొంతమంది సాధుగుణం గల ఖైదీలున్నారు. వారి రక్షణ, సహాయాలు నీకు అందేటట్లు చేసే బాధ్యత నాది. ఏదైనా ఆలోచన కార్యరూపం దాల్చాలంటే ప్రయత్నమనేది మొదటి మెట్టు కదా?" అన్నాడు జైలరు.

ఆరంభంలో దత్తు అనే ఓ యువ ఖైదీని జైలరు పరిచయం చేసి వనమాల చేబట్టిన ప్రణాళికలో పర్యవేక్షకుడిగా ఉంటాడని

చెప్పాడు. దత్తు సైన్సు గ్రాడ్యుయేట్. అతని పదేళ్ళ సోదరిని ఒక దుర్మార్గుడు బలాత్కారం చేసి, అటుపైన హత్య చేశాడు. దత్తు అతగాడిని వెంటాడి, వేటు వేసి పోలీసులకు లొంగిపోయాడు. పధ్నాలుగు సంవత్సరాల కారాగారశిక్ష పడింది. వనమాల ఆశయాన్ని అతడు నెరవేర్చడానికి కంకణం కట్టుకొన్నాడు. తోటి ఖైదీలతో పనులు చేశాడు, చేయించాడు. వనమాల ఇచ్చిన పుస్తకాల్ని చదివాడు. తన ఆలోచనలను జోడించాడు. వనమాల శిక్షణలో పలువురు మొక్కల్ని గుర్తు పట్టడంలోనూ, పెంచడంలోనూ, మందుల తయారీలోనూ అనుభవం గడించారు.

తత్సంబంధంగా ఓ పది దాకా గోవుల పెంపకం జరిగింది. రెండేళ్లలో ఆ జిల్లా జైలు పేరు ధన్వంతరి కారాగార ప్రాంగణం

గా మార్చబడింది. వనమాల గౌరవ ఆయుర్వేద వైద్యసారథిగా నియమించబడింది.

దత్తు శిక్షాకాలం అతని మంచి ప్రవర్తన మూలంగా ఏడేళ్లకు కుదించుకుపోయింది. విముక్తుడైనా అతడు ధన్వంతరి కారాగృహ ఆయుర్వేద కార్యక్రమాల్ని విడనాడలేదు. వనమాల అతన్ని మనువాడి సహచరిగా చరిత్ర సృష్టించింది.

జీర్ణించుకుపోతున్న ఆయుర్వేద వైద్యాన్ని పునరుద్ధరించడానికి వనమాల చేసిన ప్రయత్నాల్ని చలమయ్య-శాస్త్రి మనసారా అభినందించాడు. శ్యామశాస్త్రి మిగిలిన ముగ్గురు కూతుళ్లూ అగ్రజ వనమాల బాటనే అను-సరించారు.

వంశపారంపర్యంగా ఆయుర్వేదాన్ని కొనసాగించడానికి శ్యామశాస్త్రి నడుము బిగించాడు.

---

# ఉత్తమ దానం

(37 వ పేజీ తరువాయి)

పార్వతీ! నేటి సమాజానికి ఏ దానం గొప్ప దో నిర్ణ యించి , ఎవరు ముక్తికి అర్హులో నీవే చెప్పు" అంటూ చిరు నవ్వుతో పార్వతీ దేవిని చూశాడు శివుడు.

పార్వతీమాత" నిజమే ప్రభూ!అన్నదానం గొప్పదే ఐనా ఒక్కరోజునఅన్నంపెట్టినంతమాత్రాన ఉపయోగం అంతగాఉండకపోవచ్చు.తాత్కాలి కంగా ప్రాణం నిలవచ్చు.ధర్మ బద్ధమైన సంపాదనతో చేసిన దానఫల మైనపుణ్యం పొందుతాడు.కానీ అతడు చేసే అన్నదానం వలన మానవ సమాజానికి శాశ్వత ఉపాకారం లభించడం లేదు. ఇహ నేతగాడు తానుపుణ్యంపొందడంకోసం పరోపకారచింతన తో,కరుణతో చలికి వణికేవారిపై జాలితో దుప్పట్లునేసి గుప్త దానం చేయడం గొప్ప విషయమే.కానీఇదికూడా ఆ దానం పొందిన వ్యక్తుల వరకే కాని సమాజానికంతా ప్రత్యేక ఉప కారమేమి కాదు. వీరిద్దరూ పరి మిత వ్యక్తులకే సాయం చేస్తు న్నా రు. కానీ గోవింద వల్లభుడు చేసే విద్యాదానం వలన సమాజంలోని వారంతా సత్ప్రవర్తన తో జీవించడం వలన సమాజాని కంతా మేలు కలుగు తున్నది. కొందరు వ్యక్తులకు కాక మొత్తం సమా-జానికి చేసే సేవ గొప్పది ,శాశ్వతమైనది .కనుక గోవిందవల్లభునికి ముక్తి ప్రసాదించడం ఉత్తమం.తమరి ఎంపిక ను ఎంచేవారెవరు ప్రభూ!"అంది.

పరమశివుడు చిరునవ్వుతో పాత్వతీమాతను చూశాడు.

## భువనచంద్ర



# గరుడ గర్వ భంగం

సుమేధుడు తపస్సు చేస్తున్నాడు. అతడా తపస్సు మొదలుపెట్టి మూడేళ్ళయింది. మొదటి సంవత్సరం రోజుకి రెండుసార్లు భోజనం చేసేవాడు. రెండో సంవత్సరం రోజుకి ఒకసారే. మూడో సంవత్సరం కేవలం నీళ్ళు మాత్రమే స్వీకరిస్తూ తపస్సు కొనసాగిస్తున్నాడు. ఓ రోజున సుమేధుడికో తీవ్రమైన ఆలోచన వచ్చింది. అప్పుడు, 'సాయంత్రం దాకా నేను శ్రీ మహావిష్ణువు అనుగ్రహం కోసం ఎదురు చూస్తాను. ఆయన దర్శనం కాకపోతే సూర్యాస్తమయం వేళ, సూర్యుడితో పాటు నేనూ అస్తమిస్తాను' అని నిర్ణయం తీసుకున్నాడు. చితి కూడా స్వయంగా పేర్చుకుని ధ్యానంలో కూర్చున్నాడు.

"లక్ష్మీ...వెళ్ళకపోతే మానవుడికి దేవుడి మీదే నమ్మకం పోతుంది. గరుడా... పద!" అంటూ శ్రీమన్నారాయణుడు గరుడిని వీపు మీద కూర్చున్నాడు. గరుడుడు కొంత గర్వం తోనూ, కొంత ఆనందం తోనూ వైకుంఠ వాసుల వంక చూసి, మహోత్సాహంతో రెక్కల్ని విదిలించి భూలోకానికి పయనం మొదలెట్టాడు.

సూర్యాస్తమయానికి ముందే సుమేధుడికి దర్శనమిచ్చాడు. పరమదయాళువైన వైకుంఠమూర్తి. "వరం కోరుకో సుమేధా... అనుగ్రహిస్తాను" అన్నాడు శ్రీమన్నారాయణుడు.

"హే జగదీశ్వరా... సర్వ లోకాలలోనూ వ్యాపించిన శ్రీ మహావిష్ణూ.... ఓ శేషశయనా... ఓ జగద్రక్షకా... నిన్ను చూసిన మరుక్షణమే నాలోని కోరికలన్నీ అగ్నిని తాకిన దూది కొండలు ఎలా దగ్ధమవుతాయో, అలా దగ్ధమయిపోయాయి. నీ దర్శన భాగ్యం చాలును రమాపతీ" అని ఆనందంగా విష్ణుపాదాల మీద పడ్డాడు సుమేధుడు.

"సుమేధా.... నీది నిజమైన భక్తి. నాకు చాలా ఆనందం కలిగించావు. చల్లగా, హాయిగా నిండు నూరేళ్ళు రాజ్యపాలన చేసి, ఆ తరవాత నా వైకుంఠమును చేరెదవుగాక" అని వరమిచ్చాడు విష్ణువు.

"మహదానందం హిరణ్యగర్భా" అని ఆనందంగా కన్నీరు కార్చాడు సుమేధుడు. విష్ణువు సుమేధుడ్ని దీవించి తన లోకానికి మరలుతూ, " ఓ గరుడా, నన్ను కాసేపు అదిగో ఆ కనపడుతున్న ఏడు కొండలమీద విశ్రమించనీ. అదృశ్యంగా నాకక్కడ గుడి ఒకటి నిర్మించబడి వుంది. కలియుగంలో శ్రీమద్వేంకటేశ్వరుడనే నేనుండబోయేది అక్కడే. అందుకే అక్కడ కొంతసేపు ఉండాలనుకుంటున్నా. నీవు వైకుంఠమునకు మరలి వెళ్ళు. నేను నిన్ను తలచుకోగానే భూమికి వద్దువుగాని" అని గరుడుని వైకుంఠమునకు పంపించాడు.

"తమ ఆజ్ఞ" అని గరుడుడు కూడా ఏడుకొండల్నీ భక్తితో శ్రద్ధతో విహంగ వీక్షణం చేసి, వైకుంఠం వైపు సాగిపోయాడు.

శ్రీమన్నారాయణుడి పెదాలపై చిన్న చిరునవ్వు. "అవును... కలియుగంలో ఈ కొండలు తిరుమల గిరులుగా ప్రసిద్ధి చెందుతాయి. కోట్లాది భక్తులు నా దర్శనమాత్రం చేత తరించగలరు"అని సంకల్పించాడు స్వామి.

"జగదీశ్వరా.. ఈ క్షణానే నూట ఎనిమిది తీర్థాలలో అదృశ్యరూపంలో వుంటూ మీకూ, మీ భక్తులకూ సదా సలిల సేవ చేస్తాను. అనుగ్రహించండి" అన్నాడు వరుణుడు. ఆయన వెనుకే అష్ట దిక్పాలకులూ, ఇంద్రుడూ అందరూ వచ్చి కలియుగారంభంలో భువికొచ్చే స్వామికోసం ఏ ఏ ఏర్పాట్లతో సంసిద్ధులవాలో నిర్ణయించుకుని స్వామికి నివేదించారు. ఆ తర్వాత స్వామి అనుజ్ఞతో ఎవరి స్థానానికి వారు తరలి వెళ్ళారు.

స్వామి ఆ కొండలపై సరదాగా విహరిస్తూ వుండగా ఓ బుల్లి పిచ్చుక కనబడింది. అది చాలా విచారంగా కూర్చుని ఉన్నది. చూస్తే నిద్రాహారాలు మానివేసినట్లు స్వామికి అనిపించింది. "ఓ పిచ్చుకా ... ఎందుకు విచారంగా ఉన్నావూ?" అనడిగారు. అప్పుడా పిచ్చుక, "అయ్యా, నా కథ ఏమని చెప్పనూ?పక్షి గణాల్లో అందరూ మమ్మల్ని హేళన చేసేవారే" అంటూ తన కథ వివరించింది. అది విన్న శ్రీ మహావిష్ణువు "సరే! ఓ బుల్లి పిచ్చుకా... నీ విచారాన్ని మాను. నీకు తోడుగా నేనున్నాగా!" అని ఓదార్చి, "ఇదిగో, ఇప్పుడు చక్కగా ఆహారం తీసుకో" అంటూ అక్కడ వున్న కొన్ని పళ్ళను కోసి స్వయంగా తినిపించారు స్వామి.

ఇక అటువైపు చూస్తే, అనంత బలశాలుడైన గరుడిడికి తొలిసారిగా ఆయాసం వస్తోంది. విశ్వమంత బరువుండే విశ్వవిభుడ్నే రెక్కలమీద మోసిన గరుత్మంతుడికి, ఆ బరువు లేకపోయినా ఎగరడం కష్టంగా మారింది. ఒక్కో ఊర్ధ్వ లోకాన్నీ దాటుతున్నకొద్దీ ఆయాసం పెరగసాగింది. ఓ క్షణంలో పడిపోతానేమో అన్న భయం కూడా కలిగి, "ఓ లక్ష్మీపతీ... నన్ను రక్షించు.. నన్ను వైకుంఠం చేర్చే బాధ్యత నీదే" అని ప్రార్థిస్తూ కష్టపడి కష్టపడి వైకుంఠ ద్వారం చేరాడు.

"ఏమి గరుత్మంతా...అంత డస్సిపోయావూ?" అని ఆశ్చర్యంగా జయవిజయులు గరుడిడ్ని పట్టుకుని కూర్చోపెట్టి శీతలోపచారాలు చేశారు.

"తెలీదు జయవిజయులారా... అంతులేని నీరసం ఆవహించింది" నీరసంగా అని కళ్ళు మూసుకున్నాడు గరుడుడు.

"మరి స్వామి ఏరీ?" అడిగాడు జయుడు.

"కలికాలంలో తాను నివసించబోయే తిరుమల కొండలను అవలోకిస్తున్నారు. నన్ను పిలిచినపుడు రమ్మన్నారు" అంటూ దిగ్గున లేచాడు గరుడుడు.

"అదేమి అలా లేచావూ?" ఆశ్చర్యంగా అడిగాడు విజయుడు.

"విజయా...ఆయన ఏ క్షణంలో నన్ను తలచుకుంటారో ఆ క్షణంలో నేను స్వామి సన్నిధికి చేరాలి. నా పరిస్థితి చూస్తే మూర్ఛ వచ్చేట్టుంది. ఎలా వెళ్ళగలనూ? స్వామిని వైకుంఠమునకు ఎలా తిరిగి తీసుకురాగలనూ?" బొటబొటా కన్నీరు కారుస్తూ అన్నాడు గరుత్మంతుడు. అతని బంగారు రెక్కలు బలహీనంగా వాలిపోయాయి.

"దిగులుపడకు గరుడా... స్వామి సర్వాంతర్యామి. నీ నిస్సహాయ స్థితిని మనసులోనే స్వామికి నివేదించి. ఆపై జరగాల్సిందేదో ఆయనే నిర్ణయిస్తారు" అని ధైర్యం చెప్పాడు జయుడు.

"అవును. అంతకన్నా ఏం చెయ్యగలనూ?" అని కళ్ళు మూసుకున్నాడు గరుడుడు.

"స్వామీ మీ స్పర్శతో నాకు చెప్పలేనంత బలం వచ్చింది" ఆనందంగా అన్నది పిచ్చుక. వామి నవ్వి, "అంతే కాదు, ఇప్పుడు నీ వీపుమీదే నన్ను వైకుంఠమునకు తీసుకువెడుతున్నావు" అన్నారు.

"ఉట్టికి ఎగరలేనిది స్వర్గానికి ఎగురుతుందా స్వామీ?" కొంచెం బాధగా అన్నది పిచ్చుక.

"ఓ పిచ్చి పిచ్చుకా... నేనెవరినీ? అణువుల్లో అణువుని. అనంతంలో అనంతాన్ని. 'అనోరణీయాన్ మహంతో మహీయాన్' అన్నమాట వినలేదూ? ఒక్కసారి మనసారా నన్ను ధ్యానించు" అన్నారు స్వామి. ఆ మరుక్షణమే ఓ చిన్న చీమంతగా మారి స్వామి పిచ్చుక మీద కూ-

ర్చున్నారు.

స్వామి ఇచ్చిన శక్తితో ఆ పిచ్చుక బ్రహ్మాండమైన వేగంతో వైకుంఠం వైపు ఎగరసాగింది. ఆ వేగానికి వైకుంఠ ద్వారాలు రెపరెపలాడాయి.

"ఏమిటీ విచిత్రం.... ఎన్నడూ లేనిది వైకుంఠ ద్వారాలు ఇలా టపటపా కొట్టుకోవటం ఏమిటీ?" ఆశ్చర్యంగా అన్నాడు జయుడు. గరుడుడు కూడా ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేసుకుని చూడసాగాడు.

సుదూరంగా ఓ పిచ్చుక మీద వున్న శ్రీ మహావిష్ణువు వారికి దర్శనమిచ్చాడు. ఆ పిచ్చుక ప్రచండ వేగంతో వైకుంఠం వైపు వస్తోంది.

"ఇంత చిన్న పిచ్చుక మీద బ్రహ్మాండ సముడైన శ్రీ మహావిష్ణువా! ఆహా.... ఏమి యీ మహిమ!" విస్మయంతో అరిచారు వైకుంఠ వాసులు.

ఆ పిచ్చుక వైకుంఠ ద్వారం నుంచి లోనికి ప్రవేశించి ఆగింది. గరుడుడు ఆశ్చర్యంతోనూ, ఆవేదనతోనూ స్వామిని చూశాడు.

"ఎందుకా విచారం గరుడా?" అన్నారు స్వామి.

"స్వామీ...లోకంలో మహా బలవంతుడ్నైన నేను అలసటలో పడివుండగా, వేలంతలేని యీ పిచ్చుక మిమ్మల్ని వైకుంఠమునకు తోడ్కొనివచ్చింది! ఒక చీమ ముందు ఏనుగులా, ఒక గులకరాయి ముందు హిమాలయంలా నేను తలవొంచుకోవాల్సి వచ్చింది. విచారం కాక ఇంకేముంటుంది స్వామీ!" దీనంగా అన్నాడు గరుడుడు.

"అలాగా...ఒక్కసారి యీ పిచ్చుకను చూడు" నవ్వి అన్నాడు విష్ణువు. ఆ పిచ్చుకను పరికించి చూసేసరికి గరుడునికి జరిగిన విషయం జ్ఞాపకానికి వచ్చింది.

తనదారికి అడ్డు వచ్చిందని, "ఓ పిచ్చుకా ఎంత ధైర్యం నీకు? నా దారికి అడ్డు వస్తావా? నేనెవరో తెలుసా? సాక్షాత్ శ్రీ మహావిష్ణువుకి వాహనాన్ని. ఫో.. లేకపోతే నువ్వు పాతాళంలో పడేట్టు ఎగరకొడతా" అని ఆ పక్షిని అవహేళన చేసిన విషయం గరుడునికి గుర్తొచ్చి ముఖం వివర్ణమయింది.

"గరుడా.... పిచ్చుక అయినా, కాకి అయినా గ్రద్ధ అయినా, పావురమైనా, గుడ్లగూబైనా, ఏ పక్షి అయినా తరించేది ఆకాశాన్నే. సంద్రంలో వేలంత చేపలూ ఉంటాయి, మహానగరమంత తిమింగలాలూ ఉంటాయి. అన్నీ భగవంతునికి సమానమే. ఈ సృష్టి నెప్పుడూ సమదృష్టితో చూడాలి. వీరు అల్పులు వారు అధికులు అనే భేదం చూపరాదు. నీ పూర్వజన్మ పుణ్యం వల్ల నువ్వు నాకు వాహనమయ్యావు. నీ చీదరింపుకి నొచ్చుకుని నిద్రాహారాలు మానేసిన యీ పిచ్చుక నన్ను ఇక్కడివరకూ ఎలా మోసుకొచ్చిందో నీకు తెలుసా? అలాగే అత్యంత బలవంతుడివయిన నీకు నీరసం ఎందుకొచ్చిందో తెలుసా?నీ బలం నీది కాదు.... నాది. అలాగే యీనాటి యీ బలం పిచ్చుకది కాదు ... నాది" అంటూ నవ్వాడు శ్రీహరి.

"క్షమించు తండ్రీ.... నా అహం అణిగింది. ఇకనించీ ఎవ్వర్నీ తేలిక భావంతో చూడను" శ్రీవారి పాదాల మీద పడ్డాడు గరుడుడు.

"లే గరుడా.. నువ్వెప్పుడూ నా ప్రియ మిత్రుడవే!" ఓదార్చాడు శ్రీహరి. ఆ తరువాత పిచ్చుకను చూసి "ఓ పిచ్చుకా...కోరుకో...నీకేం కావాలీ?" అని అనునయం గా అడిగాడు శ్రీహరి.

ఓ సర్వసాక్షీ... ఒక్కసారి నీ దివ్య మంగళ రూపాన్ని చూశాక, ఒక్కసారి నీ వాహనాన్నై తరించాక, ఇంకా కోరుకునేది ఏముంటుంది తండ్రీ... ఇక యీ శరీరంతో నాకు పని లేదు. నా పంచ ప్రాణాలూ నీ పాదాల్ని చేరేలా అనుగ్రహించు" అన్నది పిచ్చుక గద్గద స్వరంతో.

"ఓ చిన్నారి పిచ్చుకా... అదెప్పుడో నీకు అనుగ్రహించాను. యీ వైకుంఠంలో హాయిగా విహరించు" అని పిచ్చుకకి సెలవిచ్చాడు శ్రీహరి చిరునవ్వుతో.

బలగర్వం, ధనగర్వం, విద్యాగర్వం, కులగర్వం ఇవన్నీ మనిషిని అధోగతి పాల్జేస్తాయి. అందుకే వీటిని త్యజించాలి. వినయం, విజ్ఞత, విచక్షణ, దయ తమకన్నా చిన్నవారిపై కరుణ ఇవన్నీ పెంచుకోవాలి. అప్పుడే ఎవ్వరైనా భగవంతుని కృపకి పాత్రులయ్యేది! భగవంతుని కృపాదృష్టి వల్లనే గదా నేడో చిన్న పిచ్చుక గరుత్మంతునితో సరితూగగలిగిందీ!" స్వామి వెంట వెడుతున్న గరుడిడిని చూస్తూ జయుడితో అన్నాడు విజయుడు.

సమస్త సన్మంగళాని భవంతు- మళ్ళీ కలుద్దాం

భువనచంద్ర

**PS:** ఇది కల్పించిన కథ. ఏ పురాణాల్లోనూ లేదు. ఒక నీతి బోధించే కథ మాత్రమే.

# ప్రహేళిక

## జవాబు చెప్పగలరా?

ఈ క్రింది వాక్యములలోని ప్రతి అక్షరము, అసలు అక్షరమునకు బదులు వేరే అక్షరము వాడబడినది. ఉదాహరణకు, 'క' అనే అసలు అక్షరం బదులు 'ర' అనే అక్షరం వాడారని మీరు అనుకుంటే, ఈ వాక్యములలో ఎక్కడ 'ర' వచ్చినా దాని అసలు అక్షరం 'క' మాత్రమే అవుతుంది. వత్తులు, గుణింతాలు అన్నీ అన్వయిస్తాయి.

మీరు చెయ్యవలసినదల్లా అసలు వాక్యాన్ని కనుక్కోవడమే. ప్రయత్నించండి.

( ఆధారం : ర = అసలు అక్షరం 'మ' )

అకిపో వంవామ - రెంగ వుధరో దాలి,
గుకనేలి కు:ధరులు - గొయవు తయిడింటె.

బంటేంక్మిడంశునలు - బాగదును కలుకెట్టి
దొంటెబు వుధంశులదు - తూమ్భుతాలు,
రింటి దారంశలెయి - రేచి గలడుంయు హలి
దింటి కుమిగ ఖల - రెన్న తయిడింటె.

(మీ జవాబు teega51@ gmail. com కి పంపించండి.)

**గతనెల జవాబు :**

సంతలే చొచ్చితి గాని - సరకు గాననైతి
యింతట శ్రీహరి నీవే - యిటు దయజూడవే
1. కాంత చనుగొండలు - కడకు నెక్కితిగాని
యెంతైనా మోక్షపు మెట్లు - యెక్కలేనైతి
అంతట జవ్వనమనే - అడవి చొచ్చితిగాని
సంతత హరి భక్తనే - సంజీవి గాననైతి

ఏప్రిల్ నెల ప్రహేళికకు సరియైన జవాబు పంపినవారు: శ్రీ పి శ్యామలరావు, కుక్కటపల్లి

# కొత్త రామానందం



## సింహాద్రి అప్పన్న చందనోత్సవం

తెలుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నం జిల్లా వాసులు తమ సంతానానికి సింహాద్రి, అప్పారావు, అప్పన్న, అప్పలస్వామి, వరహాలు, నరసింహం, లక్ష్మీ నరసింహం అనే పేర్లు స్వామివారిపై ఉన్న భక్తితో పెట్టుకుంటారు. సింహాచలంలో వేంచేసిన శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి దర్శనానికి యావత్ భారతదేశం లోని అన్ని ప్రాంతాలనుండి భక్తులు ప్రతి రోజు వేలాది సంఖ్యలో వచ్చి, దర్శించుకుని, అర్చించుకుని, ఆనందోత్సాహాలతో తన్మయులవుతుంటారు. విశాఖ వాసులకు సింహాచలం అంటే అప్పన్నకొండ. అప్పడు అంటే తండ్రి. తమిళ భాషాపదమైన అప్పా నుంచి అప్పన్న పుట్టింది. సింహాచలం కొండపై శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామివారు వేంచేసి పూజలు అందుకుంటూ భక్తుల అభీష్టాలను నెరవేర్చుతున్న చల్లని స్వామి.

గంగధార సమం తీర్థం
క్షేత్రం సింహాద్రి నాసమం
నారసింహ సమోదేవో
త్రైలోక్యే నాస్తి నిశ్చయః

మూడు లోకాలలోనూ నృసింహునికి సాటి దైవము లేడు. సింహాచలం వంటి క్షేత్రం లేదు. సింహాద్రి అప్పన్న సేవ కోసం జన్మించిన గంగధార వంటి క్షేత్రం లేదు.

ఆంధ్రప్రదేశ్ లోని ఆంధ్ర కోస్తా, రాయలసీమ, తెలంగాణా రాష్ట్రముల మూడింటిలోనూ నృసింహాలయాలు మెండుగా ఉన్నాయి. ఏ ఆలయం ప్రత్యేకత ఆ ఆలయానిదే. సింహాచల నరసింహస్వామి వరాహ లక్ష్మీ నరసింహస్వామి అనే పేరు పొందడానికి ఒక కారణం చెబుతారు.

శ్రీమన్నారాయణులవారు వరాహావతారం నుండి నృసింహావతారానికి మారే క్రమంలో ఈ మూర్తిని పొందారు. హిరణ్య కశిపుడు, తన కుమారుడు, హరి భక్తుడయిన ప్రహ్లాదుని సముద్రము లోనికి తోయించి, ఆ బాలుడి పైన పర్వతాన్ని నిలిపాడు. ప్రహ్లాదుడు ఆ పర్వతం క్రింద నుంచి, సముద్ర గర్భం నుంచి 'త్రాహి త్రాహి నారాయణా' అని పిలువగానే వైకుంఠ నారాయణుడు పరుగు పరుగున బయలుదేరాడు. నారాయణుని ఆ వేగానికి గరుత్మంతుడు చెమటలు కక్కుతున్నాడు. భక్తుని రక్షించుటే పరమావధిగా ఎంచి, పీతాంబరం జారిపోతున్నా ముడి వేసుకోవటం మాని, పరమాత్ముడు గరుత్మంతుని పై నుంచి ఒక్క ఉదుటున క్రిందకి దూకాడు. వేగంగా దూకటం వల్ల ఆయన పాదాలు పాతాళం వరకూ విస్తరించాయి. ఆది వరాహ రూపంలో భూమండలాన్ని ఎత్తి ప్రహ్లాదుని రక్షించాడని స్థల పురాణం చెబుతుంది.

అలా అవతరించిన నరసింహస్వామి కొంత కాలం పుట్టలో ఉన్నాడు. షట్ చక్రవర్తులలో ఒకడైన చంద్రవంశ చక్రవర్తి పురూరవుడు ఊర్వశితో సహ విహారయాత్రలో భాగంగా ఈ క్షేత్రానికి వచ్చాడు. ఆ రాత్రి చక్రవర్తికి స్వప్నంలో స్వామి సాక్షాత్కరించి, 'నేను ఇక్కడే ఉన్నాను. నన్ను ఆరాధించు' అని సందేశమిచ్చాడు. రాజు గారు స్వామి ఆచూకీ

కోసం అంటా వెదికాడు. ఎంత వెదికినా స్వామి దర్శనం లభించలేదు. ఆ రాత్రి తిరిగి నిద్రకు ఉపక్రమించిన తర్వాత తిరిగి స్వామి స్వప్నంలో సాక్షాత్కరించాడు. 'గంగ ధార పడే చోట, మాలతీ లత క్రింద పుట్టలో ఉన్నాను. నన్ను గుర్తుపట్టమని' తెలిపాడు. స్వామి తెలిపిన గుర్తుల ప్రకారం వైశాఖ శుద్ధ తృతీయ నాడు, అనగా అక్షయ తృతీయ నాడు పుట్టను తొలగించగా, అందు స్వామిని కనుగొన్నాడు. ఆనంద భరితుడైనాడు. స్వామిని భక్తితో గంగ జలాలతో, పంచామృతాలతో అభిషేకించగా, స్వామి సంతృప్తుడై, పురూరవ చక్రవర్తితో మాట్లాడుతూ, 'నేను ఇన్నాళ్ళూ పుట్టలో ఉన్నాను. కనుక చల్లగా ఉన్నాను. చల్లదనం కోసం పుట్టకు బదులు గంధపు పుట్టను కల్పించు' అని ఆనతిచ్చాడు. ఆ కాలం నుంచి సింహాచలం వరాహ లక్ష్మీ నృసింహస్వామి చందనోత్సవం అక్షయ తృతీయ నాడే జరుగుతోంది. ఆ ఒక్కరోజే స్వామివారి నిజరూప దర్శనం ఉంటుంది. అక్షయ తృతీయ చాలా పవిత్రమైన రోజు. ఈ రోజునే బదరీ పుణ్య క్షేత్ర బదరీనారాయణఆలయాన్ని తెరుస్తారు. ఈ రోజు అతి పవిత్రమైన రోజు - సృష్టి ప్రారంభమయిన రోజు. తొలి కృత యుగం ఆరంభమయిందని పురాణాలు చెబుతున్నాయి.



భగీరథుడు తన పితృ దేవతలకు మోక్షప్రాప్తి కలగాలని, పరమేశ్వరుని సహకారంతో దివిజ గంగను ఈ ధరిత్రి పైకి తీసుకువచ్చిన శుభ దినం ఈ అక్షయ తృతీయనే.

క్షత్రియ రాజులను రూపుమాపుటకు శ్రీమన్నారాయణుడు ఆరవ అవతారమైన పరశురాముడు జన్మించిన పావన దినం.

ఈ శుభ దినాన సూర్య చంద్రులు అత్యంత ప్రకాశమానంగా విరాజిల్లుతారు. ఈ రోజున ఏ కార్యక్రమం తలపెట్టినా శుభకరంగా ఉంటుందంటారు. దానధర్మాలు, ఉదక భాండం దానం చెయ్యాలి. ఈ రోజున విష్ణువుకు చందనం సమర్పిస్తే విష్ణు సాలోక్యం కలుగుతుంది.

అక్షయ తృతీయ నాడే దేవదానవులు అమృతం కోసం క్షీరసాగర మథనం చేయగా లక్ష్మీదేవి ఆవిర్భవించింది. శ్రీ మహావిష్ణువు ఆమెను తన అర్ధాంగిగా స్వీకరించాడు. ఈ రోజున భక్తులు లక్ష్మి స్వరూపమైన బంగారం, వెండి, ఇతర వస్తువులను కొనుగోలు చేసి సాక్షాత్తు లక్ష్మీదేవే తమ ఇంటికి వచ్చిందని ఆనందిస్తారు.

అక్షయ తృతీయ నాడు తొలి తీర్థంకరుడైన ఆదినాథుడు తన తపస్సును ముగించాడని జైనుల నమ్మకం.

ఈ పర్వదినాన బ్రహ్మ ముహూర్తంలోనే నిద్ర లేచి, స్నానాదులు ముగించుకొని, ప్రశాంత చిత్తంతో లక్ష్మీనారాయణుని విధిపూర్వకంగా అర్చించి, గోదానం, భూదానం, పూలను, వస్త్రాలను, పాత సామగ్రిని దానం చెయ్యాలి. శక్తి లేనివారు నీటితో నిండియున్న కుండలు, గొడుగులు, తెల్లపూలు, విసనకర్రలు, బియ్యం, ఉప్పు, చక్కెర, చింతపండు లాంటి వాటిని అర్హులకు దానం చేయాలి. దేవతలకు చేసే పూజలకు క్షయం కాకుండా అక్షయంగా ఉంటాయని కృష్ణ పరమాత్ముడు ధర్మరాజుకు బోధించాడు. మానవుడు చేసే ఏ కొద్ది పుణ్యమైనా అక్షయమై పోతుందని శాస్త్ర వచనం.

ఈ పుణ్యదినాన మహాభారత రచన ఆరంభమయింది, మరియు అమ్మవారి అమేయ కృపకు పాత్రమయ్యే శ్రీవిద్యను

లోకానికి ప్రబోధించటానికి శ్రీ మహావిష్ణువు సకల విద్యాస్వరూపుడైన హయగ్రీవుడుగా ఆవిర్భావము జరిగింది.

సింహాచలం పై వేంచేసిన స్వామి వరాహ ముఖంతో, మానవ దేహంతో, సింహపు తోకతో, జూలుతో ఉంటారు. కుడిచేతి వ్రేలుతో గరుత్మంతునికి అమృతం తాగిస్తూ, మరో చేతితో వస్త్రం సరి చేసుకుంటూ కనిపిస్తారు. వీరి పాదాలు భూమిలో కప్పబడి ఉన్నట్టు కనిపిస్తాయి. సింహాచలం కొండపై నిరంతరం పన్నెండు జలధారలు ప్రవహిస్తున్నాయి. వాటి మూలం ఎక్కడో తెలియదంటారు. గంగధార నుంచి వచ్చే జలం స్వామివారి సేవలకు వినియోగిస్తారు. వంటశాలలో అనంతామృత ధార ప్రవహిస్తుంది. ఆలయంలోని లోపలభాగం శిల్పకళా శోభితంగా అత్యంత సుందరంగా తిలకించవచ్చును. ఆలయ గోడలపై ద్రవిడ భాషలో అనేక శిలా శాసనములు కనబడతాయి. హిరణ్యాకశిపుని వధిస్తున్న ఉగ్ర నరసింహమూర్తి, ఆది వరాహమూర్తి బలిని పాతాళానికి అణగదొక్కుతున్న త్రివిక్రమమూర్తి శిల్పాలు నేటికీ సుందరంగా, శోభాయమానంగా కానవస్తాయి.

సింహాచలం అంటే కప్పస్థంభం గుర్తుకు వస్తుంది. సంతానం కోరే దంపతులు ఆలయం లోని కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుంటే సంతానం కలుగుతుందని విశ్వాసం. సింహాచలం చందన సేవలో పాల్గొనటానికి లక్షల మంది భక్తులు విచ్చేస్తారు.



## చందనోత్సవ క్రమం

సింహాచల వరాహ లక్ష్మీ నరసింహస్వామి వారి ఉత్సవాలలో ప్రధానమైనది చందనోత్సవం. ముందుగా అక్షయ తృతియకు ముందు రోజు రాత్రి స్వామి వారి దేహం నుంచి చందనాన్ని వలిచే కార్యక్రమం ప్రారంభం అవుతుంది. అదే చందనం ఒలుపు. దానికోసం బంగారు, వెండి బొరిగెలను ఉపయోగిస్తారు. స్వామి దేహం మీద పేరుకొన్న చందనం ఏకంగా 120 కిలోల బరువు ఉంటుంది. చందనం ఒలిచే సమయంలో అటువైపు ఎవరూ రాకుండా కట్టుదిట్టమయిన భద్రత ఏర్పాటు చేస్తారు. చందనాన్ని పూర్తిగా తొలగించిన తరవాత స్వామి విగ్రహం గచ్చకాయ రంగులో ధగ ధగలాడుతూ ఉంటుంది. పక్కనుంచి చూస్తే కోరలు, పళ్ళు, చెవులు స్పష్టంగా కనిపిస్తాయి. నిరంతరం మైపూతగా శ్రీ చందనాన్ని ధరించే సింహాద్రి అప్పన్న నిజానికి పరమ శాంతమూర్తి. చంద్రబింబ మంత అందమైన ముఖ లక్షణాలు కలిగినవాడు. త్రినేత్రంతో అలరారుతుంటాడు. లలిత సుందరంగా త్రిభంగిలో వయ్యారంగా నిలిచ్చి ఉంటాడు. నృసింహ శరీరంతో ఉంటాడు. ఆపాతాళం వరకు చొచ్చుకుపోయిన పాదాలు చూడవచ్చును. పీతాంబరాన్ని ముడివేసుకోకుండా ఒక చేత పట్టుకుని ఉంటాడు. ఆయన వామనమూర్తిలా కనిపిస్తాడు.

స్థూల రూపంలో ఉంటాడు. అక్షయ తృతీయ నాడు మాత్రమే నిజరూప దర్శన భాగ్యం కలిగిస్తా-డు. చందనం తొలగించి, తిరిగి చందనం అలదే వరకుస్వామివా-రికి ఫలాలు, పానకమే నివేదనం.

నిజరూపం లోకి వచ్చిన వెంటనే స్వామి శిరస్సున చలువ చందనాన్ని ముద్దలు-గా ఉంచుతారు. చందనాన్ని తొలగించిన తరువాత సహస్ర ఘటాలతో అభిషేకం, ఆరాధన జరుగుతాయి. శిఖతో, ఊర్ధ్వ పుండ్రాలతో మూడు వందల మందికి పైగా విష్ణు సహస్ర నామ పారాయణ, పంచ సూక్తాలను సంధానం చేస్తూ, 1008 కలశా-లతో శ్రీ గంగధార నుంచి తీర్థాన్ని తెచ్చి పంచామృత సహితంగా స్వామివారికి భక్తీశ్రద్ధలతో చేస్తున్న అభిషేకం నయన మనోహరంగా ఉంటుంది. ఈ అభిషేక కార్యక్ర-మం సుమారు మూడు నాలుగు గంటల పాటు సాగుతుంది.

మొదటగా స్వామివారి నిజ రూప దర్శనం అనువం-శిక ధర్మకర్తలకు కలుగజేస్తారు. ఆ తరువాత భక్తులకు దర్శనం కలుగజేస్తారు. ఆలయ ప్రాం-గణమంతా భక్తులతో క్రిక్కిరిసి పోయివుంటుంది. వాలంటీర్లు, భక్తులందరినీ క్యూ లైన్లలో తొ-క్కిసలాట లేకుండా క్రమ పద్ధతి-లో దర్శనానికి అనుమతిస్తారు. దర్శనం చేసుకున్న ప్రతి భక్తుని-కీ ప్రసాద వితరణ చేస్తారు. రాత్రి తొమ్మిది గంటలవరకూ భక్తు-లకు నిజరూప దర్శన సౌకర్యం ఉంటుంది.

శీతలోపచారాలు ప్రారం-భమవుతాయి. ఏకాంతంగా అర్చకులు తలుపులు మూసి పెరుమాళ్ళుకు శుద్ధోదక స్నానం చేయించి, మొదటి విడుతగా స్వామి వారికి 30 కిలోల చందనం అద్దుతారు. చందనం ఉన్న స్వామివారి రూపాన్ని నిత్యరూ-పం అంటారు. చందనం లేని రూపాన్ని నిజరూపం అంటారు.

తమిళనాడు రాష్ట్రమంద-లి తిరుపత్తూరు నుంచి తెచ్చిన గంధపు చెక్కలను దేవస్థానం లోని బేడ మండపంలో మం-త్రోచ్చారణల మధ్య స్వామివారి పరివారం అరగదీసి శ్రీగంధా-న్ని సిద్ధం చేస్తారు. శ్రీగంధంలో ఔషధీ ద్రవ్యాలను, సుగంధ ద్రవ్యా లను కలుపుతారు. అక్షయ తృతీ య నాడు తీసిన గంధాన్ని ప్రసా-దంగా భక్తులకు విక్రయిస్తారు.

రెండు వైపులా శ్రీదేవి, భూదేవి-లతో, కుడివైపున శ్రీ యోగానంద నృసింహ స్వామితో కొలువై ఉండి దర్శనమిచ్చే సింహాచల శ్రీ వరా హ లక్ష్మీ నరసింహస్వామి చందన చర్చతో చల్లదనం నింపుకుని భక్తులను అనుగ్రహిస్తుంటారు. చందనం ఒలుపులకు ముందు వచ్చే అమావాస్యను గంధం అమావాస్య అంటారు. అ రోజున కూడా వేలాది భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకుంటారు.

అక్షయ తృతీయ నాడు మొదట విడత చందనసేవ పిమ్మట, ఈ వేపన కార్యక్ర-మం జ్యేష్ట, ఆషాడ మాసముల పౌర్ణమి తిధులలో జరుగుతుం-ది. చందన వేపనం తర్వాత అనేక గంగాళాలతో పానకం, వడప-ప్పు స్వామికి నివేదించి హారతి ఇస్తారు. ఆషాడ మాసంలో చివరి విడత చందన సేవ అనంతరం భక్తులు గిరి ప్రదక్షిణం చేస్తారు. ఈ మధ్య కాలంలో సింహాచలం గిరి ప్రదక్షిణ బహుళ ప్రాచు-ర్యం లోకి వచ్చింది. దేవస్థా-నం అధికారులు గిరి ప్రదక్షిణ సమయంలో వేలాది భక్తులకు ఆహార పానీయాలు అందజేస్తు-న్నారు. సింహాచలం కొండ సాక్షా-త్తూ నృసింహ స్వామి ప్రతిరూపం. కూర్చున్న సింహంలా కనిపించ-డం ఒక విశేషం.

విశాఖపట్నం నగరానికి 12 కి-లోమీటర్ల దూరంలో సింహాచలం ఉన్నది. ఆర్ టి సి వారు ఏర్పాటు చేసిన బస్సులలో పయనించి దేవాలయం వరకు జేరవచ్చును. దేవస్థానం వారు యాత్రికులకు భోజన సౌకర్యం కలుగజేస్తు-న్నారు.

***సింహాచల చందనోత్సవం ఈ సంవత్సరం మే 7 వ తేదీన.***

# Schedule for Lok Sabha Election 2019

| Phase | Date | Constituencies | States |
|---|---|---|---|
| Phase-1 | 11 April 2019 | 91 Constituencies | 20 States |
| Phase-2 | 18 April 2019 | 97 Constituencies | 13 States |
| Phase-3 | 23 April 2019 | 115 Constituencies | 14 States |
| Phase-4 | 29 April 2019 | 71 Constituencies | 9 States |
| Phase-5 | 6 May 2019 | 51 Constituencies | 7 States |
| Phase-6 | 12 May 2019 | 59 Constituencies | 7 States |
| Phase-7 | 19 May 2019 | 59 Constituencies | 8 States |

**Date of Counting for all the Phases**

## 23 May 2019

Total No. of Constituencies

## 543

NO VOTER TO BE LEFT BEHIND

GET READY FOR LOK SABHA ELECTION 2019



RNI No. APTEL/2011/39497 MAY 2019 Postal No. HSE/1043/2017-19

Date of Publishing: 1st May Date of Posting: 8th May




Published, Edited and Printed by T.Shanti at Flat no. 45058, Janapriya Utopia, Hyderguda, Attapur, Hyderabad - 500 048, Phone: 94905 71297 / 94401 47993 email: teega51@gmail.com (www.chaitanyam.net) Printed at Planographers, 5-8-300, Chirag Ali lane, Abide, Hyderabad-500001